www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శనివారం | 27-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 291 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.1:10 తదుపరి అష్టమి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.9:10 తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం:రా.6:35-8:09, దుర్ముహూర్తం: ఉ.6:47-8:15, అమృతఘడియలు: తె.4:00-5:34, రాహుకాలం: ఉ.9:00-10:30, సూర్యోదయం: 6:47, సూర్యాస్తమయం: 5:45 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఐటీలో మనం బలంగా ఉన్నాం. ప్రపంచంలో పేరున్న ఐటీ కంపెనీలకు భారతీయులే సారథ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరుకుని తీరుతుంది. రాబోయే అనేక శతాబ్దాల పాటు భవిష్యత్తు భారత్‌దే.
- సీఎం చంద్రబాబు



భారతీయ విజ్ఞాన సమ్మేళనాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తదితరులు

దేశానికి జనాభాయే ఆస్తి

ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి
వృద్ధ ప్రపంచంలో యువ దేశం మనదే: సీఎం

- ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల భారతీయులు
- తలసరి ఆదాయంలో మన వాళ్లే టాప్
- 2047 నాటికి ప్రపంచంలో నం.1 మనమే
- మన కుటుంబ వ్యవస్థ విలువలు గొప్పవి
- పిల్లలకు పురాణాల గురించి చెప్పాలి
- స్పైడర్‌మ్యాన్ కన్నా హనుమాన్ బలవంతుడు
- భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో సీఎం

తిరుపతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): "భారతీయ కుటుంబ వ్యవస్థ అద్భుతమైనది. మన కుటుంబ విలువలు ప్రపంచంలో మరెక్కడా ఉండవు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం తిరుపతిలో విజ్ఞాన భారతి సంస్థ నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన

మిగతా 13వ పేజీలో...

భారత్ విశ్వగురు కావాలి

- భారతీయుల రక్తంలోనే ధర్మ దృష్టి
- విజ్ఞానం అంటేనే ప్రపంచ శ్రేయస్సు
- విజ్ఞాన శాస్త్రానికి వివేకం, నైతిక విలువల్ని జోడించాలి..
- ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్ ఉద్ఘాటన

తిరుపతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత్ విశ్వగురు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ ఆకాంక్షించారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. "భారతీయుల రక్తంలోనే ధర్మ దృష్టి ఉంది. ప్రకృతిలో మనుషులే కాకుండా జంతువులు, పక్షులు, చెట్లు సహా

మిగతా 13వ పేజీలో...

రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే

రాజకీయాల ముసుగులో నేరాలు చేస్తే ఊరుకోం: సీఎం

తిరుపతిలో నూతన పోలీస్ కార్యాలయం ప్రారంభించిన చంద్రబాబు

'మెడికల్ అన్‌ఫిట్'లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు



- ఆరేళ్ల సమస్యకు సీఎం చంద్రబాబు పరిష్కారం
- డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర ఉద్యోగులకు సైతం ప్రయోజనం
- ఆర్టీసీలో అర్హత లేకుంటే ఇతర విభాగాల్లో ఇచ్చేలా ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెడికల్ అన్‌ఫిట్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వంలో విలీనమైన తర్వాత అనారోగ్యం బారినపడిన ఆర్టీసీ సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇచ్చేందుకు సమ్మతించింది. ఈ మేరకు శుక్రవారం రవాణాశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేయడంతో ఉద్యోగ సంఘాల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఏపీఎస్ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కాక ముందు కార్పొరేషన్‌గా పాలక మండలిలో చర్చించి సొంత నిర్ణయాలు తీసుకునేది. సర్వీసులో ఉండి చనిపోయిన సిబ్బంది కుటుంబంలో

మిగతా 14వ పేజీలో...

కృష్ణా జిల్లాలో చమురు, గ్యాస్ అన్వేషణ 14

20 బావుల తవ్వకానికి వేదాంత సంస్థకు షరతులతో అనుమతి





సైబర్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న సిమ్ బాక్స్‌లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, సీసీ కెమెరాలు

20 కోట్లు కొల్లగొట్టి.. సీఐడీకి చిక్కి

- గాజువాకలో అంతర్జాతీయ సైబర్ ముఠా అరెస్ట్ 14
- దేశంలో పలుచోట్ల డెన్లు ఏర్పాటు చేసుకుని మోసాలు

సెలవుల మూడ్‌లో సచివాలయం

- 25వ తేదీ నుంచి 5 వరకు ఎఫెక్ట్
- మధ్యలో 7 సాధారణ, ఐచ్ఛిక, వారాంతపు సెలవులు 14

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి.. గంజాయి డాన్‌గా!

- అనకాపల్లి జిల్లాలో మాజీ మహిళా టెకీ సహా 8 మంది అరెస్టు 12
- ఆమెపై ఇప్పటికే 4 గంజాయి కేసులు

ఆర్టీఐ కమిషనర్లపై కసరత్తు కొలిక్కి!

- చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు పేరు పరిశీలన
- మరో ఐదుగురిని కమిషనర్లుగా నియమించే అవకాశం 14
- ముగ్గురు లాయర్లకు చాన్స్
- టీడీపీ నేతలతో సీఎం చర్చ

జోగి చెప్పాడు.. మేం చేశాం!

- ఆయన ప్రోత్సాహంతోనే నకిలీ మద్యం తయారీ
- అప్పులపాలైన మాకు సలహా ఇచ్చింది ఆయనే
- 2023లో ఇబ్రహీంపట్నంలో తయారీ ప్రారంభం
- కూటమి వచ్చాక కొద్ది రోజులు ఆపి మళ్లీ మొదలు
- జూన్-జూలైలో ములకలచెరువులో ఆరంభం
- ఎక్సైజ్ విచారణలో ఏ1 జనార్దన్‌రావు వెల్లడి
- ఐదుగురు నిందితులకు మూడు రోజుల కస్టడీ



రాయచోటి/ములకలచెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): "మాజీ మంత్రి జోగి రమేశ్ చెప్పాడు.. మేము నకిలీ మద్యం తయారీ ప్రారంభించాం. అప్పులపాలైన మాకు నకిలీ మద్యం తయారు చేయాలని సలహా ఇచ్చింది ఆయనే. ఆయన ప్రోద్బలంతోనే ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేశాం" అని ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు

మిగతా 14వ పేజీలో...



బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్ పెట్టాలంటే.. కసరత్తే బెస్ట్


- నిద్ర లేమి, ఒత్తిడి, పొట్ట చుట్టూ అధిక కొవ్వు, రెడ్‌మీట్, ప్రాసెస్డ్ మాంసం ఎక్కువగా తినడం ప్రధాన కారణాలు
- మెనోపాజ్ ఆలస్యమయ్యే మహిళల్లో, 30 ఏళ్లు దాటాక గర్భం దాల్చే మహిళలకు ముప్పు అధికం 2
- భారత వైద్య పరిశోధన మండలి అధ్యయనంలో వెల్లడి.. ఏటా 5.6% మేర కేసులు పెరుగుతాయని హెచ్చరిక



ఇలాగైతే డ్యాం నిర్వహణ ఎలా?

శ్రీశైలం ప్రాజెక్టులో ఇంజనీర్ల కొరత

సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు. వీటి నుంచి సాగు, తాగుకు నీరందించాలంటే నిర్వహణ ఎంతో కీలకం. నిరంతరం ఇంజనీర్ల పర్యవేక్షణ ఉండాలి. ముఖ్యంగా వరద సమయాల్లో డ్యాంను కనురెప్పలా కాపాడుకోవాలి. అయితే తెలుగు రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం ప్రాజెక్టులో కీలక బాధ్యతలు నిర్వర్తించే ఇంజనీరింగ్ అధికారుల పోస్టులను ఏళ్లు గడుస్తున్నా భర్తీ చేయడం లేదు. వివిధ హోదాల్లో 59 మంది ఇంజనీర్లు పనిచేయాల్సి ఉండగా.. 16 మందే ఉన్నారు. ఎస్ఈ, ఈఈ పోస్టులను ఇన్‌చార్జులతో సరిపుచ్చుతున్నారు. ఆపరేటర్లు కూడా అవసరమైనంత మంది లేరు. ఇది డ్యాం భద్రతకు ముప్పు తెచ్చిపెడుతుందని సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. 13



- వివిధ హోదాల్లో 59 ఇంజనీరింగ్ పోస్టులు
- వీటిలో 43 ఖాళీ.. పని చేస్తున్నది 16 మందే
- కీలకమైన ఎస్ఈ, ఈఈ స్థానాల్లో ఇన్‌చార్జులు
- ఓవైపు డ్యాం మరమ్మతులకు నిధుల మంజూరు
- ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- అప్రోచ్ రోడ్డు నిర్మాణం 10 రోజుల్లో మొదలు
- రెగ్యులర్ ఇంజనీర్లు లేకుండా ఇన్ని పనుల పర్యవేక్షణ సాధ్యమా..?
- చివరికి ఆపరేటర్ల నియామకమూ లేదు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిపుణుల ఆవేదన

రాష్ట్రమంతా రెవెన్యూ క్లినిక్‌లు

మన్యం మోడల్ అమలుకు ప్రభుత్వ ఆదేశాలు
ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో ఈ క్లినిక్‌లు

- ప్రతి సోమవారం 'గ్రీవెన్స్ డే'లో నిర్వహణ.. రెవెన్యూ డెస్క్‌కు పౌరుల పిటిషన్లు
- అంశాలవారీగా వేర్వేరుగా టేబుళ్లు.. ఆ రోజు రెవెన్యూ రికార్డులన్నీ అందుబాటులో ఉంచుకోవాలి.. కార్యాచరణ నివేదికను పిటిషనర్లకు ఇవ్వాలి
- ఏటీటీ, ఏటీఆర్‌లపై కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహశీల్దార్ రోజూ సమీక్షించాలి
- ఫిర్యాదుల పరిష్కార బాధ్యత తహశీల్దార్‌దే.. సీసీఎల్ఏ మార్గదర్శకాలు జారీ
- వీటికి విరుద్ధంగా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు.. జయలక్ష్మి హెచ్చరిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం మన్యం జిల్లాలో విజయవంతంగా అమలవుతున్న 'రెవెన్యూ క్లినిక్'ను రెవెన్యూ శాఖ అందిపుచ్చుకుంది. ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల పరిధిలో రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం ప్రజా విన్నపాల స్వీకరణ (గ్రీవెన్స్ డే) సందర్భంగా రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టరేట్లలో విధిగా వీటిని చేపట్టాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) జి.జయలక్ష్మి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. అర్జీలు, ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చే పౌరులతో ఎలా వ్యవహరించాలి.. ప్రజల నుంచి తీసుకున్న ఫిర్యాదులను రెవెన్యూ డెస్క్‌లలో ఎలా పరిష్కరించాలి.. అందుబాటులో ఉంచాల్సిన రెవెన్యూ రికార్డులు, ఇంకా కార్యాచరణ నివేదికలపై మరింత స్పష్టత ఇస్తూ మార్గదర్శకాలు కూడా జారీ చేశారు. రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలకు ప్రజల్లో సంతృప్త స్థాయిని తీసుకొచ్చేందుకు గత కొద్దిరోజులుగా తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే ఒకసారి సీఎం చంద్రబాబు వద్ద, మరోసారి

మిగతా 12వ పేజీలో...

సీపీఎం కంచుకోటలో కాషాయ పతాకం

- త్రివేండ్రం కొత్త మేయర్‌గా బీజేపీ నేత వీవీ రాజేశ్ ఎన్నిక
- త్రిపునిథుర, పాలక్కాడ్‌లోనూ ఆ పార్టీ విజయం 2

యాత్ర నుంచి తిరిగొస్తూ.. మృత్యు ఒడికి..

- 2 వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది దుర్మరణం
- నంద్యాల జిల్లాలో డివైడర్‌ను దాటి.. బస్సును ఢీకొట్టిన కారు 12
- గుంటూరులో పక్కన ఆగిఉన్న కారుపైకి బస్సు



ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో సమావేశంలో మాట్లాడుతున్న రాములు

కూల్‌గా మాట్లాడి.. అంతలోనే కుప్పకూలి 14

- మందడం రైతుల భేటీలో అపశ్రుతి
- ఎన్-8 రోడ్డు కింద స్థలాలు, ఇళ్లు కోల్పోతున్నవారితో భేటీకి రాములు
- మాట్లాడి కూర్చుంటుండగా గుండెపోటు
- మంత్రి కాన్వాయ్ కారులో ఆస్పత్రికి..
- అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ

కదులుతున్న కారులో యువతిపై గ్యాంగ్‌రేప్ 2

- ఇంటి వద్ద దిగబెడతామని చెప్పి అఘాయిత్యం
- రాజస్థాన్‌లో ఘోరం.. నిందితులు ముగ్గురు
- ఐటీ కంపెనీ సీఈవో, ఆ సంస్థ మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్, ఆమె భర్త అరెస్టు
- కారు వెబ్‌క్యామ్‌లో రికార్డయిన ఘటన

సీపీఎం కంచుకోటలో కాషాయ పతాకం

» త్రివేంద్రం కొత్త మేయర్‌గా బీజేపీ నేత వీవీ రాజేశ్ ఎన్నిక


వీవీ రాజేశ్, జీఎస్ ఆశానాథ్‌ల అభివాదం

తిరువనంతపురం, డిసెంబరు 26: నాలుగు దశాబ్దాలుగా సీపీఎం కంచుకోటగా ఉన్న తిరువనంతపురం నగరంలో ఇప్పుడు కాషాయ పతాకం ఎగురుతోంది. ఇటీవలి ఎన్నికల్లో 101 వార్డుల కార్పొరేషన్‌లో 100 స్థానాలకు ఎన్నికలు జరుగగా.. బీజేపీ 50 స్థానాలు గెలుచుకుంది. సీపీఎం సారథ్యంలోని ఎల్‌డీఎఫ్ 29, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 21, ఇండిపెండెంట్లు రెండు చోట్ల గెలిచారు. నగర మేయర్‌గా బీజేపీ తరఫున ఆ పార్టీ నేత వీవీ రాజేశ్ బరిలో నిలువగా.. ఆయనకు 51 ఓట్లు లభించాయి. ఎల్‌డీఎఫ్ అభ్యర్థి శివాజీకి 29, యూడీఎఫ్ అభ్యర్థి కేఎస్ శబరినాథన్‌కు 19 ఓట్లు వచ్చాయి. రాజేశ్‌కు ఒక స్వతంత్రుడు మద్దతిచ్చారు. రెండో ఇండిపెండెంట్ ఓటింగ్‌లో పాల్గొనలేదు. కేంద్ర మంత్రి సురేశ్ గోపి తదితరుల సమక్షంలో రాజేశ్ మేయర్‌గా పదవీప్రమాణం చేశారు. డిప్యూటీ మేయర్‌గా బీజేపీ మహిళా కౌన్సిలర్ జీఎస్ ఆశానాథ్ ఎంపికయ్యారు. రాష్ట్రంలో త్రిపునిథుర, పాలక్కాడ్ మున్సిపాలిటీలను కూడా బీజేపీ చేజిక్కించుకుంది. పాలక్కాడ్‌లో హ్యాట్రిక్ సృష్టించింది.

ఆస్తుల వివరాలివ్వకపోతే క్రమశిక్షణ చర్యలు

» ఐఏఎస్‌లకు కేంద్రం హెచ్చరిక

న్యూఢిల్లీ, డిసెంబరు 26: దేశవ్యాప్తంగా ఉన్న ఐఏఎస్ అధికారులు తమ ఆస్తుల వివరాలను గడువులోగా అందించాలని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. లేనిపక్షంలో క్రమశిక్షణ సహా ఇతర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. అవసరమైతే పదోన్నతులను కూడా నిలిపివేస్తామని పేర్కొంది. ఈ మేరకు ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సేవల అధికారులు జనవరి 31, 2026లోగా తమ స్థిరాస్తులకు సంబంధించిన ఇమ్మూవబుల్ ప్రాపర్టీ రిటర్న్(ఐపీఆర్) దాఖలు చేయాలని కేంద్రం సూచించింది.

అగర్‌బత్తీలకు కొత్త బీఐఎస్ ప్రమాణం!

న్యూఢిల్లీ, డిసెంబరు 26: అగర్‌బత్తిల పరిశ్రమలో ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారత్.. వీటి తయారీకి సంబంధించి కొత్త ప్రమాణాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చింది. అగర్‌బత్తిల తయారీలో వాడే కొన్ని పురుగుమందులు, సువాసన రసాయనాలను నిషేధిస్తూ వినియోగదారుల ఆరోగ్యం, భద్రతే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) 'ఐఎస్ 19412:2025'ను ప్రవేశపెట్టింది. కొత్త ప్రమాణానికి సంబంధించి అగర్‌బత్తిల తయారీలో నిషేధించిన వాటిలో.. అలెత్రిన్, పర్మెత్రిన్, సైపర్‌మెత్రిన్, డెల్టామెత్రిన్, ఫిప్రోనిల్ వంటి పురుగుమందులతో పాటు బెంజైనల్ సైనైడ్, ఎథైల్ అక్రిలేట్, డైఫెనిలమైన్ వంటి సింథటిక్ సువాసన రసాయనాలున్నాయి.

వృద్ధుడిని బురిడీ కొట్టించిన అపరిచితుడు

» ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో రూ.3.4 కోట్ల మోసం

చెన్నై, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారం పేరుతో ఓ వ్యక్తి నుంచి రూ.3.4 కోట్ల మోసానికి పాల్పడిన వ్యవహారంలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక అడయార్ ప్రాంతానికి చెందిన సత్యనాథన్ (68)ను సెల్‌ఫోన్‌లో సంప్రదించిన అపరిచిత వ్యక్తి, బెంగళూరులోని ప్రముఖ ఫైనాన్స్ సంస్థ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. అనంతరం ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేర్చాడు. ఈ గ్రూపులో ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడి, లాభాలు తదితరాలను వివరణాత్మకంగా పెట్టేవారు. ఆ సమాచారాన్ని విశ్వసించిన సత్యనాథన్.. గత జూలై 7 నుంచి 25 వరకు వాట్సాప్‌లో తెలిపిన 13 వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు రూ.3.4 కోట్లు పంపించారు. తర్వాత వాట్సాప్ గ్రూప్ స్తంభించింది. దీంతో, మోసపోయానని గ్రహించిన సత్యనాథన్.. ఫిర్యాదు చేశారు. ఈ కేసులో తంజావూరుకు చెందిన బాలసుబ్రమణియన్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. తూత్తుకుడి జిల్లాకు చెందిన మురుగేష్, ఎప్సి (35), పంచవర్ణం (33)ను గురువారం రాత్రి అరెస్టు చేశారు.

ఢిల్లీ హైకోర్టు వద్ద ధర్నాకు సెంగార్ బాధితుల యత్నం

న్యూఢిల్లీ, డిసెంబరు 26: ఉన్నావ్ రేప్ కేసు ముద్దాయి, బహిష్కృత బీజేపీ నేత కులదీప్ సెంగార్‌కు విధించిన యావజ్జీవ కారాగార శిక్షను సస్పెండ్ చేసి, బెయిల్ ఇవ్వడానికి నిరసనగా శుక్రవారం ఢిల్లీ హైకోర్టు వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాను పోలీసులు భగ్నం చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో పాటు, మహిళా హక్కుల కార్యకర్తలు ధర్నా చేయడానికి గుమిగూడగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. ఇదిలా ఉండగా, హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సీబీఐ శుక్రవారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది.

క్రైస్తవులను చంపితే.. మీపై దాడులు తప్పవు: ట్రంప్

అబూజ, డిసెంబరు 26: నైజీరియాలోని ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద స్థావరాలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. నైజీరియా ప్రభుత్వ సమన్వయంతో జరిగిన ఈ దాడుల్లో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారని అమెరికా తెలిపింది. అమాయకులైన క్రైస్తవులను చంపడం మానెయ్యాలని, లేకపోతే ఇలాగే భీకర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్ సోషల్ ద్వారా హెచ్చరించారు. దాడులు ఆపాలని తాను గతంలోనే హెచ్చరించినా ఉగ్రవాదులు పెడచెవిన పెట్టి తగిన మూల్యం చెల్లించుకున్నారని చెప్పారు. హతమైన ఉగ్రవాదులతో సహా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలంటూ ట్రంప్ పోస్ట్ పెట్టారు.

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులను రాజకీయ హింసగా చూడలేం: భారత్

న్యూఢిల్లీ, డిసెంబరు 26: బంగ్లాదేశ్‌లో మైనార్టీలైన హిందువులు, బౌద్ధులు, క్రిష్టియన్లపై జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళనకరమని భారత్ పేర్కొంది. వీటిని రాజకీయ హింసలో భాగమని సరిపెట్టుకోలేమని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ శుక్రవారం వ్యాఖ్యానించారు. బంగ్లాదేశ్‌లో మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటివరకు మైనార్టీలపై 2,900 దాడులు జరిగాయని తెలిపారు. హిందూ యువకులు దీపు చంద్రదాస్, అమృత్ మొండల్‌లను మూకదాడిలో చంపేయటంపై తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని ఢాకా యూనివర్సిటీలో శుక్రవారం విద్యార్థులు భారత వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్ పెట్టాలంటే..

కసరత్తు బెస్ట్



» నిద్ర లేమి, ఒత్తిడి, పొట్ట చుట్టూ అధిక కొవ్వు, రెడ్‌మీట్, ప్రాసెస్డ్ మాంసం ఎక్కువగా తినడం ప్రధాన కారణాలు

» మెనోపాజ్ ఆలస్యమయ్యే మహిళల్లో, 30 ఏళ్లు దాటాక గర్భం దాల్చేవారికి అధిక ముప్పు

» వైద్య పరిశోధన మండలి అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిన్న చోటే బద్ధకంగా కూర్చోకుండా.. శారీరక శ్రమ, వ్యాయామం చేయడం వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు బాగా తగ్గుతుందని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తెలిపింది. దేశంలో బ్రెస్ట్ క్యాన్సర్ కేసుల సంఖ్య ఏటా 5.6 శాతం మేర పెరిగే ప్రమాదం ఉందని.. ప్రతి సంవత్సరం అంతకు ముందు ఏడాదితో పోలిస్తే 50 వేలకు పైగా ఎక్కువ కేసులు నమోదవుతాయని హెచ్చరించింది. దేశంలో రొమ్ము క్యాన్సర్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో.. అది రావడానికి ఎక్కువగా కారణమయ్యే అంశాలను గుర్తించే లక్ష్యంతో ఐసీఎంఆర్‌కు చెందిన 'నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ ఇన్‌ఫర్మాటిక్స్ అండ్ రిసెర్చ్ (బెంగళూరు)' చేపట్టిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర వివరాలు వెల్లడయ్యాయి. అధ్యయనంలో భాగంగా.. వైద్య, ఆరోగ్య పరిశోధన పత్రాలను భద్రపరిచే పబ్‌మెడ్, స్కోపస్, ఎంబేస్ వంటి అంతర్జాతీయ డేటాబేస్‌లలో 2024 డిసెంబరు 22 దాకా అందుబాటులో ఉన్న 1871 వ్యాసాలు, 31 అధ్యయనాల సమాచారాన్ని ఆ సంస్థ నిపుణులు విశ్లేషించి ఒక పరిశోధన పత్రాన్ని రూపొందించారు. దాని ప్రకారం.. మెనోపాజ్ ఆలస్యం అయ్యే (50 ఏళ్లు దాటాక) మహిళల్లో, 30 ఏళ్లు దాటాక తొలిసారి గర్భం ధరించే మహిళలకు, గర్భస్రావాలు ఎక్కువగా అయినవారికి, యుక్తవయసులో కాకుండా ఆలస్యంగా వివాహం చేసుకునేవారికి, నడుము- నడుము కింది భాగం చుట్టుకొలత నిష్పత్తి (వెయిస్ట్ టు హిప్ రేషియో) 0.85 కన్నా ఎక్కువగా (పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా) ఉండేవారిలో క్యాన్సర్ ముప్పు ఎక్కువ అని వెల్లడైంది. అలాగే.. కుటుంబంలో అంతకు ముందు ఎవరికైనా క్యాన్సర్.. మరీ ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్ రోగులు ఉంటే కూడా ఆ కుటుంబంలోని మహిళలకు ఈ ముప్పు ఎక్కువని ఐసీఎంఆర్ వైద్యనిపుణులు పేర్కొన్నారు. విదేశాల్లో.. 35-50 ఏళ్ల వారితో పోలిస్తే 50 ఏళ్లు దాటినవారిలో రొమ్ము క్యాన్సర్ ముప్పు మూడు రెట్లు ఎక్కువని.. మనదేశంలో అయితే 40-50 ఏళ్ల మహిళల్లోనే ఈ ముప్పు ఎక్కువగా ఉంటోందని తెలిపారు. దీంతోపాటు.. నిద్ర లేమి, నిర్ణీత నిద్రవేళలు పాటించకపోవడం, వెలుతురు ఎక్కువగా వచ్చే గదుల్లో నిద్రించడం, ఒత్తిడి స్థాయులు పెరగడం, నాన్‌వెజ్.. ముఖ్యంగా రెడ్ మీట్, ప్రాసెస్డ్ మాంసం అధికంగా తినడం వంటి జీవనశైలి లోపాలు కూడా ముప్పును పెంచుతున్నట్టు వారి అధ్యయనంలో వెల్లడైంది. అదే సమయంలో.. శారీరక శ్రమ ఎక్కువగా చేసేవారిలో, వ్యాయామం చేసేవారిలో మాత్రం బ్రెస్ట్ క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్టు గుర్తించారు. వ్యాయామం వల్ల హార్మోన్ల సమతుల్యత మెరుగుపడి ఒత్తిడి తగ్గుతుందని.. అది రొమ్ము క్యాన్సర్ నుంచి సహజ రక్షణ కవచంగా పనిచేస్తుందన్నారు.

ఇదీ లెక్క...

మనదేశంలో 2022లో 2,21,757 రొమ్ము క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. ఆ ఏడాది క్యాన్సర్ బారిన పడిన మహిళల సంఖ్యలో ఇది ఏకంగా 22.8 శాతం. అంటే ప్రతి నలుగురు మహిళా క్యాన్సర్ పేషెంట్లలో ఒకరు రొమ్ము క్యాన్సర్ బాధితులే! ఏటా ఈ కేసుల సంఖ్య 5.6 శాతం మేర పెరుతుందని.. 2025లో 2,32,832 రొమ్ము క్యాన్సర్ కేసులు నమోదు కావచ్చని ఐసీఎంఆర్ వైద్యనిపుణులు అంచనా వేశారు. దీనిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయడానికి 81% అవకాశం ఉంటుందని.. తర్వాత దశలో 65.5%, ఇతర అవయవాలకు వ్యాప్తి చెందితే కేవలం 18.3 శాతమే ఉంటుందని.. కాబట్టి ఈ మహమ్మారిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని స్పష్టం చేసింది.

అడ్డుకట్ట ఇలా..

రొమ్ము క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవడానికి 'నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్' కొన్ని సూచనలు చేసింది.

- మరీ మూడుపదుల వయసు దాటాక కాకుండా తగిన వయస్సులో గర్భం దాల్చడం. అసలు పిల్లలు పుట్టనివారితో, 35 ఏళ్లు దాటాక తొలిసారి గర్భం దాల్చినవారితో పోలిస్తే.. 20 ఏళ్లలోపే పిల్లలను కన్న మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే ముప్పు తక్కువ.
- ప్రసవం తర్వాత పిల్లలకు ఎక్కువకాలం పాలివ్వాలి.
- మద్యం సేవించకూడదు.
- బరువును అదుపులో పెట్టుకోవాలి. మరీ ముఖ్యంగా.. మెనోపాజ్ (రుతుక్రమం ఆగిపోయిన) తరువాత బరువు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే.. మెనోపాజ్‌కు ముందు మహిళల శరీరాల్లో ఈస్ట్రోజన్ ఎక్కువగా వారి అండాశయాల్లో తయారవుతుంది. రుతుక్రమం ఆగిపోయాక.. కొవ్వు కణాలు ఈస్ట్రోజన్‌ను తయారుచేస్తాయి. కొవ్వు కణాలు ఎంత ఎక్కువగా ఉంటే ఈస్ట్రోజన్ స్థాయులు అంతగా పెరిగిపోతాయి. తద్వారా రొమ్ము క్యాన్సర్ ముప్పు పెరుగుతుంది.
- ఎక్కువ సేపు కూర్చుని ఉండకుండా యాక్టివ్‌గా ఉండాలి. నిత్యం వ్యాయామం, శారీరక శ్రమ చేయడం ఉత్తమం.
- కుటుంబ చరిత్రలో రొమ్ము క్యాన్సర్ కేసులు ఉన్నవారు ముందుగానే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

లోకం తీరు



కెనడాలో భారత విద్యార్థి దారుణహత్య

» టొరంటో యూనివర్సిటీ సమీపంలో శివాంక్ అవస్థిపై దుండగుల కాల్పులు

» తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి


శివాంక్

న్యూఢిల్లీ/టొరంటో, డిసెంబరు 26: కెనడాలో భారతీయ విద్యార్థి దారుణ హత్యకు గురయ్యాడు. టొరంటో యూనివర్సిటీ స్కార్‌బొరొగ్ క్యాంపస్ సమీపంలో దుండగుడు(లు) ఓ విద్యార్థిని తుపాకీతో కాల్చిచంపారు. బాధితుడిని శివాంక్ అవస్థి (20)గా కెనడా పోలీసులు గుర్తించారు. స్థానిక కాలమానం ప్రకారం ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుందని ఓ ప్రకటనలో వెల్లడించారు. హైల్యాండ్ క్రీక్ ట్రెయిల్ అండ్ ఓల్డ్ కింగ్‌స్టన్ రోడ్ ఏరియాలో డాక్టరేట్ విద్యార్థి శివాంక్‌పై దుండుగులు కాల్పులు జరిపారని తెలిపారు. బాధితుడు తీవ్ర గాయాలతో పడివున్నాడన్న సమాచారం అందుకొన్న వెంటనే అక్కడకు చేరుకున్నామని, అయితే విద్యార్థి ఘటనాస్థలిలోనే మరణించాడని పేర్కొన్నారు. పోలీసులు అక్కడకు చేరుకోక ముందు నిందితులు పరారయ్యారని తెలిపారు. శివాంక్ అవస్థి హత్యపై టొరంటోలోని భారత రాయబార కార్యాలయం స్పందించింది. 'ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటాం. స్థానిక అధికారుల సమన్వయంతో వారికి అవసరమైన సాయం అందిస్తాం' అని తెలిపింది. ఇదిలా ఉండగా.. గత వారం టొరంటోలో హిమాన్షి ఖురానా (30) అనే ఓ భారతీయ మహిళ హత్యకు గురయ్యారు.

ఉద్యోగులకు 2 వేల కోట్ల బోనస్

» ఓ అమెరికా వ్యాపారి ఔదార్యం


గ్రాహం వాకర్

న్యూఢిల్లీ, డిసెంబరు 26: ఆ కంపెనీ యజమాని ఔదార్యం గురించి వింటే, ఎంతటి దాన కర్ణుడో కదా.! ఆ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులు ఎంత అదృష్టవంతులో కదా.! అని అనుకోకమానరు. సుమారు రూ. 2,155 కోట్లు (240 మిలియన్ డాలర్లు) తన కంపెనీలో పనిచేసే 540 మంది ఉద్యోగులకు బోనస్‌గా ఇచ్చేశాడు అమెరికాకు చెందిన వ్యాపారవేత్త గ్రహం వాకర్. లూసియానాకు చెందిన గ్రహం వాకర్.. తన కుటుంబ కంపెనీ ఫైబర్‌బాండ్‌ను అమ్మిన సందర్భంగా ఉద్యోగులకు ఆ బోనస్ ప్రకటించాడు. దీంతో ఒక్కో ఉద్యోగి సుమారు 4 కోట్లు పొందారు. తన కంపెనీని కొనుగోలు చేసిన మొత్తంలో 15% ఉద్యోగులకు ఇవ్వాలని టేకోవర్ చేసిన కంపెనీకి కండిషన్ పెట్టి గొప్ప మనసు చాటుకున్నాడు. కష్టకాలంలోనూ కంపెనీని వదలకుండా తనకు తోడుగా ఉన్న ఉద్యోగుల రుణం అలా తీర్చుకున్నాడు. జూన్ నుంచి ఈ బోనస్ చెల్లింపులు ప్రారంభమయ్యాయని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. నిర్దిష్ట కాలంలో సంస్థలో పనిచేసిన వారికి 5 ఏళ్లలోపు ఈ చెల్లింపులు జరుగుతాయని తన కథనంలో తెలిపింది. తమ యజమాని ఔదార్యం చూసి ఉద్యోగులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. నిజానికి కంపెనీలో షేర్లు ఉంటేనే ఆ కంపెనీని అమ్మేసేటపుడు ఉద్యోగికి వాటా ఇస్తారు. కానీ వాకర్ ఎలాంటి షేర్లు లేకపోయినా మానవత్వంతో డబ్బు పంచాడు. 1982లో గ్రహం వాకర్ తండ్రి క్లాడ్ వాకర్ ఈ ఫైబర్‌బాండ్ కంపెనీని స్థాపించారు. 1998లో అగ్ని ప్రమాదం జరిగి సంస్థ పూర్తిగా నేలమట్టమైంది. అయినా క్లాడ్ వాకర్ ఉద్యోగులకు జీతాలు చెల్లించడం ఆపలేదు. ఆ తర్వాత కంపెనీ కోలుకుంది. డేటా సెంటర్లకు మాడ్యులర్ పవర్ ఎన్‌క్లోజర్లు తయారు చేసి 400% లాభాలు ఆర్జించింది.

రాజస్థాన్‌లో యువతిపై గ్యాంగ్‌రేప్

» నిందితుల్లో ఓ మహిళ.. ముగ్గురి అరెస్టు

ఉదయ్‌పూర్, డిసెంబరు 26: ఐటీ సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్న ఓ యువతి కదులుతున్న కారులో సామూహిక అత్యాచారానికి గురైంది. తాను పని చేస్తున్న సంస్థ సీఈవోతోపాటు సంస్థ ఎగ్జిక్యూటివ్ హెడ్ భర్త కలిసి ఆమెపై అఘాయిత్యానికి తెగబడ్డారు. ఈ దారుణం జరుగుతున్నప్పుడు ఆ మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్ కూడా కారులోనే ఉండడం మరింత దిగ్భ్రాంతికరం! అస్వస్థతకు గురైన బాధితురాలిని ఇంటి దగ్గర దిగబెడతామని నమ్మించి అర్ధరాత్రి పూట కారులో ఎక్కించుకొని నిందితులు ఈ దారుణానికి పాల్పడ్డారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన ఈ ఘోరం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది. జేకేఎం అనే ఐటీ కంపెనీ సీఈవో జితేశ్ సిసోడియా తన పుట్టినరోజు, న్యూ ఇయర్‌కు సంబంధించి ఈనెల 20న ఉదయ్‌పూర్‌లోని ఓ హోటల్‌లో విందు ఏర్పాటు చేశాడు. ఆ సంస్థకు చెందిన మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్ శిల్పా సిరోహి ఆహ్వానించడంతో బాధితురాలు కూడా ఆ పార్టీకి హాజరైంది. రాత్రి 1:30 వరకు ఆమె అక్కడే ఉంది. పార్టీ ముగిశాక.. తన ఒంట్లో నలతగా అనిపించడంతో ఆమె ఇంటికి వెళ్లేందుకు సిద్ధమైంది. తాను కారులో ఇంటి వద్ద దిగబెడతానంటూ శిల్పా సిరోహి, ఆ యువతిని తన వాహనంలో ఎక్కించుకుంది. అప్పటికే ఆ కార్లో శిల్ప భర్త గౌరవ్, సంస్థ సీఈవో జితేశ్ ఉన్నారు. మార్గమధ్యలో ఓ దుకాణం వద్ద కారును ఆపిన నిందితులు.. పొగపీల్చే పదార్థాలను తీసుకున్నారు. ముగ్గురు కలిసి బాధితురాలితోనూ పొగ తాగించగా ఆ ప్రభావంతో ఆమె స్పృహ కోల్పోయింది. కొద్దిగా స్పృహలోకి వచ్చేసరికి తనపై జితేశ్ లైంగికదాడికి పాల్పడుతున్నట్లుగా బాధితురాలు గుర్తించింది. జితేశ్‌తో పాటు గౌరవ్ కూడా తనపై లైంగిక దాడికి తెగబడినట్టు గ్రహించింది. ఈ ఘోరానికి సంబంధించిన కీలక ఆధారాలను పోలీసులు ఇప్పటికే సేకరించారు. ఈమేరకు కారులోని వెబ్‌క్యామ్‌లో నిందితులు ఒడిగట్టిన దారుణం తాలుకు ఫుటేజీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అరెస్టు చేశారు.

20 మంది వీర బాలలకు పురస్కారాల ప్రదానం

బహూకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

తెలుగు రాష్ట్రాలకు చెందిన శివాని, విశ్వనాథ్‌లకు ప్రశంసలు


రాష్ట్రపతి ముర్ము నుంచి బాల పురస్కారాన్ని స్వీకరిస్తున్న శివాని

న్యూఢిల్లీ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవలు, పర్యావరణం, క్రీడలు, కళలు-సంస్కృతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అసాధారణ విజయాలను సాధించినందుకు వీటిని అందజేశారు. వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలకు వీటిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ పురస్కారాలు పొందిన బాలలు తల్లిదండ్రులకే కాకుండా మొత్తం దేశానికే గర్వకారణంగా నిలిచారని తెలిపారు. ఇతర బాలలకు స్ఫూర్తి కలిగించారని ప్రశంసించారు. మున్ముందు కూడా ఇదే తరహాలో దేశ ప్రగతికి కృషి చేస్తారని ఆకాంక్షించారు. పురస్కారాలు అందుకున్న వారిలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన 17 ఏళ్ల పారా అథ్లెట్ క్రీడాకారిణి శివాని హోసూరు ఉప్పర, తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతారోహకుడు విశ్వనాథ్ కార్తికేయ్ ఉన్నారు. రికార్డులు సృష్టిస్తున్న క్రికెట్ క్రీడాకారుడు వైభవ్ సూర్యవంశీ కూడా పురస్కారం అందుకున్నాడు. దివ్యాంగ బాలిక అయిన శివాని హోసూరు ఉప్పర తన ఆర్థిక, శారీరక పరిమితులను అధిగమించి క్రీడారంగంలో అద్భుతమైన విజయాలను సాధించిందని రాష్ట్రపతి అన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో శివానీ సత్తా: ఏపీకి చెందిన శివానీ ఓ దివ్యాంగురాలు. థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్ (2023) అండర్-20 విభాగంలో జావెలిన్ త్రో ఎఫ్45, షాట్‌పుట్ క్రీడల్లో విజేతగా నిలిచి సత్తా చాటింది. అంతేకాకుండా గతేడాది బెంగళూరులో నిర్వహించిన నేషనల్ జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్ అండర్-17 విభాగంలో 100 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో, షాట్‌పుట్‌లో మూడు బంగారు పతకాలను గెలిచింది. 12వ నేషనల్ ఛాంపియన్‌షిప్స్ (2023) మహిళల జావెలిన్ త్రోలో రజత పతకం సాధించింది. ఇక మరో అవార్డు గ్రహీత విశ్వనాథ్ ఈ ఏడాది ఎవరెస్ట్‌తో మొత్తంగా ఆరు ఖండాల్లోని 20కి పైగా పర్వతాలను అధిరోహించాడు.

ఆపరేషన్ సిందూర్‌లో 'చిట్టి పౌర యోధుడు'



ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశానికి తన వంతు సేవలు అందించి సైనికుల ప్రశంసలు అందుకున్న ఓ పదేళ్ల బాలుడు ఇప్పుడు రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా చక్ తరన్ వాలీ గ్రామానికి చెందిన శ్రావణ్ సింగ్.. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు నీరు, పాలు, టీ, లస్సీ అందజేశాడు. బాలుడి దేశభక్తిని చూసి సైనికులు మురిసిపోయారు. 'యంగెస్ట్ సివిల్ వారియర్' పేరుతో సన్మానించారు.

జెన్-జీతో వికసిత్ భారత్ సాకారం: ప్రధాని మోదీ

జెన్-జీపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, వారి సామర్థ్యాలు, క్రమశిక్షణ, కష్టపడే తత్వం వికసిత్ భారత్ కలను సాకారం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన 'వీర్ బాల్ దివస్' కార్యక్రమంలో మోదీ పాల్గొని మాట్లాడారు. యువత కలలు, ఆకాంక్షలే దేశ దశ, దిశను నిర్ణయిస్తాయని అభిప్రాయపడ్డారు. యువత స్వల్పకాలిక ఆకర్షణల మోజులో పడకుండా లక్ష్యం వైపు దూసుకెళ్లాలని సూచించారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక యువతకు ఎన్నో రంగాల్లో అవకాశాలను కల్పించామని ఆయన చెప్పుకొచ్చారు. ఎవరు పెద్ద.. ఎవరు చిన్న అనేది వయసు నిర్ణయించదని, చేసే పనులు సాధించే విజయాలే నిర్ణయిస్తామన్నారు.

ఎర్రకోట పేలుళ్లకు 40 కిలోల మందుగుండు వినియోగం: కేంద్ర మంత్రి షా

న్యూఢిల్లీ, డిసెంబరు 26: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుళ్ల ఘటనలో ఉగ్రవాదులు 40 కిలోల మందుగుండు సామగ్రిని ఉపయోగించారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. ఐ20 కారులో పేలుడు పదార్థాలను ఉంచి విధ్వంసం సృష్టించారని తెలిపారు. ఈ సంఘటన జరగడానికి ముందు జమ్మూ-కశ్మీర్ పోలీసులు మూడు టన్నుల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారంటూ వారిని అభినందించారు. దీని వెనుక ఉన్న ముఠాను పట్టుకున్నారని తెలిపారు. శుక్రవారం ఇక్కడ ఎన్ఐఏ ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన యాంటీ టెర్రరిజం సదస్సులో ఆయన ప్రసంగిస్తూ అన్ని దర్యాప్తు సంస్థలు సమన్వయంతో పని చేసి కుట్రను బహిర్గతం చేశాయని చెప్పారు. ఈ సందర్భంగా దేశంలో జరిగే వ్యవస్థీకృత నేరాలకు సంబంధించి రెండు 'సమాచార నిధు'లను ఆవిష్కరించారు. నేరగాళ్లకు సంబంధించి 'ఆర్గనైజ్డ్ క్రైం నెట్ వర్క్ డాటాబేస్, చోరీ అయిన, దొరికిన ఆయుధాలకు సంబంధించి 'వెపన్స్ డాటాబేస్' పేరుతో వీటిని ప్రారంభించారు. దేశంలో ఎక్కడ ఏ నేరం జరిగినా ఈ డాటాబేస్ ఆధారంగా దర్యాప్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వీటిని ఆవిష్కరించారు. నవీకరించిన ఎన్ఐఏ క్రైం మాన్యుయెల్‌ను కూడా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవస్థీకృత నేరాలపై అన్ని కోణాల్లో దాడులు చేస్తామని చెప్పారు. ఉగ్రవాద రహిత సమాజాన్ని నెలకొల్పడంలో ఈ డాటాబేస్‌లు కీలక ఆస్తిగా ఉపయోగపడుతాయని తెలిపారు.

16 ఏళ్లలోపు వారికి ఇంటర్నెట్ నిషేధం

» ఆస్ట్రేలియా తరహాలో చట్టం తీసుకురావచ్చేమో పరిశీలించండి ... కేంద్రానికి మద్రాస్ హైకోర్టు సూచన

చెన్నై, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా తరహాలో 16 ఏళ్లలోపు చిన్నారులకు ఇంటర్నెట్ వినియోగం నిషేధించేలా ప్రత్యేక చట్టం చేయడంపై పరిశీలించాలని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కేంద్రప్రభుత్వానికి సూచించింది. అంతేగాక సోషల్ మీడియాపై అవగాహనా ప్రచారాన్ని సమర్థవంతంగా చేయాలని ఆదేశించింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం అమలు చేసిన లాంటి చట్టం మన దేశంలో కూడా అమలులోకి వచ్చే వరకు అందుబాటులో ఉన్న అన్ని మీడియాల ద్వారా అవగాహన కల్పించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌లతో కూడిన మదురై ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అశ్లీల చిత్రాలు సులువుగా అందుబాటులో ఉంటున్న ఇంటర్నెట్‌ను చిన్నారులు వీక్షించకుండా చర్యలు చేపట్టాలంటూ విజయ్‌కుమార్ అనే సామాజిక సేవా కార్యకర్త దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై స్పందించిన ధర్మాసనం ఈ మేరకు సూచనలు చేసింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇంటర్నెట్‌లో అశ్లీల చిత్రాలు పుంఖానుపుంఖాలుగా అందుబాటులో ఉంచుతున్నారని, అలాంటి చిత్రాలను ఎవరైనా సులువుగా చూసే అవకాశం ఉందని వివరించారు. దీని వల్ల చిన్నారుల భవిష్యత్తు పాడవుతుందని, చిన్నారుల సంరక్షణ చట్టాల ప్రకారం ఇలాంటి అశ్లీల చిత్రాలను నిషేధించేలా చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. చిన్నారులు ఇలాంటి అశ్లీల చిత్రాలు చూడకుండా ఉండేలా కొత్త సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టాల్సిన అవసరముందని, ఈ చిత్రాలు వీక్షించడం ద్వారా వారి మానసిక స్థితి పక్కదోవ పట్టే అవకాశముందని అభిప్రాయపడింది. ఆస్ట్రేలియా ప్రభుత్వం తరహాలో 16 ఏళ్లలోపు వారు ఇంటర్నెట్ చూడకుండా ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరముందని సూచించింది. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. పిల్లల హక్కుల పరిరక్షణకు అవగాహన కల్పించడం జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్, తమిళనాడు బాలల హక్కుల రక్షణ కమిషన్ చట్టబద్ధమైన విధి అని స్పష్టం చేసింది.



గంగమ్మా చల్లగా చూడమ్మా!



» విశాఖ తీరంలో 'సునామీ' పూజలు

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో మత్స్యకారులు శుక్రవారం గంగమ్మతల్లి (సముద్రం)కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీటిని 'సునామీ పూజలు'గా వ్యవహరిస్తారు. 2004 డిసెంబరు 26న వచ్చిన సునామీ విశాఖలో మత్స్యకారులను గడగడలాడించింది. తీర ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్న మత్స్యకారులు నాడు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంగమ్మ తల్లి మళ్లీ అలా ఆగ్రహించకుండా తమను చల్లగా చూడాలని కోరుతూ నాటి నుంచి ఏటా డిసెంబరు 26న పెదజాలరిపేటలో మహిళలంతా పసుపు, కుంకుమ కలిపిన నీరు, పాలుతో కలశాలను నింపి పూలతో అలంకరించి, ఊరేగింపుగా సముద్ర తీరానికి వెళతారు. కలశాల్లో నీటిని సముద్రంలో కలిపి చల్లగా చూడమని వేడుకుంటారు. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కూడా ఈ కార్యక్రమానికి హాజరై గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం: జస్టిస్ కిరణ్మయి



లేపాక్షి ఆలయంలో సీతమ్మ పాదాన్ని తిలకిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి దంపతులు

లేపాక్షి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళ అద్భుతమని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలోని ఆలయాన్ని జస్టిస్ కిరణ్మయి దంపతులు శుక్రవారం సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభం తదితర విశేషాలను వారు తిలకించారు. గైడ్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం దుర్గా వీరభద్రస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, దేవదాయ శాఖ అధికారులు న్యాయమూర్తి వెంట ఉన్నారు.

3, 4, 5 తేదీల్లో
మూడవ తెలుగు మహాసభలు

» గుంటూరులో విస్తృత ఏర్పాట్లు

» 40 దేశాలకు చెందిన 62 తెలుగు సంఘాలకు ఆహ్వానం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం మూడో ప్రపంచ తెలుగు మహాసభలు-2026 గుంటూరు జిల్లాలో జరగనున్నాయి. జనవరి 3, 4, 5 తేదీల్లో ఎన్‌హెచ్-16 పక్కనే ఉన్న శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఈ వేడుకలకు ఆతిథ్యమివ్వనుంది. ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ప్రజా గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ గత కొన్ని నెలలుగా మహాసభలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తున్నారు. 40 దేశాలకు చెందిన 62 తెలుగు సంఘాలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపగా తాము తప్పక పాల్గొంటామని ఆయా అసోసియేషన్లు సమాచారం పంపాయి. మూడు రోజుల పాటు మొత్తం 22 సాహితి సదస్సులు జరుగుతాయి. 4వ తేదీన ఉత్తరాఖండ్ నుంచి వచ్చే ఆదిశంకర పీఠాధిపతుల ప్రవచనం ఉంటుంది. నాలుగు రాష్ట్రాల గవర్నర్లు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఎన్టీఆర్ పేరిట ప్రధాన వేదిక ఏర్పాటు చేశారు. మూడు రోజుల్లో లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

పాస్టర్ల గౌరవ వేతనాల విడుదలపై ఏపీయూపీఎఫ్ హర్షం

విజయవాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సర కాలంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 8,427 మంది పాస్టర్స్‌కు పెండింగ్‌లో ఉన్న రూ.50.40 కోట్లు విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ (ఏపీయూపీఎఫ్) బిషప్ జయప్రకాష్ గంజికుంట హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

ఆయుర్వేద శస్త్రచికిత్సలు సరికాదు: ఐఎంఏ

విజయవాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద పీజీ వైద్యులు శస్త్ర చికిత్సలు చేయడాన్ని అనుమతిస్తూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రకటించడాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ తీవ్రంగా ఖండించింది. దేశంలోని చట్టపరమైన నిబంధనలు, శాస్త్రీయ సూత్రాలు, వైద్యవిద్య నియంత్రణ చట్టాన్ని వ్యతిరేకించే ఇటువంటి ప్రకటన ప్రజల ప్రాణాలకు ముప్పుగా భావించాలని ఐఎంఏ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. భారతీయ వైద్య వ్యవస్థల అభ్యాసకులను శస్త్రచికిత్సలు చేయడానికి అనుమతించే అంశం సుప్రీంకోర్టు విచారణలో ఉందని వెల్లడించింది.

5 నుంచి ఎఫ్ఏ-3 పరీక్షలు

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఫార్మేటివ్ అసెస్‌మెంట్-3 పరీక్షలు జనవరి 5వ తేదీ నుంచి నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు మూడు రోజులు, 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నాలుగు రోజుల పాటు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల సిలబస్‌ను ఎస్సీఈఆర్టీ జిల్లాలకు పంపింది.

తిరుమలలో మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం



పట్టుబడిన పశ్చిమబెంగాల్ వాసి

తిరుమల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చంపుతానంటూ చాకుతో పిల్లలను బెదిరిస్తూ తిరుమలలో శుక్రవారం మతిస్థిమితం లేని ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. 50 ఏళ్ల వ్యక్తి బటన్ నైఫ్ పట్టుకుని శంకుమిట్ట కాటేజీల వద్ద ముగ్గురు చిన్నారుల వెంటపడి చంపేస్తానంటూ బెదిరించాడు. సమీపంలో ఉన్న కొందరు ట్యాక్సీ డ్రైవర్లు, వ్యాపారులు గుర్తించి అతన్ని పట్టుకున్నారు. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని చాకును స్వాధీనం చేసుకున్నాడు. అతన్ని తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన వ్యక్తి పశ్చిమ బెంగాల్‌కు చెందిన వాడని తెలుస్తోంది.

ఐవీఆర్ఎస్ ద్వారా గర్భిణులకు ఆరోగ్య సూచనలు

» ఆరోగ్యశాఖ కమిషనర్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాల్ని గణనీయంగా తగ్గించే చర్యల్లో భాగంగా ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా గర్భిణులు, బాలింతలకు సలహాలు, సూచనలు ఇస్తున్నామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ తెలిపారు. 'కిల్కారి' (చిన్నారి చిరునవ్వు) కార్యక్రమం ద్వారా ఏటా ఐవీఆర్ఎస్ ద్వారా సగటున 2.5 లక్షల మంది గర్భిణులకు ఆరోగ్య సూచనలు ఇస్తున్నామని, ఈ ఏడాది కూడా దాదాపు రెండు లక్షల మందికి సూచనలు అందించామని అన్నారు. తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణ, పోషణ, టీకాల ప్రాముఖ్యం, కుటుంబ నియంత్రణ, ఇతర అంశాలపై కనీసం 4 నిమిషాల పాటు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో నాలుగో నెలలోకి ప్రవేశించిన గర్భిణికి వారానికి ఒకసారి చొప్పున ప్రసవం జరిగే వరకూ ఐవీఆర్ఎస్ వాయిస్ కాల్స్ వెళ్లేవని, ఇప్పుడు నెలకు ఒకసారి కాల్స్ వెళ్లేలా మార్పులు జరిగాయని వివరించారు. ఐవీఆర్ఎస్ కాల్స్ వచ్చినప్పుడు గర్భిణులు వాటిని రిసీవ్ చేయని పక్షంలో రీ-డయల్ ద్వారా కాల్‌లోని సమాచారాన్ని వినే అవకాశాన్ని కూడా కల్పించారు.

చంద్రన్న సంచార చికిత్సలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

» డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చంద్రన్న సంచార చికిత్స (104 వాహనాలు)ల్లో ఖాళీల భర్తీకి నిర్వహణ సంస్థ భవ్య హెల్త్ కేర్ సిద్ధమైంది. చంద్రన్న సంచార చికిత్సలో పదుల సంఖ్యలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టుల భర్తీ నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు పదో తరగతి అర్హత ఉన్న వారికి డ్రైవర్లుగా, డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్‌పై అవగాహన వారికి డేటా ఎంట్రీ అపరేటర్లుగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడ, తిరుపతిలో దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులైన అభ్యర్థులు ధృవీకరణ పత్రాలతో నిర్ణీత ప్రదేశాల్లో సంప్రదించాలని భవ్య యాజమాన్యం తెలిపింది.

బిస్కెట్ ఆశచూపి
ఇద్దరు బాలికలపై లైంగికదాడి!

» నర్సాయపాలెంలో ఘటన, పోక్సో కేసు నమోదు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అభంశుభం తెలియని బాలికలకు చాక్లెట్, బిస్కెట్లు ఇస్తానని ఆశచూపి ఒక వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలంలోని నర్సాయపాలెం గ్రామంలో పిక్కిలి ఆంజనేయులు(40)కు చిల్లర దుకాణం ఉంది. క్రిస్మస్ సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో ఆ దుకాణం సమీపంలో నివాసముంటున్న ఇద్దరు బాలికలు (10, 11 సంవత్సరాలు) బిస్కెట్లు కొనుక్కునేందుకు వెళ్లారు. వారిలో ఒక బాలికకు బిస్కెట్లు, చాక్లెట్లు ఆశచూపిన ఆంజనేయులు నివాసం లోపలికి తీసుకెళ్లాడు. మరో బాలికకు అంట్లు తోమితే బిస్కెట్లు ఇస్తానని చెప్పాడు. ఆ బాలిక ఇంటి బయట అంట్లు తోముతుండగా మరో బాలికపై నోట్లో గుడ్డ కుక్కి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అలాగే రెండో బాలికపై కూడా లైంగిక దాడి చేశాడు. అనంతరం ఇళ్లకు వెళ్లిన బాలికల వస్త్రాలపై రక్తం మరకలు గమనించి ప్రశ్నించగా జరిగిన ఘోరాన్ని వారు తల్లిదండ్రులకు తెలిపారు. ఆగ్రహంతో వారంతా నిందితుడి ఇంటికి వెళ్లగా అప్పటికే ఆంజనేయులు పరారయ్యాడు. శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, ఆచూకీ కోసం గాలిస్తున్నామని ఎస్ఐ చౌడయ్య తెలిపారు. బాధిత బాలికలను వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

బాలామృతంపై ప్రయోగాలు!

13.8లక్షల మంది చిన్నారుల భవిష్యత్తుతో చెలగాటం.. 1,200కోట్ల విలువైన టెండర్ల నిబంధనల్లో గోల్‌మాల్

» 8 నెలల్లోనే యూనిట్ ఏర్పాటు చేయాలని నిబంధన

» పేరున్న సంస్థలను పోటీ నుంచి తప్పించే యత్నం?

» బాలసంజీవని సరఫరా సంస్థలకే కట్టబెట్టే వ్యూహం

» మహిళా శిశుసంక్షేమ శాఖ తీరుపై విమర్శల వెల్లువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



చిన్నారులు ఎంతో ఇష్టంగా తాగే హార్లిక్స్ వంటి న్యూట్రిషన్ పౌడర్‌ను మార్కెట్‌లోకి తీసుకురావడానికి హిందుస్థాన్ వంటి దిగ్గజ కంపెనీకి దాదాపు ఐదేళ్లు పట్టింది. అలాంటిది రాష్ట్రంలోని 13.80 లక్షల మంది పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వం అందించే బాలామృతం తయారీకి ప్రభుత్వం విధించిన గడువు కేవలం 8 నెలలు మాత్రమే. ఇంత స్వల్ప వ్యవధిలో యూనిట్ నెలకొల్పి పౌడర్ సిద్ధం చేయాలనే నిబంధన విధించడం వెనుక మర్మం ఏమిటో మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులకే తెలియాలి. అనేక పరీక్షలు నిర్వహించి, ఎన్నో జాగ్రత్తలు తీసుకొని, అత్యంత నైపుణ్యంతో సిద్ధం చేయాల్సిన బాలామృతాన్ని ఇంత హడావుడిగా తయారు చేయాలని భావించడం చిన్నారుల జీవితాలతో చెలగాటం ఆడటమేనని పోషకాహార నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేల కోట్లు వ్యయం చేస్తున్న ఈ పథకంపై ప్రయోగాలు చేయడం సరికాదని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు జోన్లలో బాలామృతం సరఫరా చేసేందుకు మహిళా శిశుసంక్షేమ శాఖ సెప్టెంబరులో టెండర్లు పిలిచింది. ఈ టెండర్లలో నిర్దేశించిన అర్హతా ప్రమాణాలపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే గర్భిణులకు బాలసంజీవని సరఫరా చేస్తున్న సంస్థలకే ఈ కాంట్రాక్టును ధారాదత్తం చేసేందుకే వారికి అనుకూలంగా ఉండేలా టెండరు నిబంధనలు రూపొందిస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. న్యూట్రిషన్ పౌడర్/హెల్త్ మిక్స్ తయారీలో అనుభవం లేని సంస్థలకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించడంతో శిశువుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏడు నెలల నుంచి 3 ఏళ్ల వయస్సున్న చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించేందుకు అందించే ఈ బాలామృతం అత్యంత సున్నితమైన, శాస్త్రీయంగా తయారయ్యే న్యూట్రిషన్ పౌడర్. అయితే రాగి పిండి, మల్టీగ్రెయిన్ అటా, అటుకులు, పల్లీ చిక్కీ, హాట్‌కుక్డ్ మీల్ వంటి పూర్తిగా భిన్నమైన ఉత్పత్తులను సరఫరా చేసేవారికి ఈ టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు పావులు కదుపుతున్నారు. న్యూట్రిషన్ పౌడర్ తయారీ పూర్తి శాస్త్రీయంగా ఉంటుంది. అంతేకాకుండా టెండర్ పొందిన తర్వాత 8 నెలల్లో కొత్త తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని నిబంధన విధించడం కూడా వివాదాస్పదంగా మారింది. న్యూట్రిషన్ పౌడర్/హెల్త్ మిక్స్/మాల్ట్ ఆధారిత ఉత్పత్తుల తయారీలో కనీసం ఐదేళ్ల అనుభవం ఉన్న సంస్థలకే టెండర్లలో పాల్గొనే అర్హత కల్పిస్తే పిల్లలకు నాణ్యమైన బాలమృతం అందుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఐదేళ్లలో రూ.1,200 కోట్ల మేర వ్యయమయ్యే బాలామృతం పథకంపై మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రయోగాలు చేయడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఏడాదికి రూ.240 కోట్ల వ్యయం

బాలామృతం సరఫరా కోసం రాష్ట్రంలోని 26 జిల్లాలను మూడు జోన్లుగా విభజించి, టెండర్లు పిలిచారు. ఏడు నెలల నుంచి 12 నెలల పిల్లలకు జూనియర్ బాలామృతం, 13 నెలల నుంచి మూడేళ్ల లోపు పిల్లలకు సీనియర్ బాలామృతం సరఫరా చేసేందుకు అర్హులైన సంస్థలు సెప్టెంబరు 4 నుంచి ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు దాఖలు చేయాలని మహిళా శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం సుమారు రూ.240 కోట్ల విలువ కలిగిన బాలామృతాన్ని ఏడాదిలో సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ టెండర్లు ఐదేళ్ల పాటు కొనసాగించాలని నిర్ణయించారు.

బాలసంజీవని కాంట్రాక్టర్లకే ప్రాధాన్యం

పిల్లలకు న్యూట్రిషన్ పౌడర్ తయారీ చేయడం అత్యంత జాగ్రత్తగా చేయాల్సిన ప్రక్రియ. ఈ రంగంలోని సంస్థలు అనేక నాణ్యతా నియంత్రణ విభాగాలను ఏర్పాటు చేసుకుని ఉత్పత్తి చేస్తాయి. ఈ రంగంలో ఎక్కువగా బహుళజాతి కంపెనీలే ఉంటాయి. అలాంటి బాలామృతం టెండర్లను చిన్న సంస్థలకే కట్టబెట్టాలన్న మహిళా శిశుసంక్షేమ శాఖ వ్యూహం బెడిసికొడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వానికి చెందిన తెలంగాణ ఫుడ్స్ ఉత్పత్తి చేసే న్యూట్రిషన్‌ను మన రాష్ట్రంలోనూ గత 8ఏళ్ల నుంచి వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఏపీలోని సరఫరాదారులతో ఈ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం భావించిన నేపథ్యంలో వారిని ఎంపిక చేసే ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా చేపట్టాల్సి ఉంది. అందుకు భిన్నంగా బాలసంజీవని కాంట్రాక్టర్లకే ఈ టెండర్లు కూడా కట్టబెట్టాలని చూస్తుండటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

శాంతి ఆశ్రమం పీఠాధిపతి జ్ఞానేశ్వరి మాతాజీ కన్నుమూత



ప్రత్తిపాడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్త భక్తులున్న కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం శాంతి ఆశ్రమ పీఠాధిపతి జ్ఞానేశ్వరి మాతాజీ శుక్రవారం ఉదయం కన్నుమూశారు. శాంతి ఆశ్రమం 2వ పీఠాధిపతిగా 43 ఏళ్లుగా ఆమె సేవలందిస్తున్నారు. ఈ ఆశ్రమానికి దేశవ్యాప్తంగానే కాకుండా అమెరికా, స్విట్జర్లాండ్, దక్షిణాఫ్రికా తదితర దేశాల్లో కూడా భక్తులు ఉన్నారు. మాతాజీ 9వ ఏట నుంచి ఆధ్యాత్మిక చింతనలో ఉండి బ్రహ్మచారిణిగా ఉండిపోయారు. 3 నెలల క్రితం ఆశ్రమంలో పడిపోయిన మాతాజీ(90)కి కాలు విరగడంతో కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం ఆశ్రమంలో విశ్రాంతి పొందుతున్నారు. రెండురోజుల కిందట మాతాజీ అస్వస్థతకు గురి కావడంతో ఆశ్రమ నిర్వాహకులు కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 6.40గంటలకు పరమపదించారు. దీంతో ఆమెను శాంతి ఆశ్రమానికి తరలించి ఆశ్రమ వ్యవస్థాపకులు ఓంకార స్వామి సమాధి మందిరం వద్ద సందర్శకుల కోసం ఉంచారు. శనివారం ఉదయం 10 గంటలకు శాంతి ఆశ్రమంలో జ్ఞానేశ్వరి మాతాజీకి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

పది రోజులూ పవిత్రమే!

» ఏ రోజు దర్శించుకున్నా అదే ఫలితం

» వైకుంఠ ద్వార దర్శనాలకు ఆందోళన వద్దు

» 'ఆంధ్రజ్యోతి'తో టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



తిరుమల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు వైకుంఠ ద్వారాలు తెరిచే పవిత్రమైన రోజులు. ఈ పది రోజుల్లో ఏ రోజు స్వామిని దర్శించుకున్నా అదే ఫలితం సిద్ధిస్తుందని పండితులు చెప్తున్నారు. భక్తులు ఆందోళనపడకుండా ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవాలి' అని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. వైకుంఠ ద్వార దర్శనాల నేపథ్యంలో శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'పది రోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో 90 శాతం సమయాన్ని సామాన్య భక్తులకే కేటాయించాం. 182 గంటల దర్శన సమయంలో 164 గంటలు వారికే. ఏ విధమైన ఒత్తిడి అవసరం లేదు. అందరికీ దర్శనం లభిస్తుంది. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు టోకెన్లు లేకుండా వచ్చేవారిలో 3.60 లక్షల మందికి సర్వ దర్శనాలు చేయించేలా ప్రణాళికలు సిద్ధంచేశాం. ఈ పది రోజుల్లో 7.70 లక్షల మంది దర్శనం చేసుకునే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ 6.60 లక్షల మందికి మించి వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోలేదు. ఈ ఏడాది లక్ష మందికి అదనంగా దర్శనం చేయించేలా ఏర్పాట్లు చేశాం. భక్తులు కూడా రద్దీకి అనుగుణంగా తిరుమల యాత్రను ప్లాన్ చేసుకుని రావాలి' అని ఈవో సూచించారు. టోకెన్లలోనే పేర్కొన్న సమయానికే తిరుమలకు రావాలని ఆయన భక్తులకు విజ్ఞప్తి చేశారు. కేటాయించిన సమయానికే వస్తే గంట నుంచి రెండు గంటల్లోనే వైకుంఠ ద్వార దర్శనం పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. చలిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు వేడివేడిగా నిరంతరాయంగా 14 రకాల అన్నప్రసాదాలు అందిస్తాం. 2,400 మంది పోలీసులు, 1100 మంది విజిలెన్స్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేశామని ఈవో వెల్లడించారు.

మత్స్యకారుల బోటును ఢీకొన్న నౌక

» సముద్రంలో పడిపోయిన నలుగురు మత్స్యకారులు

» ముగ్గురు సురక్షితం, ఒకరు గల్లంతు

అచ్యుతాపురం (అనకాపల్లి జిల్లా), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాత్రంతా సముద్రంలో చేపల వేట సాగించిన ఆరుగురు మత్స్యకారులు పడవలోనే నిద్రపోతుండగా ఓ సరకు రవాణా నౌక వారి బోటును ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు మత్స్యకారులు సముద్రంలో పడిపోగా, ముగ్గురు తిరిగి బోటులోకి చేరుకున్నారు. ఒకరు గల్లంతయ్యారు. ఈ సంఘటన గురువారం సాయంత్రం మూడు గంటల సమయంలో నడిసముద్రంలో జరిగింది. మెరైన్ పోలీసులు, బాధిత మత్స్యకారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక శివారు కొండపాలేనికి చెందిన వాసుపల్లి సత్తెయ్య (బోటు యజమాని), వాసుపల్లి గున్నయ్య, వాసుపల్లి బంగార్రాజు, అర్జిల పరదేశి, బచ్చల గణేష్ సూరిబాబు, రాంబిల్లి మండలం కొత్తపట్నానికి చెందిన కొరాణ నీలకరి (48) ఈ నెల 23న పూడిమడక తీరం నుంచి బోటులో చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. సాధారణంగా మత్స్యకారులు రాత్రి పూట చేపల వేట కొనసాగించి, పగలు నిద్రపోతారు. సుమారు ఐదురోజుల పాటు వేటలో పాల్గొని తిరిగి తీరానికి చేరుకుంటారు. ఈ నేపథ్యంలో వీరంతా బోటులో నిద్రపోయారు. పూడిమడక తీరానికి సుమారు 40 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్న వీరి బోటును సరుకు రవాణా నౌక గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఢీకొంది. దీంతో బోటు ఒక్కసారిగా పక్కకు ఒరిగింది. అందులో నిద్రిస్తున్న ఆరుగురిలో వాసుపల్లి రాజు, అరిజల పరదేశి, బచ్చల గణేష్ సూరిబాబు, నీలకరి సముద్రంలో పడిపోయారు. రాజు, పరదేశి, గణేష్‌సూరిబాబు ఈదుకుంటూ దూరంగా ఉన్న తమ బోటు వద్దకు చేరుకున్నారు. కానీ మధ్య వయస్కుడైన నీలకరి సముద్రంలో ఈదలేకపోవడంతో కార్గోషిప్ కిందకు వెళ్లిపోయి, గల్లంతయ్యాడు. ప్రమాదానికి గురైన బోటులోనే గురువారం అర్ధరాత్రి సమయంలో ఐదుగురు మత్స్యకారులు పూడిమడక తీరానికి చేరుకున్నారు. గల్లంతైన మత్స్యకారుడి కోసం నేవీ బోట్ చార్లీ శుక్రవారం గాలింపు చర్యలు చేపట్టింది.

రైల్వే పనులకు
సీనరేజీలో వెసులుబాటు

» కాంట్రాక్టర్లు నేరుగా చెల్లించనక్కర్లేదు.. గనుల శాఖ ఉత్తర్వులు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైల్వే పనులకు పెద్ద ఊరట లభించింది. రైల్వే వర్క్‌ల కాంట్రాక్ట్ సంస్థలు, ఏజెన్సీలు నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి ఖనిజాల సీనరేజీ చెల్లించాల్సిన అవసరం లేకుండా వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గనులు, ఖనిజాల నిబంధనల్లో సవరణ తీసుకొస్తూ గనుల శాఖ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు (జీఓ 262)జారీ చేశారు. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం ఏ వర్క్‌కు అయినా మట్టి, కంకర, ఇతర ఖనిజాలు అవసరం ఉంటే, కాంట్రాక్టర్ ప్రభుత్వానికి సీనరేజీ, ఇతర చార్జీలు చెల్లించి తీసుకెళ్లాలి. జాతీయ రహదారులు, స్టేట్ హైవేల విషయంలోనూ మొన్నటి వరకు ఇదే నిబంధన ఉంది. అయితే, దీనివల్ల పనులు ఆలస్యం అవుతున్నాయని ప్రభుత్వం గుర్తించింది. జాతీయ, రాష్ట్ర రహదారుల వర్క్‌లకు అనుసరిస్తున్న విధానాన్ని రైల్వే పనులకు అమలు చేయాలని నిర్ణయించారు. ఫీజులను కాంట్రాక్టర్‌కు చెల్లించే బిల్లులోనుంచి మినహాయించుకొని నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసే విధానం రహదారుల పనుల్లో ఉంది. దీనివల్ల కాంట్రాక్ట్ సంస్థ నేరుగా ప్రభుత్వానికి సీనరేజీ చెల్లించే అవసరం లేదు. ఇప్పుడు ఇదే చెల్లింపు విధానం రైల్వే వర్క్‌లకు కూడా అమలు చేయనున్నారు. ఇకపై కాంట్రాక్టర్లు, ఏజెన్సీలకు బిల్లులు చెల్లించే సమయంలోనే రైల్వే శాఖ సీనరేజీ ఫీజులు మినహాయించుకొని దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేస్తుంది. దీంతో వర్క్‌లు వేగంగా జరుగుతాయని ప్రభుత్వ వర్గాలు అంచనావేస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అపూర్వ విజయం

కొత్త సంవత్సరంలోకి భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) రెట్టించిన ఉత్సాహంతో అడుగుపెడుతోంది. బుధవారం నాటి ప్రయోగం ఇస్రోకు మరింత శక్తినీ, దూకుడునీ ఇస్తుంది. విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టి నాలుగురాళ్ళు సంపాదించుకోవడం ఇస్రో ఎప్పటినుంచో చేస్తోంది. ముప్పైనాలుగుదేశాలకు చెందిన నాలుగువందల ముప్పైనాలుగు ఉపగ్రహాలను వాణిజ్యప్రాతిపదికన ప్రయోగించిన ఇస్రోకు ఇది అలవాటైన విద్య. కానీ, ఆరున్నరలక్షల కిలోల బాహుబలి రాకెట్, ఆరువేలకేజీల భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టిన మొన్నటి దృశ్యం అపూర్వమైనది. ఇస్రో చరిత్రలో ఇది అత్యంత సాహసోపేతమైన ప్రయోగం. ఆరుటన్నులకు మించిన ఉపగ్రహాలను కూడా అతిసునాయాసంగా పంపగలిగే ఇస్రో సమర్థతను మిగతా ప్రపంచానికి చాటిచెప్పిన ఘట్టం ఇది. సాంకేతిక పరిజ్ఞానంలోనూ, సమర్థతలోనూ ఇస్రో ప్రపంచ స్థాయి అంతరిక్ష సంస్థలకు ఏమాత్రం తీసిపోదని రుజువుచేసిన ప్రయోగం.

కేవలం 52రోజుల్లో ఇస్రో చేసిన మరో సాహసం ఇది. గత నెల 2వ తేదీన అప్పటికి అత్యంత బరువైన 4,400 కిలోల స్వదేశీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టి ఇస్రో రికార్డు సృష్టించింది. ఇప్పుడు ప్రయోగించిన విదేశీ ఉపగ్రహం బరువు మరో 1700 కేజీలు అదనం. ఇలా రెండు భారీ ఉపగ్రహాలను ఇంత స్వల్పవ్యవధిలో ప్రయోగించడానికి ఇస్రో తనను తాను సమాయత్తం చేసుకోవడమే కాక, ఒక ఉపగ్రహాన్ని భూమికి ముప్పైఆరువేల కిలోమీటర్ల ఎత్తున ఉన్న జియో సింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీవో)లోకి, ఇప్పటి అమెరికా ఉపగ్రహాన్ని నిమ్నభూ కక్ష్యలోకి చేర్చడం ద్వారా ఎటువంటి విన్యాసానికైనా తాను సిద్ధమని నిరూపించుకుంది. తాజా ప్రయోగంలో 43.5మీటర్ల ఎత్తులో ఉన్న ఎల్ఎంవి3–ఎం6 రాకెట్ పావుగంటలో బ్లూబర్డ్ బ్లాక్–2 ఉపగ్రహాన్ని కక్ష్యలో ఉంచి, బాహుబలి పేరును మరోమారు సార్థకం చేసుకుంది. ఎప్పటికప్పుడు అదనపు శక్తిని సంతరించుకుంటూ బలోపేతం అవుతున్న ఎల్‌వీఎం–3 రాకెట్ ఇస్రో అమితంగా విశ్వసించే జవనాశ్వం. అరడజను సార్లు అప్పగించిన పనిని అద్భుతంగా నెరవేర్చి పేరు సార్థకం చేసుకుంది. మూడు వాణిజ్య ప్రయోగాలను ఫలప్రదం చేసి అంతర్జాతీయ మార్కెట్‌లో ఇస్రో కీర్తిప్రతిష్ఠలను పెంచింది. చంద్రయాన్–2, చంద్రయాన్–3 ప్రయోగాలకు చిరునామాగా నిలిచిన ఈ రాకెట్ 2027 ఆరంభంలో జరగబోయే గగనయానానికీ, ఆ ఏడాది చివరన సంకల్పించిన చంద్రయాన్–4కు కూడా అండగా ఉండబోతోంది. మరోపదేళ్లలో స్వంత అంతరిక్షకేంద్రాన్ని నిర్మించుకోవడంలోనూ, ఆ తరువాత మరో ఐదేళ్లకు చంద్రుడిమీద కాలూనాలన్న ఆశయానికీ మరింత శక్తిని దట్టించిన ఇటువంటి రాకెట్ అవసరం. 2028లో మొదలుపెట్టి పదేసి టన్నుల చొప్పున దశలవారీగా సామగ్రిని తరలించి యాభైరెండు టన్నుల అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించడం బాహుబలి రాకెట్లతోనే సాధ్యం. ఆ తరువాత చంద్రుడిమీద కాలూనడం సహా పలు మానవయాత్రలకు భారత అంతరిక్ష కేంద్రం వేదికగా, చోదకశక్తిగా ఉపకరిస్తుంది.

అంతరిక్షవాణిజ్యంలో ఇస్రో ప్రయాణం నెమ్మదిగా సాగుతున్నా, అడుగులు గట్టిగా పడుతున్నాయి. తనను తాను మెరుగుపరుకుంటూ, వైఫల్యాలకు దూరంగా ఉంటూ చవుకగా వ్యాపారం చేస్తోంది. మరో పదేళ్లలోగా గ్లోబల్ మార్కెట్‌లో 8–10శాతం వాటా సాధించగలదని ఓ అంచనా. ఇస్రో ప్రస్థానాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇది అసాధారణ విజయం. ఐదేళ్ళక్రితం అంతరిక్షరంగాన్ని కూడా ప్రభుత్వం ప్రైవేటుసంస్థలకు తెరిచిన నేపథ్యంలో, ఇస్రో పునాదిబలం వాటికీ ఉపకరిస్తోంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఈ ఏడాది ఆరంభంలో అంతరిక్షంలో రెండుఉపగ్రహాలను అనుసంధానించి, మళ్ళీ విడదీసిన స్పేడెక్స్ ప్రయోగం సాంకేతిక అద్భుతమే కాదు, అంతరిక్ష కేంద్రం నిర్మాణం కలను సాకారం చేయడంలో మరో అడుగు. ఎడ్లబండి మీద ఉపగ్రహాన్ని తీసుకుపోయిన కాలంనుంచి ఈ భారీ ఉపగ్రహ ప్రయోగంవరకూ సాగిన 'ఇస్రో' ప్రస్థానం మనసు పులకింపచేస్తుంది. బడ్జెట్ కేటాయింపుల్లో పాలకులు చిన్నచూపు చూసినా తనపనితాను చేసుకుపోతోంది. ఒకేమారు వంద ఉపగ్రహాలను విభిన్న కక్ష్యల్లోకి వెదజల్లగలిగే సమర్థతని పెంచుకుంది. శతాధిక రాకెట్ ప్రయోగాలతో ఐదువందల యాభైకుపైగా ఉపగ్రహాలను నింగిలోకి చేర్చింది. ఆంగ్లచిత్రాలకంటే తక్కువ ఖర్చుతో అంతరిక్షయాత్రలు చేస్తోంది. గగనయానాలు, చంద్రయానాలు, అంగారక అధ్యయనాలతో ఆశ్చర్యపరుస్తోంది. ప్రతీ ఏటా నిర్దిష్టమైన లక్ష్యాలతో తాను వేగంగా ఎదుగుతూ దేశాన్ని స్పేస్ సూపర్‌పవర్‌గా తీర్చిదిద్దుతోంది.


సాగునీటి ప్రాజెక్టులపై మేల్కొన్న సర్కారు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏణ్ణర్థం పైగా అయింది. సాగునీటి రంగానికి సంబంధించి సర్కారు ఇప్పుడు ఒక దారికి వచ్చింది. ప్రధానంగా అంతర్రాష్ట్ర జల వివాదాలపై దృష్టి పెట్టింది. అయినా ఇది చాలదు. చేయవలసింది ఇంకా ఉంది.

బనకచర్ల అనుసంధానం చేపట్టే ముందు గోదావరిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వాటాలు ఎంతో తేల్చుకోవలసి ఉందని, అందుకు ట్రిబ్యునల్ నియామకం అవసరమని రాష్ట్ర జలవనరుల శాఖాధికారులు ముఖ్యమంత్రికి నచ్చజెప్పి ఉండాలి. అలాగే కేంద్రంపై ఒత్తిడి పెంచి ఉండాల్సింది. అయితే వారు ఇప్పటికి గానీ మేల్కోలేదు. 75శాతం డిపెండబిలిటీ మేరకు గోదావరి ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రానికి 1480 టీఎంసీలు కేటాయించింది. ఇందులో 945 టీఎంసీలు తమకు చెందుతాయని, కేవలం 518 టీఎంసీలు మాత్రమే ఆంధ్రప్రదేశ్‌కు చెందుతాయని తెలంగాణ వాదిస్తుండగా, తమ వాటా 737 టీఎంసీలుగా ఏపీ చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ తమ నికర జలాల వాటా ఎంతో తేల్చుకొని ఉంటే ఈ రోజు వరద జలాల వెంట పడవలసిన ఆగత్యం ఉండేది కాదు.

వాస్తవంలో 2020లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనే కృష్ణా ట్రిబ్యునల్‌తో పాటు గోదావరి ట్రిబ్యునల్ నియామకానికి ప్రతిపాదన చేసి ఉన్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి తన హయాంలో ఎప్పుడూ దాని ఊసెత్తలేదు. ఏణ్ణర్థం య్యేంత వరకు కూటమి ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన సందర్భంగా ట్రిబ్యునల్ నియామకం గురించి కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. అంతేకాదు, పలు కీలకమైన అంశాలు ప్రస్తావించారు.

రాష్ట్ర విభజన చట్టంలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ మేరకు పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు ఆర్థిక సాయం చేయాలని కోరారు. విభజన చట్టం ప్రకారం జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరం రెండవ దశ డీపీఆర్‌ను ఆమోదించాలని కోరడం కూడా ప్రత్యేక సంతరించుకుంది. సుప్రీంకోర్టులో స్టే ఉన్నా, కర్ణాటక ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలను కట్టడి చేయాలని కోరడం శుభ సూచికమే. వీటన్నింటికి మించి వంశధార ట్రిబ్యునల్ తీర్పు నోటిఫై చేయాలని కోరారు. ఇవన్నీ స్వాగతించదగినవే. వాస్తవంలో ఇవన్నీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఈ పాటికే కొన్ని సాధించి ఉండాల్సింది. గోదావరి ట్రిబ్యునల్ నియామకానికి తెలంగాణ ఇష్టపడడం లేదు. ట్రిబ్యునల్ నియామకం జరిగితే ప్రతి ఏటా సముద్రంలో కలిసిపోతున్న వరద జలాల గురించి దిగువ రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు ఉండే వెసులుబాటును కూడా తేల్చే అవకాశం లభిస్తుంది.



కూటమి ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై దృష్టిపెట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా గోదావరి ట్రిబ్యునల్ నియామకం గురించి కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. పలు కీలకమైన అంశాలు ప్రస్తావించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటన సందర్భంగా నల్లమల సాగర్ అనుసంధానంతో పాటు రాయలసీమలోని పెండింగ్ ప్రాజెక్టులకు రాష్ట్ర విభజన చట్టం రక్షణ కల్పించినందున అంశాన్ని ప్రస్తావించి ఆర్థిక సహాయం కోరారు. ఇన్నాళ్లకు ఈ డిమాండ్‌ను కేంద్రం ముందు పెట్టడం శుభ పరిణామమే. వాస్తవంలో 2014లో రాష్ట్ర విభజన చట్టం రాజ్యసభలో చర్చకు వచ్చినప్పుడు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ నమూనా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బుందేల్‌ఖండ్ ప్రాంతానికి యమునా నది ఉప నదులైన కెన్–బెత్వా నదుల అనుసంధానం భారీ ప్రాజెక్టు నిర్మిస్తోంది. 44,605 కోట్ల రూపాయల వ్యయంతో, పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తోంది. తొలి ఏడాది 6,700 కోట్లు కేటాయించింది. ఇన్నాళ్లకు ఏపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ముందు ఈ డిమాండ్ పెట్టడం ముదావహమే. డిమాండ్ పెట్టి ఊరుకోకుండా ఈ అంశంలో ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం వెంటపడితే కొంతలో కొంతైనా నిధులు రాబట్టే అవకాశం ఉంది.


చంద్రబాబు అధికారం చేపట్టాక పలుమార్లు ఢిల్లీలో కేంద్ర మంత్రుల్ని కలుస్తున్నా, ఎప్పుడూ పోలవరం రెండవ దశ డీపీఆర్ గురించి ప్రస్తావన చేయలేదు. ఇటీవల కేంద్ర జలశక్తిశాఖ మంత్రి వద్ద ఈ అంశం లేవనెత్తారు. జగన్మోహన్‌రెడ్డి హయాం నుంచే పోలవరం రెండవ దశపై నీలినీడలు కమ్ముకున్నాయి. పోలవరం ఇప్పట్లో తొలి దశ పూర్తి చేస్తానని ప్రతిపాదన జగన్మోహన్‌రెడ్డి చేశారు. ఆయన ప్రభుత్వం 36 వేల కోట్లతో తొలి దశ ప్రతిపాదనలను కేంద్రానికి పంపించింది. ఈ దశలో ఎన్నికలొచ్చి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. గత ప్రభుత్వ ప్రతిపాదనలనే కొంత మార్పు చేసి ప్రస్తుతం అమలు చేస్తున్నారు. ఎట్టకేలకు ఇప్పుడు చంద్రబాబు కేంద్రం ముందు ఈ ప్రతిపాదన చేయడం స్వాగతించాలి. పోలవరం తొలి దశ నిర్మాణంలో ఉన్న సమయంలోనే రెండవ దశ డీపీఆర్‌కు ప్రతిపాదనల రూపకల్పన చేయడానికి ఏ అడ్డంకి ఉండదు. అయితే ఈ ప్రతిపాదన అమలు కేంద్ర జలశక్తిశాఖ మంత్రి స్థాయిలో జరిగే పరిస్థితి లేదు. ప్రధాని నరేంద్ర మోదీ వద్దనే నేరుగా చంద్రబాబు ప్రస్తావన చేయడం అవసరం. 2014–19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు పూర్తి స్థాయి డీపీఆర్‌ను కేంద్ర జల శక్తి శాఖకు చెందిన సాంకేతిక సలహా కమిటీ 2019 ఫిబ్రవరిలో 2017–18 షెడ్యూల్ రేట్లతో 55,548.83 కోట్ల రూపాయల అంచనాలతో ఆమోదించింది. అనంతర కాలంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా మూలన పడింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు మరో ముఖ్యమైన అంశం కూడా కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. ఇది ఉత్తరాంధ్రకు ప్రధానంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు జీవన్మరణ సమస్యగా ఉంది. వంశధార జలాల వివాదంపై ట్రిబ్యునల్ 2017లోనే ముసాయిదా తీర్పు ఇచ్చింది. వంశధారపై ఆంధ్రప్రదేశ్ నేరెడి వద్ద బ్యారేజీ నిర్మించుకోవచ్చని చెప్తూ, దానితో పాటు కాట్రగడ వద్ద సైడ్‌వేర్ నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చింది. ఫలితంగా ఒడిషా భూభాగంలో 106 ఎకరాల ముంపు ఉంటుందని ఇందుకు ఆ రాష్ట్రం అంగీకరించాలని తీర్పు ఇచ్చింది. 2019లో ఒడిషా సుప్రీంకోర్టుకెక్కింది, కానీ కోర్టు స్టే ఇవ్వలేదు. తిరిగి జగన్మోహన్‌రెడ్డి హయాంలో 2021లో ట్రిబ్యునల్ తుది తీర్పు అదే విధంగా ఇచ్చింది. కానీ ఒడిషాతో ఉన్న రాజకీయ కారణాలతో కేంద్ర ప్రభుత్వం ట్రిబ్యునల్ తుది తీర్పుపై స్టే లేకున్నా నోటిఫై చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబు, ఒడిషా ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపివుంటే సమస్య సామరస్యంగా పరిష్కారమయ్యేది. కానీ అలా జరగలేదు. ఇప్పుడు కేంద్ర జలశక్తి శాఖను కోరడం కొంతలో కొంత ఊరటనిచ్చే అంశం. నేరెడి బ్యారేజీ నిర్మాణం జరిగితే 19 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మాణమైన హీరమండలం రిజర్వాయర్‌కు గ్రావిటీతో నీళ్లు అందుతాయి. అదే జరిగితే ఆ జలాశయం నుంచి దాదాపు 35 కిలోమీటర్ల దూరంలోని నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్టకు వంశధార నీళ్లు చేరి, రెండు నదుల అనుసంధానం జరుగుతుంది. ఇందుకు కూటమి ప్రభుత్వాన్ని అభినందించవలసిందే.

■ వి.శంకరయ్య
విశ్రాంత పాత్రికేయుడు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

గాంధీ పథమా? లెనిన్ మార్గమా?



అహింసా ప్రవక్త మహాత్ముడు, అక్టోబర్ విప్లవ నిర్మాత లెనిన్ చింతనా ధోరణులలోని తారతమ్యాలను నిశితంగా విశ్లేషించిన, సాదృశ్యాలను ఎత్తిచూపిన వంద సంవత్సరాల నాటి ఒక ఆసక్తికరమైన పుస్తకాన్ని నేను ఇటీవల చదివాను. 'లెనిన్ అండ్ గాంధీ' అనేది ఆ పుస్తకం శీర్షిక. గ్రంథకర్త ఆస్ట్రియన్ రచయిత, చరిత్రకారుడు రెనే ఫ్యులోప్ మిల్లర్ (1891–1963). తొలుత ఫ్రెంచ్ భాషలో ప్రచురితమైన ఈ పుస్తకం 1927లో ఆంగ్లంలోకి అనువదితమయింది.

గాంధీ, లెనిన్‌లు సమకాలికులు. ఆరునెలల తేడాతో వారు ఈ ప్రపంచంలోకి ప్రవేశించారు. ఇరువురూ మధ్యతరగతి కుటుంబాలలో జన్మించారు. పేదరికం, అన్యాయాల నుంచి మానవకోటిని విముక్తం చేయాలనే ప్రగాఢ ఆకాంక్ష వారి జీవితాలను విలక్షణంగా నడిపించింది. లెనిన్ తన రచనలలో కనికరం లేని కఠిన వాదనలు చేసేవారు. గాంధీ ప్రజా జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ చాలా నాగరీకంగా వ్యవహరించేవారు. మరో ముఖ్యమైన తేడా– లెనిన్ హింసను ఆరాధించి హింసాత్మక పద్ధతులను అనుసరించారు. అహింసకు అంకితమయిన ఉదాత్తుడు గాంధీజీ. మనసా వాచా కర్మణా అహింసావాది.

నాకు తెలిసినంతవరకు గాంధీ, లెనిన్‌ల భావజాలాలను తులనాత్మకంగా పరిశీలించిన తొలి రచయిత బొంబాయి కమ్యూనిస్టు శ్రీపాద్ అమృత్‌డాంగే (1899–1991). 1921లో ఆయన 'గాంధీ వర్సెస్ లెనిన్' అనే ఒక చిన్న పుస్తకాన్ని రాశారు. ఈ కమ్యూనిస్టు సహజంగానే గాంధీ కంటే లెనిన్ వైపే మొగ్గారు. అయితే తన స్వదేశీయుడి భావాలు, ఆలోచనల పట్ల ఆసక్తి, సానుభూతిని నిలుపుకున్నారు. 'గాంధీ, లెనిన్ సిద్ధాంతాలు ఆచరణాత్మక జీవితంలో సాకారమవ్వడం అసాధ్యం' అని డాంగే వ్యాఖ్యానించారు.

డాంగే పుస్తకం వెలువడిన నాలుగు సంవత్సరాలకు హ్యారీ వార్డ్ (1873–1960) అనే అమెరికన్ మెథడిస్ట్ క్రైస్తవ పండితుడు 1925 ఏప్రిల్‌లో 'ది వరల్డ్ టుమారో' అనే జర్నల్‌లో 'లెనిన్ అండ్ గాంధీ' అనే వ్యాసాన్ని రాశారు. గాంధీ, లెనిన్ ఇరువురూ తమ మధ్యతరగతి నేపథ్యాన్ని అధిగమించి, తమ నిరాడంబర జీవనశైలుల ద్వారా సామాన్య మానవులతో తాదాత్మ్యమయ్యారని వార్డ్ పేర్కొన్నారు. వారి మధ్య వ్యత్యాసాలను వివరిస్తూ పీడకుల ఆధిపత్యాన్ని వారి హింసాత్మక పద్ధతులను మరింతగా అనుసరించడం ద్వారానే అధిగమించగలమని లెనిన్ విశ్వసించగా, ప్రత్యామ్నాయ పద్ధతులలో పీడకులపై విజయం సాధించగలమని గాంధీ భావించారు, ఆచరించారు' అని వ్యారీ వార్డ్ రాశారు. లెనిన్, గాంధీల భావాలు, ఆదర్శాలు వారి వారి దేశాల చరిత్రలను మార్చడమే కాకుండా ప్రపంచ చరిత్రను మలుపు తిప్పాయని వార్డ్ అభిప్రాయడ్డారు.

1927లో 'గాంధీ అండ్ లెనిన్'ను ప్రచురించిన రెనే మిల్లర్‌కు డాంగే, వార్డ్ రచనల గురించి తెలిసి ఉండే అవకాశం లేదు. అయితే ఆయన కూడా మొదటి ఇరువురు అభిప్రాయపడినట్టుగానే లెనిన్, గాంధీలు చరిత్ర గతిని మార్చివేశారని సునిశ్చితంగా విశ్వసించారు. రష్యాలో కార్మికులు, కర్షకుల మధ్య దృఢమైన, నిర్మాణాత్మక సంబంధాలను పెంపొందించేందుకు లెనిన్, భారత్‌లో హిందువులు–ముస్లింల మధ్య సామరస్య సంబంధాలను నెలకొల్పేందుకు గాంధీ అనితర సాధ్యమైన కృషి చేశారని మిల్లర్ పేర్కొన్నారు. దోపిడీకి తావులేని వర్గరహిత సమాజాన్ని స్థాపించడమనే లక్ష్యసాధనకు హింసాత్మక పద్ధతులను అనుసరించడం మినహా మరో మార్గం లేదని లెనిన్ విశ్వసించగా, ప్రతికూల పరిస్థితులలోనూ అహింసాత్మక, ప్రేమ పద్ధతులలో గాంధీ తన వ్యక్తిగత, రాజకీయ ప్రత్యర్థులపై పోరాడి చరిత్రాత్మక ఫలితాలు సాధించారని మిల్లర్ పేర్కొన్నారు.

హ్యారీ వార్డ్ వ్యాసం వెలువడిన ఒక సంవత్సరం అనంతరం, రెనే మిల్లర్ పుస్తకం ప్రచురణకు ఒక ఏడాది ముందు, అంటే 1926లో ఫిలిప్ స్ప్రాట్ (జననం 1902) అనే బ్రిటిష్ యువ కమ్యూనిస్టు భారత్‌కు వచ్చారు. ఈ దేశంలో కమ్యూనిస్టు విప్లవాన్ని పురిగొల్పడమే అతడి రాక లక్ష్యం. ఆస్ట్రియన్ మిల్లర్, అమెరికన్ వార్డ్ వలే స్ప్రాట్ రచయిత కాదు. అయితే లెనిన్ బాటలో నడిచేందుకు నిర్ణయించుకున్న క్రియాశీల వ్యక్తి. రెండు సంవత్సరాల పాటు భారత ఉపఖండమంతటా ఈ యువ కార్యకర్త పర్యటించారు. భారతీయ విప్లవకారులతో సంబంధాలను నెలకొల్పుకున్నారు. విప్లవ సాధ్యతకు గల అవకాశాలను చాలా నిశితంగా పరిశీలించారు. 1929 వేసవిలో స్ప్రాట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర భారతీయ కామ్రేడ్లతో పాటు అతడినీ మీరట్ కుట్రకేసులో ముద్దాయిగా కోర్టు బోనులో నిలబెట్టారు. దాదాపు ఒక దశాబ్దం పాటు స్ప్రాట్ జైలు జీవితం గడిపారు. కారాగారవాసంలో భారత దేశ చరిత్ర, తాత్విక సంప్రదాయాలు, సాహిత్యం విస్తృతంగా అధ్యయనం చేశారు. అంతకు ముందు ఇవన్నీ అతడికి పెద్దగా అవగాహన లేని అంశాలు. ఈ ప్రగాఢ అధ్యయనం మూలంగా లెనినిస్టు భావజాలం ఒకప్పుడు తనను అనుమతించిన దానికంటే ఎక్కువ సహానుభూతితో గాంధీని అర్థం చేసుకునేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. జైలు నుంచి విడుదల అయిన వెంటనే సేవాగ్రామ్ వెళ్లి గాంధీజీని దర్శించారు. అనేక అంశాలపై మహాత్ముడితో మాటామంతీ జరిపారు. ఆ సంభాషణల స్ఫూర్తితో పాటు గాంధీజీ రచనల నిశిత అధ్యయనం ఆధారంగా ఆ మహోన్నత భారతీయుని చింతనా ధోరణి, భావ విశిష్టత గురించి 'Gandhism : An Analysis' అనే పుస్తకాన్ని స్ప్రాట్ రాశారు. లెనిన్ విప్లవ తాత్త్వికత, గాంధీ మానవతా దార్శనికత మధ్య సమన్వయం సాధించేందుకు స్ప్రాట్ ప్రయత్నించారు. 'గ్రామీణ భారతదేశంలో ప్రస్తుతం నెలకొనివున్న పరిస్థితులలో కోట్లాది ప్రజలను అనివార్యమైన దానికంటే ఒక్కరోజు పాటు అదనంగా వదిలివేసినా నేరం అవుతుంది. విదేశీ దురాక్రమణల ప్రమాదాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రష్యన్లు మరింతగా దారిద్ర్యంలో కునారిల్లవలసి ఉన్నది. పాలనలో, సమాజ నిర్మాణంలో క్రూర పద్ధతులను అనుసరించవలసి ఉన్నది. సంప్రదాయ సోషలిజం అటువంటి అస్వాభావిక పాలనా పద్ధతులకు పాల్పడకుండా సంయమనం వహించగలిగితే అది తప్పకుండా ఒక అర్ధ శతాబ్ది కాలంలో భారత్‌ను– అశేష జనులు మరింత సుఖసంతోషాలతో జీవించగల నెలవుగా మార్చివేయగలదు' అని ఫిలిప్ స్ప్రాట్ రాశారు.

ఒక మార్క్సిస్టుగా జైలుకు వెళ్లిన ఫిలిప్ స్ప్రాట్ అస్పష్టమైన కొత్త ఆలోచనలతో స్వేచ్ఛా ప్రపంచంలోకి వచ్చారు. లెనిన్, గాంధీ భావజాలాల్లో దేనివైపూ పూర్తిగా మొగ్గకుండా ఒక మధ్యేమార్గాన్ని అన్వేషిస్తూ మానవేంద్రనాథ్‌రాయ్ స్ఫూర్తి కేంద్రంగా ఉన్న మేధావుల బృందంలో చేరారు. లెనిన్‌కు మాజీ సహచరుడు, గాంధీ విమర్శకుడు అయిన రాయ్ రాడికల్ డెమొక్రాటిక్ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ ప్రచురించే 'ఇండిపెండెంట్ ఇండియా' పత్రికకు ఆయన ప్రధాన సంపాదకుడు. 1941లో భారతీయ మహిళను వివాహం చేసుకున్న ఫిలిప్ స్ప్రాట్ బెంగళూరులో స్థిరపడ్డారు. గాంధీజీపై రాసిన ఒక వ్యాసాన్ని ఇండిపెండెంట్ ఇండియా పత్రికకు పంపించారు. అయితే గాంధీ ఆలోచనల పట్ల మితిమీరిన సానుభూతి చూపిందనే కారణంతో రాయ్ ఆ వ్యాసాన్ని ప్రచురించడానికి తిరస్కరించారు. ఆ వ్యాసం లిఖిత ప్రతి ఆనాడే కనుమరుగయింది. అయితే అందులోని అంశాలను అవగాహన చేసుకునేందుకు రాయ్‌కు స్ప్రాట్ రాసిన ఒక లేఖ దోహదం చేస్తుంది. 'స్వావలంబనకు, ప్రజా వ్యవహారాలలో నిజాయితీకి గాంధీ ప్రాధాన్యమిస్తున్నారు. తనతో ఏకీభవించని వారికి సహకరించే ఉదారస్వభావం ఆయనకు ఉన్నది. కుల మత సంకుచితత్వాలకు పోకుండా విశాల భావాలతో నిర్ణయాలు తీసుకునే ఉదాత్తుడు గాంధీ' అని స్ప్రాట్ రాశారు. 'స్వాతంత్ర్యానికి అర్హమైన దేశం (సోషలిజానికి అర్హమైన దేశమని నేను అనడం లేదు)గా భారత్‌ను గాంధీ తీర్చిదిద్దుతున్నారు' అని రాస్తూ 'బూర్జువా ప్రజాస్వామ్యం గురించి లెనిన్ 'పొరపాటు' అభిప్రాయాన్ని' ఆయన ప్రస్తావించారు.

'బూర్జువా ప్రజాస్వామ్యం ఒక సంపూర్ణ వంచన అని, విప్లవ లక్ష్యాల సాధనకు దానిని ఉపయోగించుకోవచ్చు గానీ దానికదే ఎటువంటి ఉన్నత లక్ష్యాలను సాధించలేదని' లెనిన్ అభిప్రాయపడినట్టు స్ప్రాట్ పేర్కొన్నారు. దీనిపై ఆయన ఇలా వ్యాఖ్యానించారు: 'నిజానికి బూర్జువా ప్రజాస్వామ్యం ఒక సార్థక విజయం. దాని ప్రధాన లక్షణాలు అయిన రాజకీయ ప్రజాస్వామ్యం, పౌర స్వేచ్ఛలు, ఆలోచనా స్వాతంత్ర్యం మొదలైనవాటిని పరిరక్షించుకోకపోతే సోషలిస్టు సమాజ నిర్మాణానికి ఎటువంటి దోహదం జరగదు'. లోపభూయిష్ఠమైనదే అయినప్పటికీ అది మానవ అనుభవాల వైవిధ్యాన్ని గౌరవిస్తూ వాటిని పెంపొందిస్తుందని, విమర్శలను అనుమతిస్తుందని బూర్జువా ప్రజాస్వామ్యానికి ఫిలిప్ స్ప్రాట్ జేజేలు పలికారు. ఆయన ఈ హర్షధ్వానాలు వ్యక్తం చేసిన ఎనభై సంవత్సరాల అనంతరం ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రజాస్వామిక వ్యవస్థలు ప్రతీపశక్తుల ముట్టడిలో ఉన్నాయి. ట్రంప్ ఏలుబడిలోని అమెరికా, విక్టర్ ఓర్బాన్ పాలనలోని హంగరీ, నెతన్యాహూ నేతృత్వంలోని ఇజ్రాయెల్, ఎర్డోగాన్ సారథ్యంలోని తుర్కియే, మరీ ముఖ్యంగా మోదీ భారత్‌తో రాజ్యాంగ సంస్థల స్వతంత్ర ప్రతిపత్తికి ఎనలేని అపకారం జరుగుతోంది. ఈ దేశాల నిరంకుశ పాలకులు పరిస్థితులను పూర్తిగా తమ పార్టీలకు సానుకూలం చేసేందుకు ప్రజాస్వామిక విలువలు, సంప్రదాయాలను కాలరాస్తున్నారు. అయితే ఈ శోచనీయ ప్రజాస్వామిక తిరోగమనానికి సరైన సమాధానం లెనినిస్ట్ తరహా విప్లవం కానేకాదు. ఎందుకంటే అది నిరంకుశ ఏకపార్టీ పాలనకే తప్పకుండా దారితీస్తుంది. సుపరిపాలనను సమకూర్చుకోవడంలో మానవాళి సాధించిన అత్యంత విలువైన విజయమే 'బూర్జువా ప్రజాస్వామ్యం' వెలుగొందేందుకు తోడ్పడిన స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల విధానం, పత్రికా స్వేచ్ఛ, స్వతంత్ర న్యాయవ్యవస్థ స్వతంత్ర సివిల్ సర్వీస్ తదితర రాజ్యాంగ వ్యవస్థల, సంస్థల పురుజ్జీవానికి, నవీకరణకు పూనుకోవాల్సిన అవసరమున్నది.

> **పేదరికం, అన్యాయాల నుంచి మానవ కోటిని విముక్తం చేయాలనే ప్రగాఢ ఆకాంక్ష– అహింసా ప్రవక్త గాంధీ, అక్టోబర్ విప్లవ నిర్మాత లెనిన్ జీవితాలను విలక్షణంగా నడిపించింది. వంద సంవత్సరాల క్రితమే భారతీయ కమ్యూనిస్టు డాంగే, అమెరికన్ క్రైస్తవుడు హ్యారీ వార్డ్, ఆస్ట్రియన్ రచయిత మిల్లర్; అదే కాలంలో మార్క్సిస్టుగా భారత్‌కు వచ్చి, ఆ తరువాత గాంధీ విశిష్టతను గుర్తించిన ఫిలిప్ స్ప్రాట్ ఆ ఇరువురి సిద్ధాంతాలు, ఆచరణల గురించి జరిపిన తులనాత్మక పరిశీలనలు ఆసక్తికరమైనవి.**



■ రామచంద్ర గుహ

గతానుగతం

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఏపీ బ్రాండ్ ఇమేజ్ పెంచిన అవార్డులు!

ప్రజా జీవితంలో అవార్డులు రావడం సహజం. కానీ ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు వివిధ రంగాలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు, అవార్డులు లభించడం సాధారణ విషయం కాదు. సమర్థ పనితీరుతో ఈ ఐదుగురు ఆంధ్రప్రదేశ్‌కు ఒక విశ్వసనీయ బ్రాండ్ ఇమేజ్‌ను నిర్మించారు. ఒక కుటుంబం ఐదు దిశల్లో ప్రజా జీవితాన్ని విలువలతో నడిపించినందుకు వచ్చిన సమష్టి గుర్తింపు ఇది. ఆ ఐదుగురు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి, నారా బ్రాహ్మణి, నారా లోకేశ్, నారా దేవాన్ష్. చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు; భువనేశ్వరికి డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డుతో పాటు గోల్డెన్ పీకాక్ అవార్డు; నారా బ్రాహ్మణికి బెస్ట్ బిజినెస్ ఉమెన్ అవార్డు; నారా దేవాన్ష్‌కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్–2025 అవార్డు; నారా లోకేశ్ పనితీరును దేశ ప్రధాని స్వయంగా ప్రశంసించడం. ఈ అవార్డులను కేవలం వ్యక్తిగత ఘనతలుగా చూడకూడదు. ప్రజాసేవా సంస్కృతి, బాధ్యతాయుత నాయకత్వం, విలువలతో కూడిన పనితీరుకు వచ్చిన సమష్టి గుర్తింపుగా చూడాలి.



చంద్రబాబుకు లభించిన అవార్డు ఆయన రాజకీయ జీవితానికి వచ్చిన ప్రశంస మాత్రమే కాదు. అది పాలనలో తెచ్చిన సంస్కరణలు, ఒక పాలనా మోడల్‌కు వచ్చిన గ్లోబల్ అవార్డు. అభివృద్ధిపై స్పష్టమైన దృష్టి, ఆర్థిక క్రమశిక్షణ, భవిష్యత్ తరాల కోసం రూపొందించిన విధానాలకు దక్కిన గౌరవం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఐటీ విప్లవం, ఇన్వెస్టర్–ఫ్రెండ్లీ పాలసీలు ఇవన్నీ మాటలుగా కాదు, కార్యాచరణగా మారాయి. రాష్ట్రాల మధ్య పోటీ యుగంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆలోచనలతో ముందుకు నడిపిస్తున్న రిఫార్మర్‌గా ఆయన నిలిచారు.

నారా భువనేశ్వరి నిస్వార్థంగా సమాజానికి స్వచ్ఛంద సేవలందిస్తూ ఆదర్శంగా నిలిచి, అంతర్జాతీయ డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ అవార్డు–2025ను అందుకోవడం తెలుగు ప్రజలకు గర్వకారణం. ఈ అత్యుత్తమ అవార్డు, ఆమె చేసిన స్వార్థ రహిత సేవా యజ్ఞానికి దక్కిన సముచిత గౌరవం. తెలుగు మహిళా శక్తి, ఆంధ్రప్రదేశ్ సేవా సంస్కృతికి ప్రపంచం ఇచ్చిన గుర్తింపు. అంతేకాదు హెరిటేజ్ ఫుడ్స్, ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో గోల్డెన్ పీకాక్ అవార్డునూ ఆ సంస్థ ఎండీ హోదాలో భువనేశ్వరి అందుకున్నారు.

నారా బ్రాహ్మణికి లభించిన అవార్డు వ్యాపార ప్రపంచంలో వారసత్వ ముద్రపై కాదు, సామర్థ్యంపై వచ్చినది. ఆధునిక నిర్వహణ, అంతర్జాతీయంగా నైతిక విలువల సమన్వయంతో ఆమె చూపిన నాయకత్వానికి ఇది గుర్తింపు. బ్రాహ్మణి దేశంలోనే ఉత్తమ బిజినెస్ ఉమెన్‌గా అవార్డు పొందడం, ప్రొఫెషనల్ పనితనంతో సాధించిన ఘనత. గ్లోబల్ మేనేజ్‌మెంట్ అనుభవం, కార్పొరేట్ విజన్, సంస్థల విస్తరణలో ఆమె చూపిన నాయకత్వం ఈ అవార్డుకు పునాది.

మంత్రిగా నారా లోకేశ్ పనితీరును దేశ ప్రధాని స్వయంగా ప్రశంసించడం సాధారణ రాజకీయ సంఘటన కాదు. ఈ ప్రశంసలు యువ నాయకత్వం పనితీరును సమర్థతతో కొలవచ్చనే సత్యాన్ని నిరూపిస్తున్నాయి. విద్య, ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో ఆధునిక ఆలోచనలతో లోకేశ్ పనిచేస్తున్నారు. ప్రగతిశీల ఆలోచనలతో ఆరు నెలలుగా రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలను ప్రోత్సహిస్తూ నవశకానికి నవ్యాంధ్రను పరుగు తీయిస్తున్నారు. తల్లిదండ్రులు–టీచర్ల భాగస్వామ్యంతో పిల్లల భవిష్యత్తు నిర్మాణం సాధ్యమని మంత్రి లోకేశ్ నమ్మకం, అది దేశానికి ఒక మోడల్‌గా నిలిచిందని నారా లోకేశ్‌ను అభినందిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రశంసాపత్రం ఇవ్వడం గర్వ కారణం. అట్లాగే నారా దేవాన్ష్ చెస్ ఆటలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్–2025 అవార్డును అందుకోవడం క్రమశిక్షణ, మేధస్సు, వ్యూహాత్మక ఆలోచనలకు దక్కిన గౌరవం.

• కలిశెట్టి అప్పలనాయుడు
విజయనగరం పార్లమెంట్ సభ్యులు

'అణు' ప్రైవేటీకరణ దేశద్రోహమే!


అణుశక్తి రంగం ఒక సాధారణ పరిశ్రమ కాదు. ఇది దేశ భద్రతకు, సార్వభౌమత్వానికి, మానవ జాతి భద్రతకు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అత్యంత వ్యూహాత్మక రంగం. ఇలాంటి రంగాన్ని ప్రభుత్వ నియంత్రణలో ఉంచాల్సిన అవసరం ఉంది. కానీ లాభాలే లక్ష్యంగా ఈ రంగాన్ని ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది కేవలం ఆర్థిక పొరపాటు మాత్రమే కాదు, దేశద్రోహానికి సమానమైన నిర్ణయం. అణుశక్తి అనేది అత్యంత ప్రమాదకరమైన శక్తి. ఇందులో చిన్న నిర్లక్ష్యం కూడా లక్షలాది ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి ముప్పు కలిగిస్తుంది.

అణుశక్తి రంగాన్ని ప్రైవేటీకరిస్తే– 1) వేల సంవత్సరాలు ప్రమాదకరంగా రేడియోధార్మిక వ్యర్థాలు వెలువడతాయి. 2) చెర్నోబిల్, ఫుకుషిమా లాంటి ప్రమాదాల ముప్పు. 3) నిర్మాణం, నిర్వహణ, మూసివేతకు వేల కోట్ల వ్యయం. 4) నిర్మాణానికి దశాబ్దాల కాలం పడుతుంది. 5) అణువ్యాప్తి ప్రమాదం.. ఆయుధాల తయారీకి దారి తీసే అవకాశం. 6) యురేనియం పరిమిత వనరు.. పునరుత్పత్తి కానిది. 7) అధిక నీటి వినియోగం. 8) భూతాప పెరుగుదలతో జల, జీవ వ్యవస్థల వినాశనం. 9) క్యాన్సర్ వంటి వ్యాధుల ముప్పు. 10) యురేనియం గనులతో రాడాన్, ఆర్సెనిక్ వంటి విషపదార్థాల ప్రభావం. 11) వ్యర్థాల రవాణాతో ప్రమాదాలు, లీకేజీలు. 12) ఉగ్రవాద ముప్పు. 13) నిర్మాణ వ్యయాన్ని మించే మూసివేత వ్యయం. 14) వ్యర్థాల శాశ్వత పరిష్కారానికి ప్రపంచ వ్యాప్తంగా అంగీకారం లేదు. 15) కఠిన నిబంధనలతో నిర్వహణ క్లిష్టత. 16) ప్రజా వ్యతిరేకత. 17) సంక్లిష్ట సరఫరా వ్యవస్థ.. అంతర్జాతీయంగా ఆధారపడటం. 18) పునరుత్పాదక శక్తితో అసమతుల్యత. 19) భవిష్యత్ తరాలపై ఎనలేని భారం పడే ప్రమాదం.. వంటివి సంభవిస్తాయి.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కీలక రంగాలను జాతీయాకరించడం వల్లే నేడు, పురోగమిస్తున్న భారతదేశం సాధ్యమైంది. 14 ప్రధాన బ్యాంకుల జాతీయాకరణతో రైతులు, చిన్న వ్యాపారులకు రుణాలు. కోల్ ఇండియా(1973) – ప్రపంచంలోనే అతిపెద్ద బొగ్గు సంస్థ. ఓఎన్‌జీసీ, ఐఓసీ, బీపీసీఎల్– లాభదాయక ప్రభుత్వ సంస్థలు. ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్, సెయిల్, హాల్, బీహెచ్ఈఎల్ – పారిశ్రామిక మౌలిక వసతులు. ఎయిర్ ఇండియా– సంక్షోభ కాలంలో దేశ సేవ.

అణుశక్తి ప్రైవేటీకరణ ఎందుకు అత్యంత ప్రమాదకరమంటే– ఏ రాష్ట్రం, ఏ జిల్లా అణు కేంద్రాన్ని అంగీకరించదు. ఒక్క కేంద్రానికి 13 బిలియన్ డాలర్లకు పైగా వ్యయం. భద్రత, పారదర్శకత ప్రైవేటులో అసాధ్యం. రేడియోధార్మిక వ్యర్థాల నిర్వహణలో లాభాల కోసం నిర్లక్ష్యం. భూగర్భ జలాలు, చెరువులు కలుషితం. వ్యర్థాలను భూమిలో దాచడం కూడా సురక్షితం కాదు.

ప్రపంచంలోని చాలా దేశాల్లో అణుశక్తి రంగం ప్రభుత్వ నియంత్రణలోనే ఉంది. భారతదేశం యురేనియాన్ని– ఆస్ట్రేలియా, కెనడా, ఖజకిస్థాన్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. అటువంటి సున్నితమైన రంగాన్ని ప్రైవేటు సంస్థల చేతికి ఇవ్వడం జాతికి వ్యూహాత్మకంగా ఆత్మహత్యా సదృశమే అవుతుంది. అణుశక్తి రంగం ప్రైవేటీకరణ ఆర్థికంగా, సామాజికంగా, నైతికంగా, ఏ కోణంలోనూ సమర్థనీయం కాదు. ఇలాంటి రంగం ప్రైవేటీకరణతో లాభాలు ప్రైవేటుకు, నష్టాలు ప్రజలకు లభిస్తాయి. అణుశక్తి రంగం తప్పనిసరిగా ప్రభుత్వ నియంత్రణలోనే ఉండాలి. అదే దేశానికి, ప్రజలకు, భవిష్యత్ తరాలకు ఉపయోగం.



○ డా. కె.నారాయణ
చైర్మన్, సెంట్రల్ కంట్రోల్ కమిషన్, సీపీఐ

కోర్టులో లొంగిన కార్ల నిందితుడు

కస్టడీ కోసం పిటిషన్ దాఖలు చేయనున్న పోలీసులు

నరసరావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట చోర్ గ్యాంగ్‌లోని కీలక వ్యక్తి, కార్ల కేసులో నిందితుడైన పొనుగంటి రామకృష్ణ అలియాస్ ఆర్కే చిలకలూరిపేటలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం లొంగిపోయాడు. కోర్టు రిమాండ్ విధించడంతో అతడ్ని నరసరావుపేట సబ్ జైలుకు తరలించారు. నరసరావుపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో నమోదైన కేసులో నకరికల్లుకు చెందిన రామకృష్ణ 4వ నిందితుడిగా ఉన్న ఇతడ్ని కస్టడీకి అనుమతి ఇవ్వాలని నరసరావుపేట కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు రూరల్ సీఐ సుబ్బారావు తెలిపారు. మదమంచి వెంకట్‌నాయుడు రిమాండ్‌లో ఉన్నారు. ఆయా కేసుల్లో ఐదుగుర్ని అరెస్టు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



జిల్లా	దుర్వినియోగం రూ కోట్లలో..	రికవరీ
• పల్నాడు	2.11	జీరో
• బాపట్ల	4.31	జీరో
• గుంటూరు	0.97	1,631

ఉపాధిలో.. రికవరీ

కేసులు లేవు.. వసూళ్లు లేవు

ఉపాధి పథకం.. కూలీలకు కాకుండా అక్రమార్కులకు వరంగా మారింది. గ్రామాల్లో సామాజిక ఆస్తులు పెంచాల్సిన పథకం కొందరు అధికారులు, భోక్తల జేబులు నింపుతోంది. డ్వామా ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తుండగా అక్రమార్కుల పంచన కొందరు అధికారులు చేరిపోయారు. రూ.కోట్లలో అక్రమాలను గుర్తించినా రికవరీ చేయడం.. అక్రమార్కులపై చర్యలు.. పోలీసు కేసుల నమోదుపై అధికారులు మీనమేషాలు వేస్తున్నారు. ఉపాధి అక్రమాలపై సోషల్ ఆడిట్ పేరుతో అధికారులు కాలక్షేపం చేయడానికే పరిమితమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.7.41 కోట్లు అక్రమాలు జరిగినట్లు సోషల్ ఆడిట్‌లో గుర్తించిన అధికారులు ఇప్పటి వరకు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో రూ.1,631 మాత్రమే రికవరీ చేశారు. ఉపాధి సొమ్మును దోచుకున్న వారిపై నామమాత్రంగా కూడా చర్యలు లేకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రాజకీయ అండదండలతో అక్రమార్కులు తప్పించుకు తిరుగుతున్నారు.

- రూ.7.41 కోట్లకు రికవరీ రూ.1,631
- సోషల్ ఆడిట్‌లతో అధికారుల కాలక్షేపం
- పోలీసు కేసుల నమోదుపై మీనమేషాలు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవక మిషన్ గ్రామీణ్(వీబీజీరామ్‌జీ) పథకంగా పేరు మారిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు వరంగా మారింది. కూలీల కష్టాన్ని దోచుకున్నది కొందరైతే, దొంగ మస్టర్లతో పక్కదారి పట్టించింది మరి కొందరు. ఇలా రూ.కోట్లల్లో నిధులు పక్కదారి పట్టిస్తున్నారు. ఉపాధి పనుల్లో అక్రమార్కులు అందినకాడికి దోచుకున్నారు. ఉపాధి అక్రమాల్లో కొందరు క్షేత్రస్థాయి సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు కంప్యూటర్ ఆపరేటర్లు, ఏపీవోలు భాగస్వాములు అయ్యారన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు మామూళ్లు దండుకుని కాజేసిన నిధులను అక్రమార్కుల నుంచి రికవరీ చేయడం (మిగతా 8వ పేజీలో)

అక్రమాలు ఇలా..

- పనికి హాజరు కాని కూలీలతో కుమ్మక్కై మస్టర్లు వేసి వారి ఖాతాల్లో నగదు పడిన తర్వాత ఆ మొత్తాల ను అక్రమార్కులు పంచుకుంటున్నారు.
- చేయని పనికి చేసినట్లుగా పాత పనినే కొత్తగా చేసి నట్లు చూపించి సొమ్ము కాజేస్తున్నారు.
- నకిలీ జాబ్ కార్డులు, బ్యాంకు ఖాతాలు సృష్టించి ఉపాధి సొమ్ము జేబులో వేసుకుంటున్నారు.

గుంటూరు జిల్లాలో 585 అక్రమాలు

గుంటూరు జిల్లాలో సోషల్ ఆడిట్‌లో 585 అక్రమాలను గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ.97,60,703 నిధులు దుర్వినియోగమైనట్లు అధికారులు గుర్తించారు. కాకుమాను మండలంలో రూ.33,24,324, పెదనందిపాడులో రూ.24,25,361, ప్రత్తిపాడులో రూ.21,66,726, తుళ్లూరులో రూ.10,41,587 నిధులు స్వాహా చేశారు. అయితే తుళ్లూరు మండలంలో 1,631 రికవరీ చేసినట్లు అధికారులు వారి నివేదికల్లో పేర్కొన్నారు.



అప్పారావుకు.. మిర్చి కుర్చీ



కుర్రా అప్పారావు

- ఏడాదిన్నర తర్వాత గుంటూరు యార్డుకు మోక్షం
- త్వరలో యార్డు వైస్ చైర్మన్, డైరక్టర్ల నియామకం

కుర్రాను వరించిన చైర్మన్ పదవి

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే పేరొందిన గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవిని టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు దక్కించుకున్నారు. అప్పారావు స్వ గ్రామం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామం. ఆయన ఈ పదవిలో ఏడాది కాలం కొన సాగనున్నారు. కాగా త్వరలో యార్డు వైస్ చైర్మన్, డైరక్టర్ల పదవులను భర్తీ చేయనున్నారు. వాస్తవానికి అప్పారావు ఈ పదవిని ఆశించలేదు. అయినా పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన చేసిన సేవలను అధిష్ఠానం గుర్తించి మిర్చి కుర్చీపై కూర్చో పెట్టేందుకు నిర్ణయించింది. వైసీపీ హయాంలో నియమితులైన నిమ్మకాయల రాజనారాయణను కూటమి అధికారంలోకి రాగానే తొలగించింది. అప్పటి నుంచి ఏడాదిన్నర కాలంగా ఈ పదవి ఖాళీగానే ఉంది. ఈ పదవికి అభ్యర్థిని సూచించడంలో జిల్లా ప్రజాప్రతినిధుల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇప్పటి వరకు మిర్చి యార్డు పదవి విషయం ముడిపడలేదు. గాడ్ ఫాదర్ల ద్వారా పదవి పొందేందుకు పలువురు ప్రయత్నాలు చేశారు.



కుర్రా అప్పారావుకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్ దంపతులు

అయితే ప్రతిపక్షంలో ఉండగా అప్పారావు పార్టీకి అండగా నిలిచిన విషయాన్ని అధిష్ఠానం గుర్తుపెట్టుకుని ఆయనకు అవకాశం కల్పించింది. గతంలో మాకినేని పెదరత్తయ్య, మాజీ మంత్రి పుల్లారావు, గత ఎన్నికల్లో భాష్యం ప్రవీణ్ విజయంలో అప్పారావు కుటుంబం కీలకంగా వ్యవహరించింది.

ఆశించింది ఒకటి.. వరించింది మరొకటి

కుర్రా అప్పారావు తండ్రి రత్తయ్య గతంలో జీడీసీసీ బ్యాంక్ డైరక్టర్‌గా, వైస్ చైర్మన్‌గా వ్యవహరించారు. బ్యాంకు చైర్మన్‌గా చేయాలని అప్పట్లో ఆయన ఎన్నో ప్రయత్నాలు చేశారు. అయితే ఆయన ఆశ నెరవేరలేదు. ఈ పరిస్థితుల్లో తండ్రికి దక్కని చైర్మన్ పదవిని తాను దక్కించుకోవాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రయత్నాలు చేశారు. అప్పారావుకు డీసీసీబీ చైర్మన్ పదవి ఇవ్వాలని సిఫార్సు చేస్తూ జిల్లాకు చెందిన అనేక మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు లేఖలు కూడా ఇచ్చారు. చైర్మన్ పదవి అప్పారావుకే ఖాయమనుకునే దశలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును అధిష్ఠానం నియమించింది. దీంతో అప్పారావు నిరాశ చెందారు. అయితే అధిష్ఠానం ఆయనకు కీలకమైన గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ పదవిని కట్టబెట్టింది.

సారస్.. మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనం 8
- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

మూడో తెలుగు మహాసభలకు విస్తృత ఏర్పాట్లు 6
- 3, 4, 5 తేదీల్లో శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో..

ఆకట్టుకున్న ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన 8

అయోధ్య తరహాలో..
- ఇంటింటికి శ్రీనివాసుని కల్యాణం అక్షింతలు

బీమా ఏదీ?



కష్టజీవులకు కరువైన బీమా

- అసంఘటిత రంగంలో అభద్రత
- టీడీపీ ప్రభుత్వంలో చంద్రన్న భరోసా
- పేరు మార్చి నీరుగార్చిన వైసీపీ పాలకులు
- పథకం కొనసాగింపుపై కూటమి మీనమేషాలు

పొన్నూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రెక్కలు తప్ప మరే ఆస్తి లేని అసంఘటితరంగ కార్మిక కుటుంబాల భద్రత ప్రమాదంలో పడింది. పనికి వెళ్తేనే జీవనం సాగించే కష్టజీవులకు ఏదైనా జరిగితే ఆ కుటుంబ జీవనం కడు దయనీయంగా మారుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం 2016లో 'చంద్రన్న బీమా' పేరుతో లక్షలాది మంది అసంఘటితరంగ కార్మికులకు బీమా సదుపాయాన్ని కల్పించిన పథకం ప్రస్తుతం ఉనికి లోనే లేకుండా పోయింది. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ఈ పథకాన్ని నీరుగార్చి ఎందరో అసంఘటితరంగ కార్మి కుల జీవన భద్రతను ప్రమాదంలో పడేసింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బీమా పథకాన్ని పట్టాలెక్కిస్తుందని కష్టజీవులు ఆశించారు. అయితే వారి ఆశలను నీరు గారుస్తూ ఒకటిన్నర సంవత్సరం దాటినా చంద్రబాబు ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడంలేదు. గతంలో స్వయంగా తన పేరుతోనే పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కష్టజీవుల కుటుంబాల



జీవన, సామాజిక భద్రత ప్రమాదంలోనే ఉంది. రోజువారి కూలీలు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తుల వారు, చిరు వ్యాపారులు, హమాలీలు, నిర్మాణ కార్మికులు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 14.5 లక్షల మందికిపైగా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రన్న బీమా పథకం ద్వారా వీరందరికీ బీమా భరోసా లభించగా కొన్ని వేల కుటుంబాలకు బీమా లభించింది. ఎన్నికల సమయంలో చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని, పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతామని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా పథకానికి సంబంధించిన ప్రస్తావన లేదు. దీంతో కార్మికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

చంద్రన్న బీమా ఇలా..

అసంఘటిత రంగ కార్మిక కుటుంబాల భద్రత కోసం 2016 అక్టోబరు 2న అప్పటి టీడీపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని ప్రారంభించింది. 18 నుంచి 70 ఏళ్ల లోపు వయసున్న కార్మికులకు రూ.15తోనే బీమా వర్తించేలా పథకాన్ని రూపొందించింది. ప్రమాదానికి గురై మరణించిన, పూర్తి వైకల్యం పాలైన కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యం పాలైతే రూ.3 లక్షలు బీమాగా అందజేసేవారు. 18 నుంచి 50 ఏళ్లలోపువారు సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, 51 నుంచి 60 ఏళ్లలోపు వాళ్లు సహజంగా మరణిస్తే రూ.30 వేలు పరిహారంగా చెల్లించేవారు. 18 నుంచి 70 ఏళ్లలోపు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.5 లక్షల పరిహారం లభించేది.

పేరు మార్పుతో సరి..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రన్న బీమా పథకాన్ని 'వైఎస్సార్ బీమా' పథకంగా మార్చింది. పేరు మార్చడంతోపాటు ప్రయోజనాన్ని పూర్తిగా తగ్గించింది. కుటుంబ సభ్యులందరికీ వర్తించే ఈ పథకాన్ని కేవలం కుటుంబ పెద్దకే పరిమితం చేసింది. ప్రమాదం కారణంగా మరణం లేదా పూర్తి వైకల్యం పొందితే ఇచ్చే రూ.5 లక్షల పరిహారం వయసును 18 నుంచి 50 ఏళ్లకు తగ్గించింది. పైగా క్లెయిమ్‌లను భారీగా పెండింగ్ పెట్టింది.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ అన్సారియా

ఈసీఐ నెట్‌లో 46.96 శాతం మ్యాపింగ్

వచ్చే నెల పదికల్లా పూర్తి చేసేందుకు చర్యలు

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం నెట్‌వర్క్ యాప్‌లో 46.96 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తాడికొండ నియోజవర్గంలో 56.42 శాతం, మంగళగిరిలో 38.20, పొన్నూరులో 49.42, తెనాలిలో 40.68, ప్రత్తిపాడులో 49.38, గుంటూరు వెస్ట్‌లో 49.44, గుంటూరు ఈస్ట్‌లో 48.51 శాతం జరిగిందన్నారు. 17,98,368 మంది ఓటర్లలో 8,44,489 మంది ఓటర్లను మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. వచ్చే నెల పదో తేదీకల్లా ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. బీఎల్‌వోలకు కలర్ ఓటర్ జాబితాలను పంపిణీ చేయడం జరిగిందని, గుర్తింపు కార్డులను కూడా అందజేశామన్నారు. ఇంటి నంబర్లు లేని ఇళ్లకు నోషనల్ డోర్ నెంబర్లను సంబంధిత మున్సిపాలిటీ, పంచాయతీల సౌజన్యంతో ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ

రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో కలిసి శుక్రవారం ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. భద్రత కట్టుదిట్టంగా నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఓటర్ నమోదు అధికారులు ఎం గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, చల్లా ఓబులేసు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చిరతనగండ్ల వాసు, బిళ్లా సునీల్, కంచెర్ల శివరామయ్య, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, చట్టాల త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగు పరుచుకోవాలి

- బ్యాంకర్లకు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సూచన
- గుంటూరు పరిధిలోని బ్యాంకుల్లో 149 కోట్ల అన్‌క్లెయిమ్డ్ నగదు

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో కీలకమైన బ్యాంకర్లు పనితీరు ను మెరుగు పరుచుకోవాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన డీసీసీ, డీఎల్ఆర్ఎస్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రుణాల మంజూరులో ప్రభుత్వరంగ బ్యాంకుల పనితీరు అద్భుతంగా ఉందని ప్రశంసించారు. కాగా ప్రైవేటు బ్యాంకులు ఈ విషయంలో వెనకబడ్డాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌలు రైతులకు ప్రైవేటు బ్యాంకులు కూడా విరివిగా రుణాలు మంజూరు చేయాలన్నారు. రానున్న మూడు నెలల్లో రుణాల మంజూరుని మెరుగుపరుచుకోకపోతే సంబంధిత బ్యాంకుల్లో ఉన్న ప్రభుత్వ అకౌంట్లు, డిపాజిట్లను బదిలీ చేస్తామని హెచ్చరించారు. స్వానిధికి దరఖాస్తుల ను బ్యాంకులకు సమర్పించేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్‌కు సంబంధించి వెండార్స్‌కు ఇబ్బంది లేకుండా బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులలో గుంటూరు ప్రాంతంలో దాదాపు రూ.149 కోట్ల అన్‌క్లెయిమ్డ్ నగదు ఉందని, ఇందులో రూ.120 కోట్లు ప్రజలకు సంబంధించినదన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారిని గుర్తించి పంపిణీ చేయాలన్నారు. విద్యారుణాలు రూ.198 కోట్ల లక్ష్యంగా ఉంటే కేవలం రూ.49 కోట్లు మాత్రమే ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముద్ర రుణాలు 684 యూనిట్లకు మంజూరు చేసి రాష్ట్రంలోనే నంబర్ 1 స్థానంలో ఉందన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జీఎంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ సామాన్యులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ జవహర్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని,ఎమ్మెల్యే మాధవి, మేయర్ రవీంద్ర

46 ప్రశ్నలు, 53 ప్రీయాంబుల్స్

నేడు జీఎంసీ కౌన్సిల్ సమావేశం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం కౌన్సిల్ సమావేశం జరగనున్నది. మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు సమావేశాన్ని ప్రారంభించనున్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ల నుంచి వచ్చిన 46 ప్రశ్నలు, 53 జీఎంసీ ప్రీయాంబుల్స్‌తో కలిపి మొత్తం 99 అంశాలతో అజెండాను సిద్ధం చేశారు. గత సమావేశంలో చర్చించిన సమస్యల పరిష్కారంపై కార్పొరేటర్లు అధికారులను ప్రశ్నించనున్నారు. ఆటోనగర్‌లో తాగునీరు, నగర పరిధిలో డ్రెయిన్ల అభివృద్ధి, పారిశుధ్యం అంశాలతోపాటు ప్రజా సమస్యలను కూడా ప్రస్తావించనున్నారు.

వ్యర్థాలపై సర్వే

- నిర్వహణపై నివేదిక కోరిన ఎన్‌జీటీ
- కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోన్న జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) మున్సిపల్ పట్టణాల్లో వ్యర్థాల నిర్వాహణపై ఆందోళన వ్యక్తం చేసింది. పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నుంచి వ్యర్థాల సేకరణ సక్రమంగా జరగడంలేదని, మురుగునీటి నిర్వహణా లోపాలతో నీరు కలుషితమవుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. వ్యర్థాల నిర్వహణకు తీసుకుంటున్న చర్యలపై ఎన్‌జీటీ నివేదిక కోరిన నేపథ్యంలో ప్రభుత్వం సర్వేకు ఆదేశించింది. వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణ వంటి అంశాలపై ఇంటింటి సర్వే నిర్వహించి ఖచ్చితత్వంతో కూడిన నివేదిక అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ సర్వేపై పర్యవేక్షణకు జిల్లాల వారీగా కలెక్టర్ చైర్మన్‌గా మున్సిపల్ కమిషనర్ కన్వీనర్‌గా, పబ్లిక్‌హెల్త్, ఏపీపీసీబీ ఈఈలు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారిని సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు ఎన్‌జీటీ నిర్దేశించిన అంశాలపై పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణపై సర్వే నిర్వహించనున్నాయి. ఈ సర్వే ప్రారంభించేందుకు మున్సిపాల్టీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇంటింటి వ్యర్థాల సేకరణ, తడిపొడి చెత్త విభజన, వాటి రవాణా తదితరాలను ఈ కమిటీలు పరిశీలించి మున్సిపాలిటీల వారీగా ఎన్‌జీటీకి నివేదికలను ఇవ్వనున్నాయి. అయితే అనేక మున్సిపాల్టీల్లో వ్యర్థాల సేకరణ, నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. మురుగునీటి శుద్ధి నామమాత్రంగా కూడా జరగడంలేదు. దీంతో నీటి కాలుష్యం పెద్దఎత్తున జరుగుతోంది. కంపోస్టు యార్డుల్లో వ్యర్థాల తొలగింపు సక్రమంగా జరగడంలేదు. ఈ క్రమంలో కమిటీలో మున్సిపల్ కమిషనర్‌ను నియమించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేదని భావిస్తున్న నేపథ్యంలో సర్వే కమిటీలో కమిషనర్ ఉంటే వాస్తవాలు వెలుగు చూడవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సర్వే నిర్దిష్టంగా నిర్వహిస్తేనే వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణపై వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచిస్తున్న విధంగా వ్యర్థాల నిర్వహణ జరిగితే పట్టణాలు ఎంతో పరిశుభ్రంగా మారతాయి.

అత్యాధునిక నేత్ర వైద్య సేవలు

● ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల నెట్‌వర్క్ డైరెక్టర్


యంత్రాన్ని ప్రారంభిస్తున్న వైద్యశాల నిపుణులు

క్రోసూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటుకూరు ఎల్వీ ప్రసాద నేత్ర వైద్యశాలలో ఆత్యాధునిక యంత్రాలతో ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నెట్‌వర్క్ డైరెక్టర్ వై.నిరంజన్ కుమార్, ఏపీ అడ్మిన్ ఇన్‌చార్జ్ వాసుబాబు తెలిపారు. శుక్రవారం ఆస్పత్రిలో ఆధునిక సాంకేతిక కలిగిన నేత్ర వైద్య పరికరాన్ని వారు ప్రారంభించారు. గ్రామానికి చెందిన కల్లూరి ఉంతా సత్యనారాయణరెడ్డి రూ.10 లక్షలు ఖరీదు చేసే ఈ యంత్రాన్ని ఆస్పత్రికి బహూకరించినట్టు చెప్పారు. ఊటుకూరు నేత్ర వైద్యశాలను పూసరిస్క్ విజన్ సెంటర్‌గా మారుస్తున్నట్టు చెప్పారు. తమ గ్రామంలో అత్యాధునిక టెక్నాలజీ నేత్ర వైద్యశాల ఏర్పాటు చేసిన ఎల్వీ ప్రసాద సంస్థ వారిని తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి వేగుంట రాణి అభినందించారు. ధూళిపాళ్ళ కంటి వైద్యశాల అడ్మిన్ దివ్య భారతి, కో-ఆర్డినేటర్ మల్లేష్, ఊటుకూరు గ్రామానికి చెందిన హరినాథరెడ్డి పాల్గొన్నారు.

టైగర్‌కి అంత్యక్రియలు


జాగిలానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీసు భద్రతా రంగంలో 2017 నుంచి విశేష సేవలందించిన పోలీసు స్నిపర్ జాగిలం టైగర్ (8 సంవత్సరాల 11నెలలు) అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. టైగర్ మృతిపట్ల ఎస్పీ బి.ఉమామహేశ్వర్ సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక వెదుళ్ళపల్లి గ్రామంలో ఉన్న డాగ్ కెన్నెల్ భవనంలో ఉంచిన టైగర్‌కు.. ఎస్పీ పూల మాలలు వేసి గౌరవవందనం సమర్పించి, నివాళులర్పించారు. అనంతరం పోలీసు లాంఛనాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ టైగర్ స్నిపర్ జాతికి చెందిన మగ జాగిలం మంగళగిరి ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో శిక్షణ పొందిందని తెలిపారు. వీవీఐపీ, వీఐపీ బందోబస్తుల్లో పేలుడు పదార్థాలు, పరికరాలను గుర్తించడం, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో వీవీఐపీలకు గౌరవ వందనం సమర్పణ, వారికి బొకేలు అందించడంలో టైగర్ విశేష గుర్తింపు పొందిందన్నారు. టైగర్ సేవలకు రూ.25వేలు నగదును బహుమతి అందించినట్లు తెలిపారు. ఏఆర్ డీఎస్పీ పి.విజయసారధి, అడ్మిన్ ఆర్ఐ షేక్.మౌలుద్దీన్, డాగ్ హ్యాండ్లర్లు పాల్గొన్నారు.

మూడో తెలుగు మహాసభలకు విస్తృత ఏర్పాట్లు

● జనవరి 3, 4, 5 తేదీల్లో శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరంలో నిర్వహణ
● ప్రధాన వేదికకు ఎన్‌టీఆర్ పేరు
● 40 దేశాలకు చెందిన 62 తెలుగు సంఘాలకు ఆహ్వానం
● 22 సాహితి సదస్సుల నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పన


భారీ రెయిన్ ప్రూఫ్ షెడ్డు పనుల్లో కార్మికులు


యుద్ధప్రాతిపదికన జరుగుతున్న అప్రోచ్ రోడ్డు నిర్మాణం

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం మూడో ప్రపంచ తెలుగు మహాసభలు - 2026 గుంటూరు జిల్లాలో జరగనున్నాయి. జనవరి 3, 4, 5 తేదీల్లో ఎన్‌హెచ్-16 పక్కనే ఉన్న శ్రీ సత్యసాయి ఆధ్యాత్మిక నగరం ఇందుకు ఆతిథ్యమివ్వనుంది. ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ప్రజా గాయకుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ కొన్ని నెలలుగా మహాసభలను విజయవంతం చేసేందుకు శ్రమిస్తున్నారు. 40 దేశాలకు చెందిన 62 తెలుగు సంఘాలకు ఇప్పటికే ఆహ్వానాలు పంపగా తాము తప్పక పాల్గొంటామని ఆయా అసోసియేషన్‌లు సమాచారం పంపాయి. మూడు రోజుల పాటు మొత్తం 22 సాహితి సదస్సులు జరుగుతాయి. బుర్రకథ, హరికథ, తోలు బొమ్మలాట, కత్తి సాము వంటి ప్రాచీన కళారూపాల ప్రదర్శనలు కూడా నిర్వహిస్తారు. 4వ తేదీన ఉత్తరాఖండ్ నుంచి వచ్చే ఆదిశంకర పీఠాధిపతుల ప్రవచనం ఉంటుంది. నాలుగు రాష్ట్రాల గవర్నర్లు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ప్రధాన వేదికకు ఎన్‌టీఆర్ పేరుని పెట్టారు. మూడు రోజుల్లో లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఏపీ విభజన తర్వాత 2022లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు భీమవరంలో జరిగాయి. రెండో సభలు 2024లో రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఈ సభలను నిర్వహిస్తోంది. ప్రధాన వేదికతో పాటు శ్రీనాథ కవి వేదిక(సదస్సులు), శ్రీ జాషువా కరుణశ్రీ వేదిక(కవి సమ్మేళనం), శ్రీ కొప్పరపు కవుల వేదిక(అవధానుల ప్రదర్శనలు), శ్రీ తూము నరసింహా దాసు వేదిక(ఆధ్యాత్మిక కార్యక్రమాలు), డాక్టర్ ఘంటసాల, డాక్టర్ ఎస్పీ బాలు వేదిక (పాడనా తెలుగు పాట), శ్రీ రామోజీరావు ప్రదర్శనల ప్రాంగణం (పుస్తక, హస్తకళలు, ప్రాచీన తెలుగు వైభవ ప్రదర్శనలు) ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్‌ని విడుదల చేశారు.

● నందమూరి తారక రామారావు వేదికపై సాంస్కృతిక, సభా కార్యక్రమాలు, పూర్ణ కుంభ పురస్కారాల ప్రదానోత్సవం, ప్రతిభ పురస్కారాలు, సౌజన్య సేవా పురస్కారాల ప్రదానోత్సవం, గ్రంథావిష్కరణ, ఆంధ్రమేవ జయతే ప్రత్యేక సంచిక ఆవిష్కరణ, ముఖ్య అతిథులు, ప్రముఖుల సందేశాలు జరుగుతాయి.

● శ్రీనాథ కవి వేదికపై నిత్యం ఉదయం 8.30 నుంచి 10.30, మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు పద్య సాహిత్య, అవధాన, వచన కవిత, బాల, పత్రిక, జానపద, విజ్ఞాన, భక్తి, చలన చిత్ర సాహిత్య, సామాజిక మాధ్యమ తెలుగు వికాస, రాష్ట్రేతర తెలుగు సంఘాలు, ప్రవాస భారతీయులు, శిలా శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, తెలుగు భాష - ప్రాచీన హోదా, ప్రభుత్వాలు - తెలుగు వికాస బాధ్యత, ఆధునిక సాంకేతికత - తెలుగు భాషా ప్రచార, హాస్య వ్యంగ్య సాహిత సదస్సులు జరుగుతాయి.

● ఆధ్యాత్మిక వేదికపై నిత్యం ఉదయం 8.30 గంటల నుంచి 10.45 గంటల వరకు స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, గణపతి హోమాలు జరుగుతాయి. పాడనా తెలుగు పాట వేదికపై అపూర్వ చలన చిత్ర సాహితీ వైభవ గీతాలాపన, 300 మంది గాయని, గాయకులతో గీతాలాపన(కరోకే) జరుగుతాయి, యువ అవధానులతో అవధానాల ప్రదర్శన నిర్వహిస్తారు.

● వచన, పద్య కవిత్వాలు, నవీన కవిత రీతులు, తెలుగు గజల్స్ నిర్వహణకు శ్రీ జాషువా, కరుణశ్రీ వేదికలను వినియోగిస్తారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ రూపొందించిన తెలుగు తోరణం, క్షేత్ర దర్శని ప్రత్యేక నృత్య రూపక ప్రదర్శనలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. మహాసభలు సజావుగా నిర్వహించేందుకు కమిటీ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ కడిమిళ్ల వరప్రసాద్ సహస్రావధాని, మేడికొండ శ్రీనివాస చౌదరి, కార్యదర్శిగా చక్రావధానుల రెడ్డప్ప ధవేజి, గౌరవ సైలహాదారులగా బాబుశ్రీ, డాక్టర్ బులుసు అపర్ణ, ముఖ్య సమన్వకర్తగా పీ రామచంద్రరాజు, సహ సమన్వయకకర్తగా వీ విద్యాసాగర్, సలహాదారుడిగా డాక్టర్ వడ్లమాని రవి, ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సభా ప్రాంగణానికి సులవుగా చేరుకొనేందుకు గుంటూరు నగరపాలక సంస్థ మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది.. ఇప్పటికే ఎన్‌హెచ్-16 నుంచి ఒక లింకు రోడ్డుని అభివృద్ధి చేసింది. కార్లు, టూవీలర్స్ పార్కింగ్, సభలకు హాజరయ్యే ప్రజలకు భోజన ఏర్పాట్లు వంటివి పూర్తి నిర్వాహకులు పూర్తి చేయిస్తున్నారు.

రూ.53 లక్షల విలువైన 265 సెల్‌ఫోన్ల రికవరీ

● బాధితులకు అందించిన ఎస్పీ వకుల్ జిందాల్



బాధితుడికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): పోగొట్టుకున్న, దొంగిలించబడిన సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అందించారు. రూ.53 లక్షల ఖరీదైన 265 సెల్‌ఫోన్‌లను ఐటీ కోర్ పోలీసులు రికవరీ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ బాధితులకు వాటిని అందించారు. ఇప్పటి వరకు సుమారు రూ.7.53 కోట్ల విలువైన 3, 679 మొబైల్ ఫోన్లను విజయవంతంగా రికవరీ చేసి బాధితులకు అందించినట్లు ఎస్పీ తెలిపారు. ప్రజలు మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగిలించబడినా వెంటనే పోలీస్ హెల్ప్ లైన్ నంబర్ 86888 31574కు లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్, జిల్లా సైబర్ సెల్, లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సెల్‌ఫోన్ల రికవరీలో విశేషంగా కృషి చేసిన ఐటీ కోర్ సీఐ నిషార్ భాష, కానిస్టేబుళ్లు శ్రీధర్, మానస, ఇమామ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

తెనాలిలో వ్యభిచార గృహం సీజ్


వ్యభిచారం గృహం సీజ్ చేసిన అధికారులు

తెనాలి క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నివాస గృహాల మధ్య కొనసాగుతున్న వ్యభిచార గృహాన్ని అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. వన్ టౌన్ సీఐ మల్లికార్జునరావు వెల్లడించిన వివరాల మేరకు.. టెలిఫోన్ ఎక్సేంజ్ వెనుక వీధిలో సాలిపేటలో నివాస గృహాల మధ్య వ్యభిచార గృహంపై అక్టోబరు 28న పోలీసులు దాడి చేశారు. ఒక మైనర్, మరో ఇద్దరు మహిళలు, విటుడు, 600 కండోమ్ ప్యాకెట్స్ లభించాయి. విచారణలో స్థానికులు ఈ వ్యభిచారం గృహం కొన్నేళ్లుగా కొనసాగుతుందని .. వీధిలో నడవటానికే అవమానంగా ఉందంటూ ఫిర్యాదు చేశారు. విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. స్థానికుల ఇబ్బందులను సబ్ కలెక్టర్ సంజనా సింహ దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె ఆదేశాలతో డీఎస్పీ జనార్ధనరావు, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో కలిసి ఆ గృహాన్ని తనిఖీ చేశారు. ఇల్లు గదులు గదులుగా ఉండటం.. ఇనుప మంచాలు, దిండ్లు, చాపలు గుట్టల గుట్టలుగా ఉండటాన్ని గుర్తించారు. దీనితో ఆ ఇంటిని ఐటీపీ యాక్టు 18 ప్రకారం ఏడాది పాటు సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. గృహాన్ని నిర్వహిస్తున్న చావలి హైమావతి, ప్రధాన సూత్రదారుడు తాతపూడి గోపిని ఇప్పటికే రిమాండ్‌కి తరలించడం జరిగిందన్నారు.

సాంస్కృతిక రాజధాని లక్ష్యం ఆవకాయ

● ఘనంగా ఆవకాయ సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవం
● జనవరి 8 నుంచి 10 వరకు విజయవాడలో నిర్వహణ
● ప్రవేశ రుసుం ఉచితం: కలెక్టర్ అన్సారియా

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటిచెప్పేలా ప్రభుత్వం విజయవాడ వేదికగా జనవరి 8 నుంచి 10 వరకు ఆవకాయ సినిమా సంస్కృతి, సాహిత్యోత్సవం పేరిట వినూత్న సాంస్కృతిక కార్యక్రమం 'ఆవకాయ' ఏర్పాటు చేసిందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పర్యాటక శాఖ, టీమ్ వర్క్ ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు విజయవాడలోని కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్, భవాని ఐ లాండ్‌లలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. రాష్ట్రంలోని సుసంపన్నమైన కథా సంప్రదాయాలు, సినిమా, సాహిత్యం, ప్రదర్శన కళలను ఘనంగా చాటాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దార్శనికతలో భాగంగా ఈ ఉత్సవం రూపుదిద్దుకుందన్నారు. కేవలం ఇండోర్ హాల్స్‌కే పరిమితం కాకుండా, బహిరంగ ప్రదేశాల్లో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడం దీని ప్రత్యేకతన్నారు. తెలుగు కథలు, సినిమాలకు జాతీయ స్థాయిలో పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకుని అమరావతి - విజయవాడ ప్రాంతాన్ని ఒక సమకాలీన సాంస్కృతిక రాజధానిగా మార్చడమే ఈ పండుగ లక్ష్యం. ఈ ఉత్సవం ఆంధ్రప్రదేశ్ వైవిధ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పడమే కాకుండా, స్థానిక కళాకారులకు, కళాభిమానులకు ఒక గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. సినిమా, సాహిత్యం, సంగీతం, నాటకరంగం, సాంస్కృతిక చర్చలను ఒకే బహిరంగ వేదికపైకి తెచ్చి ఆంధ్రప్రదేశ్‌ను సాంస్కృతిక మార్పిడికి, కళాత్మక భాగస్వామ్యానికి ఒక శక్తివంతమైన గమ్యస్థానంగా మార్చడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ప్రవేశం ఉచితమన్నారు. ఈ కార్యక్రమంపై శుక్రవారం ముఖ్యమంత్రి కార్యాలయం, పర్యాటక శాఖ ఉన్నత అధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

వైకుంఠపురంలో ముక్కోటి ఏర్పాట్లపై సమీక్ష


సమీక్షలో సబ్‌కలెక్టర్ సంజన, డీఎస్పీ జనార్ధనరావు, ఈఓ

తెనాలి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ముక్కోటి పర్వదినం సందర్భంగా వైకుంఠపురం శ్రీ పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లను పగడ్బందీ చేయాలని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ అధికారులకు సూచించారు. దీనికి అన్ని శాఖల అధికారుల సహకారం తీసుకుని విజయవంతం చయాలన్నారు. ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో.. తీసుకోవలసిన జాగ్రత్తలపై ఆలయంలో శుక్రవారం ఆమె అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆలయ ఈఓ అనుపమ, తహసీల్దారు గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్ధన రావు ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలసి చర్చించారు. ఆలయ ప్రాంగణం మొత్తం పరిశీలించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉన్న నేపథ్యంలో భక్తులు గతంలో కంటే ఎక్కువ వస్తారనే అంచనాతో ఏర్పాట్లు ఉండాలని సూచించారు. సబ్‌కలెక్టర్ సూచనల మేరకు తహసీల్దార్ గోపాలకృష్ణ శాఖల వారీగా ఎవరెవరు ఏ ఏర్పాట్లు చేయాలో! ఎటువంటి జాగ్రత్తలు అవసరమనే విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఆలయంలో ప్రస్తుతం ఉన్న సీసీ కెమేరాలు కాకుండా అదనంగా సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మున్సిపాలిటీ నుంచి అదనంగా 50 మంది సిబ్బంది అవసరమని, 3 ట్రాక్టర్లు కూడా కావాలని ఈఓ అనుపమ కోరటంతో వాటిని ఏర్పాటు చేస్తామని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో.. ఆలయ సిబ్బంది నిర్మల, అంబటి రాయుడు, ప్రధాన అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం

విజయపురిసౌత్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శుక్రవారం 565.70 అడుగులు ఉంది. ఇది 245.82 టీఎంసీలకు సమానం. మొత్తం ఔట్‌ఫ్లో 51,860 క్యూసెక్కులు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో 51,860 క్యూసెక్కులుగా ఉంది.

జాతీయ స్థాయి షూటింగ్‌లో ముఖేష్‌కు రజతం



విజేతలతో ముఖేష్

గుంటూరు(క్రీడలు) డిసెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్న 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో శుక్రవారం గుంటూరుకు చెందిన నేలపల్లి ముఖేష్ రజత పతకం సాధించాడు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ జూనియర్ విభాగంలో ముఖేష్‌కు రజత పతకం లభించింది. మధ్యప్రదేశ్ కు చెందిన సూరజ్ శర్మ బంగారు పతకం గెలువగా హరియాణాకు చెందిన జతిన్ కాంస్య పతకం సాధించాడు. ఈ ఛాంపియన్ షిప్‌లో సీనియర్ జూనియర్ విభాగాల్లో పోటీపడిన ముఖేష్ రిలేలో 600 కు గాను 579 పాయింట్లు సాధించి సీనియర్లో నాలుగో స్థానం జూనియర్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. పతకాల కోసం రిలేలో తొలి ఆరు స్థానాల్లో నిలిచిన షూటర్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో సీనియర్ విభాగంలో ఐదవ స్థానంలో నిలిచాడు. జూనియర్ విభాగంలో రజత పతకం గెలిచాడు. ఫిబ్రవరిలో న్యూఢిల్లీలో జరగనున్న ఏషియన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ జూనియర్ విభాగంలో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత, టీం, మిక్స్, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్, స్టాండర్డ్ పిస్టల్, రాపిడ్ ఫైర్ పిస్టల్‌లు మూడింటిలో వ్యక్తిగత, టీం విభాగాల్లో మొత్తం 9 పతకాలకు జరిగే పోరులో ముఖేష్ భారత దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ముఖేష్‌ను ఆంధ్రప్రదేశ్ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు లలిత్, కార్యదర్శి రాజ్‌కుమార్, కేఎల్ వర్సిటీ స్పోర్ట్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ కాకర్ల హరి కిషోర్, పీడీ శ్రీహరి, పూజిత తదితరులు అభినందించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరిట రూ.5 లక్షలు వసూలు

తాడికొండ, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని నకిలీ ఆఫర్ లెటర్‌ను చూపించి రూ. 5లక్షలు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తులపై తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన వీలేటి నాగ చైతన్యకు హైదరాబాద్‌లోని ఎంఎస్ సోల్యూషన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని నకిలీ ఆఫర్ లెటర్ ఇచ్చారు. ఉద్యోగం ఇప్పించినందుకు మైలబత్తుల బాబుమహేష్, బలరామ్, నందా అనే ముగ్గురు రూ. 5 లక్షల వసూలు చేసినట్లు తెలిపారు. ఆఫర్ లేటర్ తీసుకొని సాఫ్ట్‌వేర్ కంపెనీకి వెళ్లిన నాగ చైతన్య అది నకిలీదని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. మోసపోయానని తెలుసుకున్న చైతన్య తన డబ్బులు తిరిగి ఇవ్వమని ఎన్నిసార్లు అడిగిన ఫలితం లేకపోవడంతో.. డబ్బులు అడిగితే ఇవ్వకుండా కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ జీత్యానాయక్ తెలిపారు.

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	33,577	
అమ్మకాలు	39,577	
నిల్వ	8,285	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	17000
నెంబరు. 5	12000	15300
273	---	----
341	11000	17000
4884	----	----
సూపర్ 10	12000	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16500
షార్క్-1	-----	----
బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	11000	17500
ఆర్మూరు	10000	12700
ఏసీ కామన్ వెరైటీ		
334	10500	16700
నెంబరు. 5	11000	15000
273	----	----
341	11000	16500
4884	12000	14000
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15000
బ్యాడిగి 355	10000	16500
దేవనూరు డీలక్స్	---	----
తాలుకాయలు	5000	7700

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	147, 156, 167
చికెన్ విత్ స్కిన్(కిలో)	284.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	294.00



స్థాయి సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, హాజరైన కమిషనర్, సభ్యులు

రూ.20.95 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం

● మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో సుమారు రూ.20.95 కోట్లతో పలు డివిజన్లలో అభివృద్ధి పనులను నిర్వహించేందుకు స్థాయి సంఘం ఆమోదం తెలిపిందని మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మేయర్ ఛాంబర్‌లో శుక్రవారం కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి నగర పాలక సంస్థ స్థాయి సంఘ సమావేశం నిర్వహించి పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు.

నగరంలోని ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజా ప్రతినిధులు, నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదించిన 60 అంశాలకు సంబంధించిన అభివృద్ధి పనులను స్థాయి సంఘ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. మేయర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీలు ఉన్న షాపులకు నిబంధనల ప్రకారం బహిరంగ వేలం నిర్వహించేందుకు అనుమతించటం జరిగిందన్నారు. సమావేశంలో స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, దాసరి లక్ష్మి దుర్గ, ముప్పవరపు భారతి, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, సెక్రటరీ బి.శ్రీనివాసరావు, డీసీలు సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కాలువలలో వ్యర్థాలు వేస్తే భారీ జరిమానా : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంలో డ్రెయిన్లలో వ్యర్థాలు వేసి, మురుగు పారుదలకు ఆటంకం కలిగించే వారిని గుర్తించి, వారికి భారీ అపరాధ రుసుం విధించడం, కమర్షియల్ సంస్థల అయితే సీజ్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. జేకేసీ కాలేజి రోడ్డు, డొంక రోడ్, ఏటుకూరు రోడ్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి డీఫైసీలో అందిన ఫిర్యాదులను, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆర్టీవో కార్యాలయం దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, వసతులు, ఆహార నాణ్యతపై ప్రజలను అడిగి తెలుసుకొని, అధికారులకు, అక్షయ పాత్ర సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎస్ఎస్ సాంబయ్య, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేట, సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రం ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి, జీవించే హక్కులో భాగమైన ఉపాధి హక్కును కాలరాస్తుందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ జాతిపిత పేరును ఉపాధి హామీ చట్టానికి తొలగించటం దారుణం అన్నారు. కాంగ్రెస్ నాయకుడు కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ కొత్త చట్టం రద్దు చేసి, పాత చట్టాన్ని పునరుద్దరించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాశం రామారావు, పి.కోటేశ్వరరావు, యు.నాగేశ్వరరావు, వి.నరసింహారావు, ఈమని అప్పారావు పాల్గొన్నారు.

దేశంలో శక్తిహీనమైన వ్యవస్థ.. ఆర్ఎస్ఎస్

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో ఏ ఒక్క రోజు కూడా పాల్గొనని చరిత్ర ఆర్ఎస్ఎస్‌దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. జాతీయ పతాకాన్ని ఆమోదించి ఎగురవేయలేని శక్తిహీనులని, మీరు దేశ భక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. గుంటూరు, అశోక్‌నగర్‌లో శుక్రవారం జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన సీపీఐ శత వసంతాల ముగింపు బహిరంగ సభలో ముఖ్య అతిథిగా ఈశ్వరయ్య హాజరై ప్రసంగించారు. మోదీ అధికారంలోకి వచ్చిన ఈ 12 సంవత్సరాల కాలంలో దేశం ఏ రంగంలో ప్రగతి సాధించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్క భారీ పరిశ్రమను తెచ్చారా... ఒక్క భారీ ప్రాజెక్టునైనా నిర్మించారా అంటూ ప్రశ్నించారు. జనవరి 18న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్, బందెల నాసర్, మేడా హనుమంతరావు, వెలుగూరి రాధాకృష్ణమూర్తి, గని, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.

అంజుమన్, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు తరలిరావాలి

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంజుమన్, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ముస్లిం మైనార్టీలు ఐక్యంగా ముందుకు రావాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ పిలుపునిచ్చారు. నగరంలోని బస్టాండ్ రోడ్డులో ఉన్న లాల్ తలాబ్ మసీదు వద్ద అంజుమన్, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ముస్లిం మైనార్టీలతో కలిసి సమావేశం నిర్వహించారు. వైసీపీ నాయకులు లియాఖత్ ఆలీ, పఠాన్ సైదాఖాన్, సలీం, సుభాని, ఎస్ఎంఎస్ సలాం ఉన్నారు.

దేశాభివృద్ధిలో మన్మోహన్‌సింగ్ పాత్ర అనిర్వచనీయం

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పాత్ర ఎనలేనిదని జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బిళ్ళా సునీల్ తెలిపారు. రాజీవ్‌గాంధీభవన్‌లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కాపు సాధికారిక వింగ్ చైర్మన్ రెమిడిశెట్టి హనుమంత్‌రావు, బొట్ల బ్రహ్మం, మున్ని, జాఫర్, వరుణ్, పాకనాటి రవి, రామిశెట్టి సాయి, మణికంఠ తదితరులున్నారు.

● రంగా వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి ఆధ్వర్యంలో పాతగుంటూరు, కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ సెంటర్‌లో రంగా విగ్రహాలకు పూలమాలలతో ఘన నివాళులర్పించారు. మస్తాన్‌వలి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన నేత రంగా అని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులున్నారు.

నేడు దివ్యాంగుల స్పెషల్ గ్రీవెన్స్

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో శనివారం విభిన్న ప్రతిభా వంతుల స్పెషల్ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ దుర్గాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం సాయంత్రం 3 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్ల, అన్నపూర్ణ నగర్‌లో పద్మావతీ, అండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దశావతార కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బలరామ అవతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా జరిపారు. ఈ కార్యక్రమాల్ని ఆలయ కమిటీ చైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు ఎర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అరండల్‌పేట 1 నుంచి 7వ లైను వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ముస్తఫా తెలిపారు.

ఓటర్ జాబితాల పరిశీలన ప్రారంభం

● బూత్‌ల వారీగా బీఎల్‌వోలకు కలర్ ఫొటోలతో లిస్టులు అందజేత

● ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎస్ఐఆర్ చేపట్టే అవకాశం



గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఓటర్ల జాబితాతో ఇంటింటికి వెళ్లి ప్రొజెన్ మార్కింగ్ చేస్తున్న బీఎల్‌వో

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 2001లో ఓటర్లుగా ఉన్న వారి ప్రోజెన్ (సంతానం/దిగువతరం)లను జాబితాల్లో మార్కింగ్ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల కలర్ ఫొటోలతో కూడిన జాబితాలను ముద్రించి హార్డ్ కాపీలను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పోలింగ్ బూత్‌ల వారీగా బీఎల్‌వోలకు అందజేస్తున్నారు. తద్వారా ఏదైనా కుటుంబంలో ఒకరి పేరుని బీఎల్‌వో యాప్‌లో నమోదు చేస్తే ఆ ఫ్యామిలీలో ఎంతమంది అయితే ఓటర్లు ఉన్నారో వారి వివరాలన్నీ ప్రత్యక్షమౌతాయి. తద్వారా వేరే ప్రాంతాలకు వలస వెళ్లి ఇక్కడ కూడా ఓటర్లుగా ఉన్న వారి పేర్లను తొలగించడం సులభతరం అవుతుందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.

కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది స్పెషల్ సమ్మరి రివిజన్ - 2026ని చేపట్టిన విషయం తెలిసిందే. ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో దశలవారీగా స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ని చేపడుతోన్నది. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన గ్రౌండ్‌వర్కుని పూర్తి చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా 2001, 2025 ఓటర్ జాబితాలను బీఎల్‌వోలకు అందజేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. 2001లో ఓటర్లుగా ఉన్న వాళ్లు ఇప్పుడు జీవించి ఉన్నారా, లేదా అనేది బీఎల్‌వోలు ఈ జాబితాల ఆధారంగా పరిశీలిస్తారు. 18 ఏళ్లు దాటి ఓటుహక్కు ఇంకా పొందకపోయి ఉంటే దరఖాస్తు చేయిస్తారు. ఎవరైనా వివాహం చేసుకొని వెళ్లిపోతే వాళ్ల పేర్లను తొలగిస్తారు. తద్వారా ఒక కుటుంబంలో ఒకరి పేరుని యాప్‌లో నమోదు చేయగానే వారి సంతానం/దిగువతరాల ఓటర్ల వివరాలన్నీ ప్రత్యక్షమౌతాయి. ఈ ప్రోజెన్ యాక్టివిటీని వచ్చే నెల 15వ తేదీ లోపు పూర్తి చేయాల్సిందిగా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు ఓటర్ జాబితాలను కలెక్టరేట్ నుంచి నియోజకవర్గాల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి బీఎల్‌వోలకు అందజేస్తోన్నారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ఎస్ఐఆర్ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు. ఇది కూడా ఒక విధంగా తప్పులు లేని ఓటర్ జాబితాల రూపకల్పన ప్రక్రియగా వివరించారు.

వంగవీటి మోహన రంగా సేవలు చిరస్మరణీయం



వంగవీటి రంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు



రంగా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు

గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయమని తూర్పు ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా నెహ్రూనగర్, శనక్కాయల ఫ్యాక్టరీ రోడ్డులోని విగ్రహాల వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తూర్పు కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో రంగా చిత్రపటం వద్ద ఆయన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో తనకుంటూ ప్రత్యేక గుర్తింపుతో ప్రజాదరణ పొందిన నేత వంగవీటి రంగా అని అన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, దాసరి రాజా మాస్టారు, శనక్కాయల ఉమాశంకర్, రాజకుమారి, ఎర్రగోపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● వంగవీటి మోహనరంగా సేవలు చిరస్మరణీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చెప్పారు. వంగవీటి రంగా 37వ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఎత్తురోడ్డు సెంటర్, మూడు బొమ్మల సెంటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా కేవలం ఒక కులానికో, ఒక రాజకీయ పార్టీకో చెందిన నాయకుడు కాదని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా, పేదల పెన్నిధిగా, ఒక విప్లవాత్మక వ్యక్తిత్వంగా చరిత్రలో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, పరిశీలకులు కనకాచారి, పలువురు నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగాకు నివాళులర్పించారు.

● గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసిన ప్రజా నాయకుడు వంగవీటి మోహన రంగా అని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకొని నగరంపాలెం, గోరంట్ల, నెహ్రూనగర్, కొత్తపేట శనక్కాయల ఫ్యాక్టరీ, కొత్తపేట శివాలయం, వెంగళాయపాలెంలో శుక్రవారం నిర్వహించిన వర్ధంతి కార్యక్రమాల్లో ఆయన పాల్గొని రంగా విగ్రహాలకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు రంగా అండగా నిలిచారన్నారు. పేదల కోసం జీవించి వారితో మమేకమై బతికిన రంగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు.



రంగా విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, డేగల ప్రభాకర్ తదితరులు

పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికి చర్యలు : ఎస్పీ



పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రాధాన్యత క్రమంలో పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. 'ప్రతి శుక్రవారం' జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది వినతులు, సమస్యల పరిష్కారానికి నిర్వహించే "పోలీస్ సిబ్బంది గ్రీవెన్స్" కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ సిబ్బంది నుంచి నేరుగా వినతులను స్వీకరించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. ఆయా ఘటనల్లో శాఖా పరమైన చర్యలు తీసుకున్న సిబ్బందిని తగిన విచారణ అనంతరం విధుల్లోకి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

కేవీపీ కాలనీలో కార్డెన్ సెర్చ్

● 40 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు సీజ్

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కేవీపీ కాలనీలో శుక్రవారం వెస్ట్ డీఎస్పీ అరవింద్ నేతృత్వంలో కార్డెన్ సెర్చ్ జరిగింది. వేకువ జామునే పెద్ద సంఖ్యలో పోలీసులు కాలనీని నలువైపుల నుంచి చుట్టుముట్టారు. 500 గృహాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు సీజ్ చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ పాల్గొని రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్ కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. నగరంపాలెం సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అయోధ్య తరహాలో..

● ఇంటింటికి శ్రీనివాసుని కల్యాణం అక్షింతలు
● గురజాల నియోజకవర్గం మొత్తం పంపిణీ
● ప్రతి కుటుంబానికి స్వామి ఆశీస్సులు ఉండాలనే సంకల్పం
● ఎమ్మెల్యే యరపతినేని ఆధ్వర్యంలో లక్ష ప్యాకెట్లు సిద్ధం



కల్యాణంలోని అక్షింతలను కలుపుతున్న మహిళలు



అక్షింతల ప్యాకెట్లు

పిడుగురాళ్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి దాకా అయోధ్య రాముడి రామాలయానికి ఉడతా సాయంగా ఇంటికొక ఇటుకను అందించారు. రాముడి గుడి నిర్మించేందుకు దేశ వ్యాప్తంగా ఎందరో అందించిన సాయానికి గుర్తుగా రాములవారి అక్షింతలు అందించారు. భద్రాద్రి రాముడి కల్యాణంలోనూ అక్షింతలకు ఎంతో ప్రాధాన్యత, విశిష్టత ఉంటుంది. అక్షింతల కోసం ఎందరో భక్తులు వేనోళ్ల స్వామివారిని కొనియాడి అందితే చాలు మహాభాగ్యం అన్నట్టుగా.. పిడుగురాళ్లలోనూ గత వారం శ్రీనివాసుని కల్యాణం అంగరంగ వైభవంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు. కల్యాణానికి హాజరైన ప్రతి ఒక్కరికి స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందించడం సాధ్యం అయ్యే అవకాశం ఉన్నప్పటికీ శ్రీవారి అక్షింతలు ప్రతి ఇంటికి అందించాలనే సంకల్పించారు. అయోధ్య అక్షింతలు తరహాలో నియోజకవర్గం మొత్తం పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందు కోసం శ్రీనివాసుని కల్యాణంలో ఉపయోగించిన అక్షింతలను లక్ష ప్యాకెట్లుగా తయారు చేస్తున్నారు. అయోధ్య రామమందిరం కార్యక్రమానికి ముందుగా ఇంటింటికి అక్షింతలు పంపిన తరహాలో ఇదే విధానాన్ని గురజాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అమలు చేస్తున్నారు.

ప్యాకెట్‌లో ఏమేమి ఉంటాయి..

శ్రీనివాసుని కల్యాణం అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి లడ్డూ, వెంకటేశ్వరస్వామి క్యాలెండర్‌తో పాటు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అందించే గ్రీటింగ్స్‌ను కలిపి ఒక ప్యాకెట్‌గా తయారుచేస్తున్నారు.

ఇంతటి సేవ దొరికేనా : కొత్త పుష్పలత

గురజాల నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి శ్రీనివాసుని కల్యాణం అక్షింతలు, పసుపు, కుంకుమ, శ్రీవారి ప్రసాదంతో క్యాలెండర్‌ను ప్యాకెట్‌గా తయారుచేసి అందించే మహాభాగ్యం, ఇంతటి సేవ దొరకడం ఆ శ్రీనివాసుని ఆశీస్సులే. గతంలో తిరుమల, షిర్డి, శ్రీశైలం, పుట్టపర్తి దేవాలయాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొన్న తృప్తికన్నా శ్రీనివాసుని అక్షింతలు కలుపటం ఎంతో తృప్తినిస్తుంది.

మా నాన్నే నాకు స్ఫూర్తి

● ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు



డాక్టర్ సీహెచ్ లక్ష్మణ చక్రవర్తికి లక్ష్మీనారాయణ పురస్కారం ప్రదానం చేస్తున్న ద్వారకా తిరుమలరావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బాధ్యతలలో... వ్యక్తిగత జీవితంలోనూ తనకు స్ఫూర్తి తన నాన్నేనని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ అన్నమయ్య కళా వేదికపై ప్రొఫెసర్ అండ్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ డాక్టర్ ఎంసీ దాసు అధ్యక్షతన సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక పురస్కార సభ శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ క్రమశిక్షణ, విలువలతో తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిత్వం సీహెచ్ లక్ష్మీనారాయణ సొంతమన్నారు. మద్య నిషేధం సమయంలో లక్ష్మీనారాయణ నిర్వహించిన విధులు నేటికీ పోలీసు శాఖకు కొలమానంగా నిలబడిందని గుర్తుచేసుకున్నారు. ఆయన కడుపున పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. దశాబ్దాల నుంచి ఆయన పేరు మీద సాహితి సేవ చేస్తున్న తన సోదరి సీహెచ్ సుశీలమ్మ కృషి గొప్పదని కొనియాడారు. పురస్కార గ్రహీత డాక్టర్ లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ లక్ష్మీనారాయణ పురస్కారం అందుకోవడంతో తనపై బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. అనంతరం సీహెచ్ లక్ష్మణ చక్రవర్తికి ద్వారకా తిరుమలరావు, సోదరి సుశీలమ్మ చేతుల మీదగా సీహెచ్ లక్ష్మీనారాయణ పురస్కారాన్ని అందజేశారు. ఈ సభలో.. ముఖ్య అతిథి.. మద్రాస్ విశ్వ విద్యాలయ తెలుగు శాఖ అధ్యక్షుడు వి.శంకరరావు, విశ్రాంత ఎక్సైజ్ అధికారి అహ్మద్ షరీఫ్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతలు పెనుగొండ లక్ష్మీనారాయణ, పాపినేని శివశంకర్, డాక్టర్ ఓరుగంటి వెంకట రమణ, భూసురపల్లి వెంకటేశ్వర్లు, మాధవరావు, డాక్టర్ వీవీ రామ్‌కుమార్, పంచుమర్తి సుశీల, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు.

విజ్ఞాన్ వర్సిటీలో రెండు అత్యాధునిక పరిశోధనా కేంద్రాలు



ల్యాబ్ ను ప్రారంభిస్తున్న చాన్సలర్ పావులూరు సుబ్బారావు

గుంటూరు (విద్య) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శాస్త్రీయ పరిశోధనలకు మరింత ఊతమిచ్చే విధంగా రెండు అత్యాధునిక పరిశోధనా కేంద్రాలను ప్రారంభించామని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. నానో సైన్స్, ఎనర్జీ మెటీరియల్స్, సెన్సార్ టెక్నాలజీ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించే లక్ష్యంతో రామన్ సెన్సర్ సెంటర్, డాక్టర్ లావు రత్తయ్య సెంటర్ ఫర్ ఎనర్జీ మెటీరియల్స్ (డాక్టర్ లారా సీఈఎం) కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రామన్ సెన్సర్ సెంటర్ (స్మార్ట్ ఇంజినీరింగ్ ఇన్ నానో సైన్స్ ఫర్ ఎమర్జింగ్ రీసెర్చ్) ద్వారా నానో సైన్స్‌ను సాంకేతిక అనువర్తనాలుగా మార్చే దిశగా విస్తృత పరిశోధనలు సాగనున్నాయని చెప్పారు. ఈ కేంద్రంలో ఆధునిక సెన్సార్ టెక్నాలజీలు, నానో డివైసెస్, స్మార్ట్ ఇంజినీరింగ్ అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, చాన్సలర్ డాక్టర్ పావులూరు సుబ్బారావు, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఉపాధిలో రికవరీ

(5వ పేజీ తరువాయి)

లేదన్న విమర్శలున్నాయి. సామాజిక తనిఖీల్లో వెలుగుచూస్తున్న ఉదంతాలే నిదర్శనం. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.7.41 కోట్లు కొట్టేసినట్టు సోషల్ ఆడిట్‌లలో నిగ్గు తేల్చారు. అయితే సదరు వ్యక్తులపై నిధుల రికవరీతో పాటు పోలీసు కేసులు నమోదు చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు లేవు. ఉపాధి నిధులు కొట్టేసిన వారికి కొందరు అధికారులు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఉపాధి అక్రమాలు, రికవరీలు, కేసులపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై కూడా చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు ఏ కారణంగానో వెనకడుగు వేస్తున్నారు. అక్రమార్కులకు రాజకీయ అండదండలు ఉంటడంతో వారిపై చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. సామాజిక తనిఖీల్లో దొరికినా ఎంతో కొంత చెల్లించి అధికారులు తప్పించు కుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

సారస్.. మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనం

● కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



సారస్ ప్రదర్శన నిర్వహణపై సమీక్షిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సారస్.. మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంగా 3వ తేదీ నుంచి నిర్వహించడం జరుగుతుందని కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సారస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ) ప్రదర్శన శాల పై కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. హ్యాండ్లూమ్స్, హ్యాండి క్రాఫ్ట్, చీరలు, షాల్స్, కార్పెట్లు, బెడ్ షీట్‌లు, వెదురు, లోహ, గాజు ఉత్పత్తులు, సాంప్రదాయ, ఆర్గానిక్ ఆహార పదార్థాలు, ఆభరణాలు, గృహ అలంకరణ వస్తువులు, ఆహార పదార్థాలు వంటి ఉత్పత్తులు ప్రదర్శన, విక్రయం జరుగుతుందన్నారు. ఈ మినీ భారత సమ్మేళనానికి పెద్ద ఎత్తున ప్రచారం జరగాలన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రదర్శనలను తిలకించడమే కాకుండా వివిధ రాష్ట్రాల సంస్కృతి, సాంప్రదాయాలు, హస్త కళలు, చేనేతలు, ఆహార పదార్థాల రుచులను తెలుసుకోవాలని కోరారు. సారస్‌కు మంచి బ్రాండింగ్ జరగాలని, పర్యావరణ హిత కార్యక్రమంగా నిలవాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ ఉపయోగించని వేడుకగా నిర్వహించుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో వస్తారనే అంచనా ఉన్నందున అగ్ని ప్రమాదాలు జరగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బ్రాండ్ అంబాసిడర్లను ఆహ్వానించాలి

సారస్ - మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంగా జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందుటకు క్రీడలతో పాటు వివిధ రంగాల్లో పేరు మోసిన వ్యక్తులు బ్రాండ్ అంబాసిడర్లుగా సందర్శించే విధంగా ఆహ్వానించాలని మంత్రి సూచించారు. భారత దేశ విభిన్న కళలు ఉట్టిపడే విధంగా కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వివిధ విశ్వవిద్యా లయాల విద్యార్థులు కొత్త ఆలోచనలకు అవ కాశం కల్పించే ప్రదర్శనలు ఇచ్చే పరిస్థితి ఉం దని చెప్పారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసే ఆహార శాలలలో (ఫుడ్ కోర్టు) ఆహార నాణ్యతలో రాజీ పడరాదని సూచించారు. నవ రుచుల సమ్మేళనం కావాలని, గ్రామీణ వంటకాలు, చిరుధాన్యాల రుచులు అందించాలని అన్నారు.

మినీ భారతదేశం కనిపిస్తోంది

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యూ ఢిల్లీ నుంచి పాల్గొన్న గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ సారస్‌లో మినీ భారత దేశం కనిపిస్తుందన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా ఉండే విధంగా చూడాలని కోరారు. స్వయం సహాయక సంఘాల ఉత్తమ ఉత్పత్తులను ప్రోత్సహించడం సారస్ ముఖ్య ఉద్దేశం అన్నారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సమావేశంలో నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషా, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎస్పీ వకుల్ జిందాల్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి అమరేంద్ర ప్రతాప్ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, సెర్ప్ అదనపు సీఈవో ఆర్ శ్రీరాములు నాయుడు, సెర్ప్ డైరెక్టర్ పద్మావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

● రెండో రోజు పోటీలను ప్రారంభించిన గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల, ఎమ్మెల్యే ప్రత్తిపాటి



ఎడ్ల బల ప్రదర్శన ప్రారంభిస్తున్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



ఆరుపళ్ల ఎడ్ల బల ప్రదర్శన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో నిర్వహిస్తున్న అఖిల భారత ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శనను.. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. మరో ముఖ్య అతిథి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆరుపళ్ల ఎడ్ల జతలను ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఎడ్ల బల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ముఖ్య అతిథిగా హాజరై గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, కాపు సంఘం అధ్యక్షుడు పోతుల శంకర్, రాయల శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. మొదటి రోజు పోటీలలో అచ్చంపేట మండలం వేల్పూరుకు చెందిన చావల గోపికృష్ణ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఎడ్లు ద్వితీయ, వీరుపాడు మండలం నందలూరుకు చెందిన సంద్ర వెంకటేశ్వర్లు ఎడ్లు మూడవ బహుమతి సాధించాయి. రెండవ రోజు రెండు పళ్ల విభాగంలో చుండూరు మండలం దొండపాడుకు చెందిన అత్తోటి శిరీషచౌదరి ఎడ్లు ప్రథమ స్థానం, నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ ద్వితీయ, రొంపచర్ల మండలం పరగడచర్ల కామినేని విక్రమ్ తృతీయ బహుమతులు సాధించారని నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కొల్లి బ్రహ్మయ్య, కడియాల రమేష్‌బాబు, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, పులిమి వెంకటరామిరెడ్డి, వాసిరెడ్డి రవీంద్ర, కడియాల తాండవ కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లెళ్ళమూడిలో..

జాతీయస్థాయి యోగా పోటీలు



యోగా పోటీలకు సిద్ధమైన జిల్లెళ్ళమూడిలోని ప్రాంగణం

బాపట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి యోగా ఛాంపియన్‌షిప్ -2025-2026కు బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన శ్రీ విశ్వజననీ పరిషత్ ప్రాంగణం ముస్తాబు చేస్తున్నారు. ఇండియన్ యోగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ 27, 28, 29 తేదీల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. శనివారం ప్రారంభ కార్యక్రమంలో రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని.. స్టేట్ యోగా అసోసియేషన్ చైర్మన్ కళ్ళం హరినాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్ తెలిపారు. 26 రాష్ట్రాల నుంచి 16 విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన.. రాష్ట్రస్థాయి ఛాంపియన్‌లు 650 నుంచి 700 మంది ఈ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాలో ఛాంపియన్‌షిప్ నిర్వహించే అవకాశం లభించింది. ఈపోటీలను వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ యోగా అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ పోటీలకు ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ వ్యవహరించనున్నారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఘన స్వాగతం



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు



విద్యార్థులతో మాట్లాడుతున్న గవర్నర్

పెదనందిపాడు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామంలోని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు గృహానికి శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. లావు నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి గవర్నర్ దంపతులకు ఘన స్వాగతం పలికారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గవర్నర్‌కు కలెక్టర్ ఎస్ తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ భానోదయ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో గవర్నర్ ముచ్చట్లు

పెదనందిపాడులో సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు గృహానికి విచ్చేసి.. తిరుగుపయనమైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జాతీయ జెండాలతో అశోకా పాఠశాల విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఇది గమనించిన గవర్నర్ కాన్వాయ్‌ను ఆపి దిగి విద్యార్థుల వద్దకు వచ్చి కొంచెం సేపు ముచ్చటించారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే దేశభక్తి కలిగి ఉండాలని చదువులో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పోపూరి లక్ష్మీనారాయణ, డైరెక్టర్ పోపూరి నాగేశ్వరమ్మలను గవర్నర్ అభినందించారు.

హోరాహోరీగా ఎంపీఎల్ క్రికెట్ పోటీలు



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న పోతినేని శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి బైపాస్ రోడ్డులోని నారా లోకేశ్ క్రీడా ప్రాంగణం (బోగి ఎస్టేట్స్)లో ఎంపీఎల్ సీజన్-4 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆరో రోజు మొదటి మ్యాచ్‌లో పెదపాలెం కింగ్స్‌పై తోటాద్రి గ్లాడియేటర్స్ విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో ఓల్డ్ 786 జట్టుపై కురగల్లుకు చెందిన మిస్టర్ కేకే ఫ్రెండ్స్ సర్కిల్, మూడో మ్యాచ్‌లో బెంజి టీంపై డార్క్ నైట్స్, నాలుగో మ్యాచ్‌లో ఎన్‌పీ టీంపై బ్లూ ఈగల్స్, ఐదో మ్యాచ్‌లో డెక్కన్ చార్జర్స్‌పై ఉండవల్లి రైడర్స్ జట్లు గెలుపొందాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారులకు మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో ట్రోఫీ, రూ.3 వేల నగదు బహుమతి అందజేశారు.



ఘనంగా వెంకటేశ్వర బాల కుటీర్ వజ్రోత్సవాలు

● భారీ సంఖ్యలో హాజరైన పూర్వ విద్యార్థులు

గుంటూరు(విద్య),డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని చేతన ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ వజ్రోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది హాజరై తమ అనుభవాలు, అనుభూతులను పంచుకుంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇటువంటి వేడుకలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో సంఘీభావం, సమైక్యత మరింత బలపడుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించడంలో బాల కుటీర్ ఎప్పుడూ ముందంజలో ఉందని తెలిపారు. ఇలాంటి విద్య వల్ల పిల్లలు ఉన్నతమైన భావాలు, మంచి ఆశయాలతో ఎదుగుతారని పేర్కొన్నారు. తాను కూడా ఈ సంస్థ పూర్వ విద్యార్థిని కావడం, మళ్లీ బాల కుటీర్‌కి వచ్చి అందరినీ కలవడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. బాలకుటీర్ వ్యవస్థాపకులు డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ.. సామాజిక దృక్పథంతో పాటు విలువలతో కూడిన విద్యను అందిస్తూ, వారిలో మానసిక వికాసాన్ని కలిగించటానికి లలిత కళలను కూడా భాగం చేస్తూ బాల కుటీర్ ముందుకి సాగుతోందన్నారు. సంస్థ సంయుక్త కార్యదర్శి జయశ్రీ, సంస్థల సిఇవో దుర్గా రఘురాం, చేతన నిర్వహకులు మరుద్వతి తదితరులు పాల్గొన్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన కేటాయించండి

ఆలయాల జోలికి వెళ్లవద్దు అరిష్టం



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

తుళ్లూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రోడ్డు కింద ఇళ్లు పోతుంటే ఇవ్వడానికి తాము సిద్ధమేనని... మందడం రైతులు తెలిపారు. కానీ, సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన తమకు స్థలాలు కేటాయించాలని కోరారు. శుక్రవారం మందడం ల్యాండు పూలింగ్ యూనిట్ కార్యాలయంలో ఎన్-8 రోడ్డు కింద ఇల్లు, స్థలాలు కోల్పోతున్న వారితో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పురపాలక శాఖ మంత్రి నారాయణ సమావేశం నిర్వహించారు. వారం క్రితం ఇదే అంశం మీద సమావేశం నిర్వహించారు. రోడ్డు కింద పోతున్న ఇళ్లతో పాటు శివాలయం, వేణుగోపాల స్వామి. వినాయకుడు, ఆంజనేయ స్వామి ఆలయాలున్నాయి. వాటిని కదలించవద్దని.. తొలగిస్తే అరిష్టమని రైతులు సమావేశంలో చెప్పారు. ఇంటి స్థలాలు సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన కేటాయించాలన్నారు. మంచి ప్రదేశం చూసి కేటాయిస్తామని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ సమావేశంతో సమస్య పరిష్కారం అయినట్టు కాదని పలు దఫాలుగా రోడ్డు బాధిత రైతులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి నారాయణ మాటాడుతూ, రైతులకు మంచి ప్రదేశంలో ఇంటి స్థలాలు కేటాయించి మెరుగైన ప్యాకేజీ అందిస్తామని చెప్పారు. కొన్ని ప్రదేశాలను పరిశీలించామని రైతుల కోరిక మేరకు కేటాయింపులుంటాయని మంత్రి చెప్పారు. గ్రామం మధ్య నుంచి వెళుతున్న ఎన్ -8 రోడ్డు అవసరం అంతగా లేదనుకుంటే ఆగిపోవాలని సమావేశంలో కొంత మంది రైతులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ, డిప్యూటీ కలెక్టర్ శేషరెడ్డి, యూనిట్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వంటిల్లు

నూతన సంవత్సరం మొదటి రోజున కొత్తగా ఏదైనా చేయాలని పిల్లలు, కుటుంబ సభ్యులు అడుగుతూ ఉంటారు. అలాంటప్పుడు తక్కువ సమయంలో సులువుగా తయారుచేసేవాటిని ప్రయత్నిస్తే బాగుంటుంది. అలా అందరికీ నచ్చేలా హెల్దీగా కమ్మగా ఉండే సరికొత్త రుచులు మీకోసం...

న్యూ ఇయర్ వేళ... సరికొత్త స్నాక్స్



కార్న్ ఫ్రిట్టర్స్



కావాల్సిన పదార్థాలు

మొక్కజొన్న కంకులు- రెండు, చిలగడ దుంపలు- రెండు, ఉల్లికాడల తరుగు- అర కప్పు, కొత్తిమీర తరుగు- పావు కప్పు, పచ్చిమిర్చి- రెండు, అవిశె గింజల పొడి- ఒకటిన్నర చెంచాలు, బ్రెడ్ పౌడర్- అర కప్పు, ఛీజ్ తురుం- ఒక కప్పు, ఉప్పు- తగినంత, నూనె- నాలుగు చెంచాలు

తయారీ విధానం

- మొక్కజొన్న కంకుల నుంచి గింజలు తీసి గిన్నెలో వేసి ఉడికించాలి. ఆపైన మిక్సీలో వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. చిలగడ దుంపలను కూడా ఉడికించి తొక్క తీసి తురిమి పెట్టుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో కార్న్ పేస్టు, చిలగడ దుంపల తురుం, ఉల్లికాడల తరుగు, కొత్తిమీర తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, అవిశె గింజల పొడి, బ్రెడ్ పౌడర్, ఛీజ్ తురుం, ఉప్పు వేసి బాగా కలపాలి. చేతికి కొద్దిగా నూనె రాసుకుని కార్న్ మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ అరచేతిలో గుండ్రని బిళ్లల్లా చేయాలి.
- స్టవ్ మీద పాన్ పెట్టి నూనె వేసి వేడిచేయాలి. ఆపైన కార్న్ బిళ్లలు పరిచి రెండు వైపులా దోరగా వేయించాలి. తరువాత వీటిని పళ్లెంలోకి తీయాలి. ఈ కార్న్ ఫ్రిట్టర్స్‌ని గ్రీక్ యోగర్ట్ లేదా గ్రీన్ చట్నీతో సర్వ్ చేసుకోవచ్చు.

చికెన్ 555



కావాల్సిన పదార్థాలు

పలుచగా పొడవుగా కోసిన బోన్‌లెస్ చికెన్ స్ట్రిప్స్- అర కిలో, కోడిగుడ్లు- రెండు, మిరియాల పొడి- ఒక చెంచా, పెరుగు- ఆరు చెంచాలు, అల్లం వెల్లుల్లి పేస్టు- ఒక చెంచా, కార్న్‌ఫ్లోర్- ఏడు చెంచాలు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, నెయ్యి- రెండు చెంచాలు, వెల్లుల్లి తరుగు- రెండు చెంచాలు, పచ్చి మిర్చి- ఎనిమిది, కరివేపాకు- రెండు రెమ్మలు, పసుపు- అర చెంచా, కారం- అర చెంచా, రెడ్ చిల్లీ ఫ్లేక్స్- అర చెంచా, ధనియాల పొడి- అర చెంచా, ఉప్పు- తగినంత, సోయా సాస్- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పుదీనా తరుగు- కొద్దిగా

తయారీ విధానం

వెడల్పాటి గిన్నెలో బోన్‌లెస్ చికెన్ స్ట్రిప్స్, ఒక చెంచా ఉప్పు, మిరియాల పొడి, అల్లం వెల్లుల్లి పేస్టు, రెండు చెంచాల పెరుగు, కోడిగుడ్ల తెల్ల సొన, కార్న్‌ఫ్లోర్ వేసి బాగా కలపాలి. ఈ చికెన్ స్ట్రిప్స్ మిశ్రమాన్ని పావు గంటసేపు నాననివ్వాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. అందులో చికెన్ స్ట్రిప్స్‌ను ఒక్కోటి వేస్తూ చిన్న మంట మీద దోరగా వేయించాలి. అన్నివైపులా ఎర్రగా వేగిన చికెన్ స్ట్రిప్స్‌ను పళ్లెంలోకి తీయాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి నెయ్యి వేసి వేడి చేయాలి. ఆపైన వెల్లుల్లి తరుగు, పచ్చిమిర్చి చీలికలు, కరివేపాకు, పసుపు, కారం, ధనియాల పొడి, రెడ్ చిల్లీ ఫ్లేక్స్, ఉప్పు వేసి బాగా కలపాలి. తరువాత నాలుగు చెంచాల పెరుగు, సోయాసాస్ వేసి కలిపి మిశ్రమం దగ్గరకు వచ్చేదాకా ఉడికించాలి. ఆపైన వేయించి పెట్టుకున్న చికెన్ స్ట్రిప్స్ వేసి మెల్లగా కలపాలి. చివరగా కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి.

ఈ చికెన్ 555ను టమాటా సాస్ లేదా చిల్లీ సాస్‌తో వేడిగా సర్వ్ చేయాలి.

బ్లూ లగూన్

కావాల్సిన పదార్థాలు

పంచదార- అర కప్పు, మంచినీళ్లు- అర కప్పు, నిమ్మకాయలు- రెండు, ఐస్‌క్యూబ్స్- పన్నెండు, బ్లూ క్యురాకో సిరప్- ఒక బాటిల్, స్ప్రైట్ కూల్‌డ్రింక్- ఒక బాటిల్

తయారీ విధానం

స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి అందులో పంచదార, పావు చెంచా నిమ్మరసం వేసి మంచినీళ్లు పోసి కరిగించాలి. ఈ పంచదార నీళ్లను ఒక గిన్నెలోకి వడగట్టి దాన్ని ఫ్రిజ్‌లో ఉంచాలి. పొడవాటి గాజు గ్లాసును తీసుకుని అందులో నాలుగు ఐస్ క్యూబ్స్‌ను క్రష్ చేసి వేయాలి. తరువాత చల్లని పంచదార సిరప్ 25 ఎంఎల్, బ్లూ క్యురాకో సిరప్ 50 ఎంఎల్ వేసి రెండు చెంచాల నిమ్మరసం పిండాలి. ఆపైన గ్లాస్ నిండా స్ప్రైట్ కూల్‌డ్రింగ్ పోయాలి. ఇలా రెండు లేదా మూడు గ్లాసులు రెడీ చేసుకుని ఒక ట్రేలో పెట్టి సర్వ్ చేయాలి.

ఐస్‌క్రీమ్ సందేశ్



కావాల్సిన పదార్థాలు

పనీర్ తురుం- ఒక కప్పు, కాచిన పాలు- ఒక కప్పు, కుంకుమపువ్వు రేకులు- 15, పంచదార పొడి- ముప్పావు కప్పు, పాలపొడి- అర కప్పు, యాలకుల పొడి- అర చెంచా, పిస్తా పలుకులు- అర కప్పు

తయారీ విధానం

పాలలో కుంకుమ పువ్వు రేకులు వేసి కలిపి మూతపెట్టి ఉంచుకోవాలి. మిక్సీలో పనీర్ తురుం, పాలపొడి, పంచదార పొడి, కుంకుమపువ్వు వేసిన పాలు, యాలకుల పొడి వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమాన్ని గిన్నెలోకి తీసి దాన్ని ఫాయిల్ పేపర్‌తో మూయాలి.

స్టవ్ మీద వెడల్పాటి గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి మరగనివ్వాలి. అందులో ఒక స్టాండ్ పెట్టి దానిమీద పనీర్ మిశ్రమం ఉన్న గిన్నెను ఉంచాలి. పైన మూత పెట్టి 45 నిమిషాలపాటు ఆవిరి మీద ఉడికించాలి. తరువాత గిన్నెను స్టవ్ మీద నుంచి దించి చల్లార్చాలి. పనీర్ గిన్నె మీద ఉన్న ఫాయిల్ పేపర్‌ను తీసివేసి ఒక పళ్లాన్ని మూతలా పెట్టి గిన్నెను రివర్స్ చేయాలి. పళ్లెంలో ఐస్‌క్రీమ్ సందేశ్ రెడీ అవుతుంది. దీనిమీద పిస్తా పలుకులు చల్లి చిన్న ముక్కలుగా కోసి సర్వ్ చేయాలి.

భోజన కుతూహలం


ఊబకాయులకు ఔషధం
కొబ్బరి పాయసం

కొబ్బరి వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని మనకు తెలుసు. కానీ భావ ప్రకాశ, భోజన కుతూహలం వంటి గ్రంథాలు కొబ్బరి పాల వల్ల కలిగే అనేక ప్రయోజనాలను వివరించాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

- కొబ్బరి పాలతో చేసిన పాయసాన్ని 'అతిపుష్టిదాఖ' అని ఈ గ్రంథాల్లో పేర్కొన్నారు. అంటే కొబ్బరి పాయసం వల్ల శరీరానికి మంచి పోషణ లభిస్తుందని అర్థం. ముఖ్యంగా బడికి వెళ్లే పిల్లలకు ఇది మేలు చేస్తుంది. వారి అలసటను తీరుస్తుంది.
- కొబ్బరి పాల పాయసం వాత వ్యాధులున్నవారికి మంచి మందు. ఇది నిద్రలేమితో బాధపడేవారికి నిద్ర కలిగేలా చేస్తుంది.
- మహిళల్లో రక్తస్రావాన్ని అరికడుతుంది.
- కనీసం వారానికి ఒక సారి కొబ్బరి పాయసం తాగితే చర్మం మెరుస్తుంది.
- స్థూలకాయులు కొబ్బరి పాయాన్ని క్రమం తప్పకుండా తాగితే కొవ్వు కరిగి సన్నబడతారు. వారానికి రెండు సార్లు చొప్పున మూడు నెలల పాటు కొబ్బరి పాయసాన్ని సేవిస్తే మంచి ఫలితాలుంటాయి.
- కొందరికి నోటి నుంచి దుర్వాసన వస్తూ ఉంటుంది. అలాంటి వారికి ఇది ఒక మంచి ఔషధం.
- ఎసిడిటి, ఎక్కిళ్ల వంటి సమస్యలకు కూడా కొబ్బరి పాయసం ఒక మంచి పరిష్కారం.

పాయసం ఎలా చేయాలి?

- కొబ్బరిని సన్నగా తురమాలి.
- ఈ కొబ్బరి తురుమును ఆవు పాలలో వేసి ఉడికించాలి.
- పాలు చిక్కగా అవటం మొదలుపెట్టిన తర్వాత పంచదార, నెయ్యి వేయాలి.
- చివరలో కుంకుమపువ్వు, పచ్చ కర్పూరం, యాలకులు వేసుకుంటే మంచి సువాసన కలుగుతుంది.



• గంగరాజు అరుణాదేవి

గోల్డెన్ మిల్క్ తాగుదాం

శీతాకాలంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను నివారించడంలో గోల్డెన్ మిల్క్ అద్భుతంగా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు. రోజూ ఒక గ్లాసు గోల్డెన్ మిల్క్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలివే...

- స్టవ్‌మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు పాలు పోసి అర చెంచా పసుపు, చిటికెడు మిరియాల పొడి వేసి బాగా మరిగించాలి. తరువాత పాలను స్టవ్ మీద నుంచి దించి గ్లాసులో పోయాలి. అందులో ఒక చెంచా బెల్లం పొడి లేదా తేనె కలిపి ఉదయాన్నే అల్పాహారానికి ముందు లేదా రాత్రి పడుకునేముందు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. రోగనిరోధక శక్తి పెరిగి అంటువ్యాధులు దరిచేరవు.
- చలి వల్ల నిద్ర సరిగా పట్టనివారికి ఈ పాలు ఔషధంలా పనిచేస్తాయి. పాలలో ఉండే ట్రిప్టోఫాన్ అనే అమైనోయాసిడ్.. ఒళ్లు నొప్పులను తగ్గించి గాఢమైన నిద్ర వచ్చేలా చేస్తుంది. మిరియాల్లో ఉండే పైపెరిన్ అనే ఆల్కలాయిడ్ సమ్మేళనాలు.. జీర్ణక్రియను వేగవంతం చేస్తాయి.
- పాలలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, పసుపులోని యాంటీ ఆక్సిడెంట్లు కలిసి చర్మాన్ని తేమతో నింపుతాయి. దీంతో చర్మం మృదువుగా చక్కని ఛాయతో మెరుస్తుంది. ఎముకలు బలోపేతమవుతాయి.



- గోల్డెన్ మిల్క్ తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి రక్తప్రసరణ మెరుగుపడుతుంది. పసుపులో ఉండే కర్క్యుమిన్.. చలికాలంలో ఎదురయ్యే కీళ్లవాతాన్ని, కండరాల సమస్యలను నివారిస్తుంది. జలుబు, గొంతునొప్పి, జ్వరం లాంటి రుగ్మతల నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

అభిరుచి



వయసు 72... పతకాలు మెండు

మనసుంటే... శరీరం సహకరిస్తే... వయసు దేనికీ అవరోధం కాదని నిరూపించారు బి.మంజమ్మ. డెబ్బై రెండేళ్ల ఆమె... ఇటీవల జరిగిన 'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్' 400 మీటర్ల రిలేలో స్వర్ణ పతకం సాధించారు. భర్త మరణంతో కుంగిపోయిన మంజమ్మ... ఆ ఒత్తిడి నుంచి బయటకు రావడానికి 65 ఏళ్లప్పుడు అథ్లెటిక్స్ మొదలుపెట్టారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అద్భుత విజయాలు నమోదు చేసుకున్నారు.

"అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకు అవుతుంది! సంతోషాలు, సుఖాలే కాదు... కష్టాలు, కుదుపులు కూడా వెన్నంటే ఉంటాయి. అది నాకు కాస్త ఆలస్యంగా అనుభవంలోకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ మాది. జిల్లా ఆరోగ్య కేంద్రంలో లేడీ హెల్త్ విజిటర్ (ఎల్‌హెచ్‌వీ)గా, ఇన్‌చార్జి నర్సింగ్ అధికారిగా 36 ఏళ్లు సేవలు అందించాను. 2013లో పదవీ విరమణ పొందాను. అదే ఏడాది మావారు దేవ రాజ్ మరణించారు. 'కర్ణాటక హ్యాండ్‌లూమ్ అండ్ ఉలెన్ సొసైటీ'లో పని చేసేవారు. ఆయన మరణం నన్ను మానసికంగా కుంగదీసింది. ఎంత ప్రయత్నించినా... చాలా ఏళ్లు ఆ బాధ నుంచి బయటకు రాలేకపోయాను.

అరవై ఐదేళ్ల వయసులో...

మా అమ్మాయి, సన్నిహితుల సూచనతో మావారు పోయిన ఐదేళ్ల తరువాత జాగింగ్ మొదలుపెట్టాను. అప్పుడు నా వయసు 65. క్రమంగా జాగింగ్ నాకు ఒక వ్యాపకంగా మారిపోయింది. రోజూ ఓ గంట అలా నడుస్తుంటే కాస్త ఉపశమనం కలిగినట్టు అనిపించేది. అదేసమయంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ గురించి తెలిసింది. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా నా పేరు నమోదు చేసుకున్నా. 2018లో తొలిసారి పోటీల్లో పాల్గొన్నా. షార్ట్ పుట్‌లో మొదటి బహుమతి లభించింది. ఆ ఉత్సాహంతో ప్రతి ఈవెంట్‌లో పోటీపడ్డాను. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి దాటి ఇప్పుడు అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొంటున్నాను.

మా అమ్మాయి సహకారంవల్లే...

ఇటీవల చెన్నైలో జరిగిన 23వ 'ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్' 400 మీటర్ల రిలే పరుగు పందెంలో స్వర్ణ పతకం నెగ్గాను. ఇన్నేళ్ల నా శ్రమకు తగిన ఫలితం ఇది. 27 ఏళ్ల మా అమ్మాయి వర్షిణి దాస్ సహకారం, ప్రోత్సాహంవల్లే నేను ఇన్నేళ్లుగా రాణించగలుగుతున్నా. తను బెంగళూరులో డాక్టర్. అంతేకాదు, నా స్నేహితులు, మైసూరు, మంగళూరు క్రీడా సంఘాలవారు అన్ని వేళలా నాకు మద్దతుగా నిలుస్తున్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. ముఖ్యంగా వృద్ధులకు ఒక మంచి వ్యాపకమే కాదు... వారిని చురుగ్గా ఉంచేందుకు చక్కని వ్యాయామం కూడా. యోగా, నడక, ధ్యానం, క్రీడలు... ఇవన్నీ మనిషి జీవితానికి ఎంతో అవసరమైనది. అందుకే అందరూ, ముఖ్యంగా వయసు మీదపడిన వారు తప్పకుండా రోజులో కొంత సమయం వీటికి కేటాయించాలి.



ప్రతిభకు వయసు అడ్డుకాదు...

అందరిలోనూ ప్రతిభ, నైపుణ్యాలు ఉంటాయి. వాటికి పదును పెడితే అద్భుతాలు సాధించవచ్చు. ఇందుకు వయసు అడ్డంకి కాదు. అంకితభావంతో కృషి చేస్తే అసాధ్యమనేది ఏదీ ఉండదనేది నా అభిప్రాయం. అందుకు నేను ఒక ఉదాహరణ. నేను ఇప్పటివరకు నాసిక్, హైదరాబాద్, గోవా, పుణే, కొచీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్స్‌లో మా రాష్ట్రం తరుపున పాల్గొన్నాను. అలాగే బ్రునీ, శ్రీలంక మాస్టర్ అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్, సౌత్ ఏషియా టోర్నమెంట్, సౌతిండియా టోర్నమెంట్‌లలో పోటీపడ్డాను. మొత్తంగా 110 పతకాలు గెలుచుకున్నాను. గతంలో నేను 100, 200 మీటర్ల రేసుల్లో మాత్రమే పాల్గొనేదాన్ని. కానీ ఇప్పుడు ఎక్కువగా షార్ట్ పుట్, డిస్కస్, జావెలిన్ త్రో, 1కేఎం వాక్, 60 మీటర్ల రేస్‌లపై దృష్టి పెట్టాను.

వాటికి దూరంగా ఉండాలి...

నేటి తరం పిల్లలను చూస్తుంటే చాలా బాధ కలుగుతుంది. రాత్రిపూట ఆలస్యంగా నిద్ర పోవడం, జంక్ ఫుడ్‌కు అలవాటు పడటం, గంటలకు గంటలు మొబైల్‌లో గడపడం వారికి నిత్యకృత్యమైపోయింది. వీటివల్ల చిన్న వయసులోనే ఊబకాయంతో బాధపడుతున్నారు. అనారోగ్యాన్ని కొని తెచ్చుకొంటున్నారు. యువతరం ఈ అలవాట్లను మార్చుకోవాలి. సమయానికి నిద్రపోవాలి. ఇంటి ఆహారం తినాలి. రోజులో కనీసం ఒక గంట వాకింగ్, జాగింగ్, యోగా లాంటివాటికి కేటాయించాలి. ఏదో ఒక క్రీడలో భాగస్వాములైతే శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా దృఢంగా ఉంటారు. చేసే పనిపై శ్రద్ధ పెట్టగలుగుతారు. అన్నిటికీ మించి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపగలుగుతారు."

పిల్లల పెదవులకు...



చలి గాలులకు పిల్లల పెదవులు కూడా పొడి బారి పగులుతుంటాయి. చిన్న చిట్కాలతో ఈ పగుళ్లను తగ్గించవచ్చు.


- నెలల పిల్లలకు తరచుగా పెదవులు ఎండినట్లయి నల్లగా మారి పగులుతుంటాయి. అలాంటప్పుడు తల్లిపాలతో పిల్లల పెదవులు తడిచేలా చేస్తే సరిపోతుంది.
- ఇంట్లో తయారుచేసిన లేదా రసాయనాలు కలుపని కొబ్బరి నూనె, బాదం నూనె, నెయ్యిలలో ఒకదాన్ని పిల్లల పెదవుల మీద రాస్తూ ఉంటే పగుళ్లు తగ్గుతాయి. శీతాకాలంలో పిల్లలను బయటికి తీసుకువెళ్లేటప్పుడు తప్పనిసరిగా ఇలా చేయాలి.
- వాతావరణం అత్యంత పొడిగా ఉందనిపిస్తే ఇంట్లో హ్యుమిడిఫయర్‌ను ఏర్పాటు చేయడం మంచిది.
- గరుకుగా మారిన పెదవుల మీద లిప్‌బామ్, కోల్డ్ క్రీమ్ లాంటివాటిని రాయకూడదు. పాల మీగడ రాస్తే ప్రయోజనం ఉంటుంది.
- కలబంద గుజ్జు, తేనెలలో ఒకదాన్ని పెదవులకు రాసి వేలితో మెల్లగా మర్దన చేయాలి. ఇలా తరచూ చేస్తూ ఉంటే తేమ నిండి పెదవుల పగుళ్లు తగ్గుతాయి.
- చిన్న గిన్నెలో ఒక చెంచా బీట్‌రూట్ రసం, ఒక చెంచా పంచదార వేసి ఒకసారి కలపాలి. వెంటనే ఈ మిశ్రమాన్ని పిల్లల పెదవుల మీద రాసి వేళ్లతో సున్నితంగా రుద్దాలి. తరువాత నీళ్లతో కడిగి కొద్దిగా నెయ్యి రాస్తే ప్రయోజనం కనిపిస్తుంది.

ముత్యాల ముగ్గు



మంజరి సావిత్రి గరిమెళ్ల,
శాన్ ఆంటోనియో, టెక్సాస్, అమెరికా

15చుక్కలు
8వచ్చేవరకు
సందుచుక్క



మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరుసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి. అందమైన ముగ్గులను 'నవ్య'లో ప్రచురిస్తాం.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం,
రోడ్ నం. 70, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్-33
ఈ-మెయిల్ : features@andhrajyothy.com

వీటిని తినాలి..!



రోజూ చదువు, ఉద్యోగం, వ్యాపారాల్లో ఎదురయ్యే సవాళ్ల కారణంగా మానసిక ఒత్తిడి పెరుగుతూ ఉంటుంది. అలాంటప్పుడు హార్మోన్లను సంతులనం చేసే పోషకాహారం తీసుకుంటే సమస్య తీరుతుందని నిపుణులు చెబుతున్నారు.

- మెగ్నీషియం, ఫోలిక్ యాసిడ్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పాల కూర, తోటకూర, మెంతి కూర, క్యాబేజీ, బ్రోకలీ, చిలగడ దుంపలు, కోడిగుడ్లు లాంటివాటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరంలో కార్టిసాల్ ప్రభావం తగ్గి ఒత్తిడి, ఆందోళన మాయమవుతాయి.
- తరచూ స్ట్రాబెర్రీ, బ్లాక్ బెర్రీ, నల్ల ద్రాక్ష, అనాస, నారింజ, అరటి పండ్లు తింటూ ఉంటే ఒత్తిడి తగ్గుతుంది.
- చియా సీడ్స్, అవిశె గింజలు, పెరుగును ఆహారంలో చేర్చుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది. ఒమేగా 3 ఫాటీ యాసిడ్స్, డి విటమిన్ అధికంగా ఉండే చేపలను తీసుకోవడం వల్ల కూడా ఫలితం ఉంటుంది.
- బ్రౌన్ రైస్, ఓట్‌మీల్, గోధుమ బ్రెడ్, తృణధాన్యాలు తీసుకోవడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు, సెరటోనిన్ విడుదలై ఒత్తిడిని తగ్గిస్తాయి. జీడిపప్పు, బాదం, పిస్తా, వాల్‌నట్స్, కిస్‌మిస్, డ్రై అంజూర్, ఖర్జూరాలు తింటున్నా ప్రయోజనం ఉంటుంది.
- రోజూ మితంగా డార్క్ చాక్లెట్ తీసుకున్నా మనసు ప్రశాంతంగా ఉంటుంది. గోరువెచ్చని పాలు లేదా ఏదైనా హెర్బల్ టీ తాగినా ఫలితం కనిపిస్తుంది.

స్పోర్ట్స్

గుంటూరు ● శనివారం 27 డిసెంబరు 2025

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్

టాప్‌సీడ్‌కు చరిష్మా షాక్

తెలుగమ్మాయి సంచలనం ● సెమీస్‌కు తరుణ్


చరిష్మా

విజయవాడ సిటీ (ఆంధ్రజ్యోతి): జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తెలుగమ్మాయి సూర్య చరిష్మా తమిరి సంచలన విజయాన్ని నమోదు చేసింది. సింగిల్స్‌లో టాప్‌సీడ్ ఉన్నతి హుడాకు షాకిచ్చి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో అన్‌సీడెడ్ సూర్య చరిష్మా 21-12, 21-15తో ఉన్నతిని చిత్తుచేసింది. మరో క్వార్టర్స్‌లో మహారాష్ట్రకు చెందిన శ్రుతి మందాడ 22-20, 21-12తో రెండోసీడ్ అనుపమకు ఝలకిచ్చింది. రక్షితశ్రీ రామరాజు 16-21, 21-14, 21-18తో తన్వీ శర్మను ఓడించి చరిష్మాతో సెమీస్ ఫైట్‌కు సిద్ధమైంది. పురుషుల సింగిల్స్‌లో తెలుగు షట్లర్ తరుణ్ మన్నెపల్లి 21-13, 22-20తో మన్‌రాజ్‌పై, భరత్ భార్గవ్ 21-17, 21-13తో గిన్‌పాల్‌పై, టాప్‌సీడ్ కిరణ్ జార్జ్ 21-18, 21-18తో రోనక్‌పై, రిత్విక్ 21-13, 22-20తో సతీశ్‌పై నెగ్గి సెమీస్‌లో అడుగుపెట్టారు. మహిళల డబుల్స్‌లో రిదువర్షిణి/సానియా జోడీ 21-16, 21-19తో టాప్‌సీడ్ రీతూపర్ణ పాండా/శ్వేతపర్ణ పాండా జంటను చిత్తుచేసి సెమీస్‌లో అడుగుపెట్టింది.

1

టీ20 పురుషులు, మహిళల క్రికెట్‌లో 1000 రన్స్, 150 వికెట్లు సాధించిన ఏకైక ప్లేయర్‌గా దీప్తి శర్మ.

టీ20ల్లో అత్యధిక వికెట్లు (151) తీసిన బౌలర్‌గా మెగన్ షట్ (ఆస్ట్రేలియా)తో కలిసి సంయుక్తంగా టాప్‌లో నిలిచిన దీప్తి శర్మ.

మహిళల టీ20లలో కెప్టెన్‌గా అత్యధిక విజయాలు (77, 130 మ్యాచ్‌లు) అందించిన హర్మన్‌ప్రీత్. మెగ్ లానింగ్ (ఆస్ట్రేలియా, 76 విజయాలు, 100 మ్యాచ్‌లు)ను అధిగమించింది.

3

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక (333) వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా దీప్తీశర్మ. జులన్ గోస్వామి (355), షివర్ బ్రంట్ (335) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

సిరీస్ మనదే

రేణుక స్వింగ్, దీప్తి స్పిన్‌కు లంక విలవిల

షఫాలీ ధనాధన్ మూడో టీ20లో భారత్ ఘన విజయం


షఫాలీ వర్మ (79 నాటౌట్)


దీప్తీశర్మ (3/18)

తిరువనంతపురం: శ్రీలంక మహిళలతో ఐదు టీ20ల సిరీస్‌ను భారత్ మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సొంతం చేసుకుంది. శుక్రవారం ఇక్కడ జరిగిన మూడో టీ20లో ఎనిమిది వికెట్లతో హర్మన్ సేన ఘన విజయం సాధించింది. భారత బౌలర్లు విజృంభించిన వేళ తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 112/7 స్కోరుకే పరిమితమైంది. ఇమేషా దులానీ (27), హసినీ పెరీరా (25), కవిషా దిల్హరీ (20) మోస్తరుగా ఆడారు. ఏడాది తర్వాత టీ20ల బరిలో దిగిన రేణుకా సింగ్ (4/21) స్వింగ్ బౌలింగ్‌తో అదరగొట్టింది. దీప్తీశర్మ (3/18) మూడు వికెట్లు పడగొట్టింది. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 13.2 ఓవర్లలో 115/2తో ఛేదించింది. షఫాలీ వర్మ (42 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్సర్లతో 79 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరిసింది. కవిషా దిల్హరీ రెండు వికెట్లు కైవసం చేసుకుంది. రేణుకా సింగ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.

షఫాలీ ఆడేసింది: ఈ మ్యాచ్‌లోనూ షఫాలీ వర్మ శ్రీలంక బౌలర్లను ఆడేసుకుంది. మంధాన (1), జెమీమా (9) విఫలమైనా కెప్టెన్ హర్మన్ (21 నాటౌట్) జతగా జట్టును సునాయాసంగా విజయ తీరాలకు చేర్చింది. స్పిన్నర్ నిమష వేసిన ఐదో ఓవర్లో 4,4,6,4తో షఫాలీ కదం తొక్కింది. అదే జోరులో 24 బంతుల్లోనే సిరీస్‌లో వరుసగా రెండో హాఫ్ సెంచరీ పూరించింది. హర్మన్‌తో కలిసి మూడో వికెట్‌కు అభేద్యంగా 48 పరుగులు జోడించిన షఫాలీ.. షహానీ బౌలింగ్‌లో ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించింది.

బౌలర్ల జోరు: శ్రీలంక ఇన్నింగ్స్ ధాటిగానే ప్రారంభమైనా..భారత బౌలర్ల విజృంభణతో కుదుపులకు లోనైంది. మధ్య ఓవర్లలో ఇమేషా, కవిష ఆదుకోవడంతో స్కోరు సెంచరీ దాటింది. రేణుకా సింగ్, దీప్తీశర్మ దాటికి శ్రీలంక 45/4 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. క్రాంతి గౌడ్ వేసిన 13వ ఓవర్లో ఇమేషా దులానీ 4, కవిషా దిల్హరీ 6 బాదడంతో శ్రీలంకకు 14 పరుగులు లభించాయి. కుదురుకుంటున్న ఈ జోడీ నుంచి దిల్హరీని క్యాచవుట్ చేసిన దీప్తి ప్రత్యర్థికి మరోసారి షాకిచ్చింది. దాంతో 40 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. ఇక.. 16వ ఓవర్లో దులానీని కూడా రేణుక పెవిలియన్ చేర్చగా, 18వ ఓవర్లో మల్షాను దీప్తి బౌల్డ్ చేసింది. చివరి రెండు ఓవర్లలో కౌషిని (19 నాటౌట్) ఒక్కో ఫోర్ కొట్టడంతో శ్రీలంక ఓ మోస్తరు స్కోరు సాధించింది.

స్కోరు బోర్డు

శ్రీలంక: హసినీ పెరీరా (సి) దీప్తీ శర్మ (బి) రేణుక 25, ఆటపట్టు (సి) హర్మన్ (బి) దీప్తీ శర్మ 3, హర్షిత (సి) అండ్ (బి) రేణుక 2, ఇమేషా (సి) జెమీమా (బి) రేణుక 27, నీలాక్షిక (ఎల్బీ) రేణుక 4, కవిష (సి) అమన్‌జోత్ (బి) దీప్తీ శర్మ 20, నుత్యాంగన (నాటౌట్) 19, షెహాని (బి) దీప్తీ శర్మ 5, మల్కి (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు 6, మొత్తం: 20 ఓవర్లలో 112/7; వికెట్లపతనం:** 1-25, 2-31, 3-32, 4-45, 5-85, 6-90, 7-98; **బౌలింగ్:** రేణుక 4-1-21-4, క్రాంతి గౌడ్ 4-0-22-0, దీప్తీ శర్మ 4-0-18-3, వైష్ణవి 3-0-14-0, అమన్‌జోత్ 4-0-23-0, శ్రీ చరణి 1-0-11-0.

భారత్: షఫాలీ (నాటౌట్) 79, మంధాన (ఎల్బీ) దిల్హరీ 1, జెమీమా (బి) దిల్హరీ 9, హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు 5, మొత్తం: 13.2 ఓవర్లలో 115/2; వికెట్లపతనం:** 1-27, 2-67; **బౌలింగ్:** షెహాని 2.2-0-28-0, మదార 2-0-11-0, నిమషా 2-0-29-0, కవిష 3-0-18-2, ఇనోక 4-0-28-0.

తొలి రోజే 20 వికెట్లు

బాక్సింగ్‌డే టెస్టులో పేసర్లకు పండుగ

● ఆస్ట్రేలియా 152 ● ఇంగ్లండ్ 110


మైకేల్ నేసర్ (4/45)

యాషెస్ నాలుగో టెస్ట్

మెల్‌బోర్న్: ఇప్పటికే యాషెస్ సిరీస్‌ను 0-3తో కోల్పోయిన ఇంగ్లండ్.. నాలుగో టెస్ట్‌లో సత్తా చాటేందుకు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయింది. పిచ్‌పై 10 మిల్లీ మీటర్ల మేర ఉన్న పచ్చికకు మబ్బు పట్టిన వాతావరణం తోడవడంతో ఇరుజట్ల పేసర్లు చెలరేగారు. ఫలితంగా బాక్సింగ్ డే టెస్ట్ మొదటి రోజే 20 వికెట్లు నేలకూలాయి. ఇక, ఈ వికెట్ల వేటలో ఆతిథ్య ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. శుక్రవారం ప్రారంభమైన ఈ టెస్ట్‌లో టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 45.2 ఓవర్లలో 152 పరుగులకే ఆలౌటైంది. చాలా కాలం తర్వాత జట్టులోకి పునరాగమనం చేసిన మైకేల్ నేసర్ (35) టాప్ స్కోరర్. ఉస్మాన్ ఖవాజా (29), కేరీ (20) పర్లేదనిపించారు. జోష్ టంగ్ ఐదు వికెట్లతో చెలరేగాడు. అయితే ప్రత్యర్థిని స్వల్ప స్కోరుకే ఆలౌట్ చేయడంతో సిరీస్‌లో మొదటిసారి టెస్ట్ గెలిచేందుకు వచ్చిన అవకాశాన్ని ఇంగ్లండ్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. నేసర్, బోలాండ్ దెబ్బకు తొలి ఇన్నింగ్స్‌లో పర్యాటక జట్టు 110 పరుగులకే కుప్పకూలింది. 4/16తో తీవ్ర ఇక్కట్లలో పడగా..బ్రూక్ (41), స్టోక్స్ (16) ఐదో వికెట్‌కు 50 పరుగులు జోడించడంతో ఒకింత తేరుకుంది. అయితే ఆ తర్వాత బ్రూక్, స్మిత్, జాక్స్, స్టోక్స్ వరుసగా పెవిలియన్‌కు చేరడంతో ఇంగ్లండ్ ఒక్కసారిగా కుదేలైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా ఆట ఆఖరికి వికెట్ నష్టపోకుండా నాలుగు పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 42 పరుగులతో కలిపి కంగారూలు మొత్తంగా 46 రన్స్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు.

20

మెల్‌బోర్న్‌లో యాషెస్ టెస్ట్ మ్యాచ్ తొలి రోజు అత్యధిక వికెట్లు (20) పడడం 1901-02 తర్వాత ఇదే తొలిసారి.

సంక్షిప్త స్కోర్లు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 152 (నేసర్ 35, ఖవాజా 29, కేరీ 20, గ్రీన్ 17, జోష్ టంగ్ 5/45, అట్కిన్సన్ 2/28); **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 110 (బ్రూక్ 41, అట్కిన్సన్ 28, స్టోక్స్ 16, నేసర్ 4/45, బోలాండ్ 3/30, స్టార్క్ 2/23); **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 4/0 (బోలాండ్ బ్యాటింగ్ 4, హెడ్ బ్యాటింగ్ 0).

94,119

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో నాలుగో టెస్ట్ మొదటి రోజు హాజరైన ప్రేక్షకులు. 2015లో ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడ జరిగిన వన్డే వరల్డ్ కప్ ఫైనల్ రికార్డు (93,013)ను తిరగ రాసింది.

విరాట్ తగ్గేదేలె..

గుజరాత్‌పై ఢిల్లీ గెలుపు ● విజయ్ హజారే ట్రోఫీ



బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నీ తొలి మ్యాచ్‌లో శతకంతో సత్తా చాటిన ఢిల్లీ ఆటగాడు విరాట్.. రెండో మ్యాచ్‌లో అర్ధ సెంచరీ సాధించాడు. గుజరాత్‌తో మ్యాచ్‌లో కోహ్లీ (61 బంతుల్లో 77)కి తోడు కెప్టెన్ రిషభ్ పంత్ (79 బంతుల్లో 70) రాణించడంతో ఢిల్లీ ఏడు వికెట్లతో గెలుపొందింది. మొదట ఢిల్లీ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 254 పరుగులు చేసింది. ఛేదనలో గుజరాత్ 47.4 ఓవర్లలో 247 పరుగులకే పరిమితమైంది.

రోహిత్ 'గోల్డెన్ డక్' అయినా..: ఇక ముంబైకి ఆడుతున్న రోహిత్‌శర్మ ఉత్తరాఖండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో తానెదుర్కొన్న తొలి బంతికే అవుటై గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో మొదట ముంబై 50 ఓవర్లలో 7 వికెట్లకు 331 పరుగులు చేసింది. హార్దిక్ తమోర్ (93 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో విజృంభించగా, సోదరులు ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్ చెరో 55 పరుగులతో భళా అనిపించారు. ఛేదనలో యువరాజ్ చౌదరి (96) చెలరేగినా, ఉత్తరాఖండ్ 50 ఓవర్లలో 280/9 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది.

'రికార్డు' సగటు

లిస్ట్-ఎ క్రికెట్‌లో కోహ్లీ అత్యధిక సగటు (57.87)ను నమోదు చేశాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మైకేల్ బెవాన్ (57.86) పేరిటనున్న ఆల్‌టైమ్ రికార్డును అధిగమించాడు.

అగ్రస్థానంలో అర్జున్

వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్

దోహా: ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ శుక్రవారం, తొలిరోజు ఐదు రౌండ్లు ముగిసేసరికి భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి (4.5) అగ్రస్థానంలో ఉన్నాడు. తొలి నాలుగు గేమ్‌లు గెలిచిన అర్జున్.. ఐదో రౌండ్‌లో వరల్డ్ నెం.1 కార్ల్‌సన్‌తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. దీంతో కార్ల్‌సన్ (4.5)తో కలిసి కలిసి సంయుక్తంగా మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో 4 రౌండ్లు ముగిసేసరికి హారిక (3.5) సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. నాలుగు గేమ్‌లలో మూడు నెగ్గిన హారిక ఒక మ్యాచ్‌ను డ్రా చేసింది. ఇక.. నాలుగు గేమ్‌లలో రెండు గెలిచిన హంపి, మరో రెండింటిని డ్రా చేసుకుంది. 3 పాయింట్లతో హంపి సంయుక్తంగా మూడోస్థానంలో ఉంది.


న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా అందుకుంటున్న క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ.

రైల్వేస్‌పై ఆంధ్ర గెలుపు

ఆలూర్: విజయ్ హజారే తొలి మ్యాచ్‌లో ఓడిన ఆంధ్ర జట్టు.. రెండో మ్యాచ్‌లో సత్తా చాటింది. కర్ణాటకలోని ఆలూర్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర 6 వికెట్ల తేడాతో రైల్వేస్‌పై గెలిచింది. తొలుత రైల్వేస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 266 పరుగులు చేసింది. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు, కలిదిండి రాజు చెరో 3 వికెట్లు పడగొట్టగా, హేమంత్ రెడ్డి 2 వికెట్లు తీశాడు. ఛేదనలో రికీ భుయ్ (76), కెప్టెన్ నితీశ్ కుమార్ రెడ్డి (55 నాటౌట్) అర్ధ సెంచరీలతో చెలరేగడంతో ఆంధ్ర 44.4 ఓవర్లలోనే 271/4 స్కోరు చేసి గెలిచింది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,40,020 ▲	1,28,350 ▲	2,48,000 ▲
విజయవాడ	1,42,000 ▲	1,32,000 ▲	2,32,000 ▲
విశాఖపట్నం	1,42,140 ▲	1,28,350 ▲	2,54,000 ▲
రాజమండ్రి	1,40,020 ▲	1,28,350 ▲	2,30,000 ▲
ప్రొద్దుటూరు	1,42,800 ▲	1,31,380 ▲	2,35,500 ▲
ముంబై	1,37,956 ▲	1,26,368 ▲	2,28,107 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ

హైదరాబాద్	660	విజయవాడ	690
వరంగల్	652	గోదావరి	665
చిత్తూరు	703	విశాఖపట్నం	660
		దజను గుడ్లు రూ.	96

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	142	విజయవాడ	135
వరంగల్	142	గుంటూరు	140
కరీంనగర్	142	ఒంగోలు	140
మహబూబ్‌నగర్	142	చిత్తూరు	142
కర్నూలు	142	నెల్లూరు	147
విశాఖపట్నం	126	అనంతపురం	147
గోదావరి	135		

రేసు గుర్రాలు పసిడి, వెండి

ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు

కిలో వెండి ధర ఒక్కరోజే రూ.9,350 అప్

10 గ్రాముల పుత్తడి ధర రూ.1,42,300



న్యూఢిల్లీ: జాతీయ, అంతర్జాతీయ విపణిలో బంగారం, వెండి ధరలు రేసుగుర్రాల్లా పరిగెడుతున్నాయి. శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.9,350 పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.2,36,350కి చేరింది. పారిశ్రామిక వినియోగం గణనీయంగా పెరగడం, ఉత్పత్తి తగినంతగా లేకపోవడం వల్ల వెండి ధర అడ్డూ, ఆపూ లేకుండా దూసుకుపోతోందని పరిశీలకులంటున్నారు. కాగా 10 గ్రాముల మేలిమి (24 కేరట్లు) బంగారం ధర సైతం శుక్రవారం రూ.1,500 పెరిగి మరో కొత్త రికార్డు రూ.1,42,300కి చేరింది.

అంతర్జాతీయంగానూ అదే దూకుడు: అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు శుక్రవారం మరో ఆల్‌టైమ్ రికార్డును తాకాయి. ఔన్స్ (31.10 గ్రాములు) వెండి ధర గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకే రోజు 5.18% లాభపడి 75.63 డాలర్ల రికార్డుకు చేరింది. అలాగే ఔన్స్ పసిడి ధర 50.87 డాలర్లు పెరిగి 4,530.42 డాలర్ల జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరింది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ ఈ రెండు విలువైన మెటల్స్ ర్యాలీ కొనసాగుతోంది. అమెరికా ఫ్యూచర్స్ మార్కెట్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డెలివరీ ఇచ్చే ఔన్స్ పసిడి ధర శుక్రవారం 4,542.05కు చేరింది.

బంపర్ లాభాలు: ఈ ఏడాది బంగారం, వెండి అందించినంత భారీ స్థాయిలో మరే ఇతర పెట్టుబడులు మదుపరులకు లాభాలు పంచలేదు. 10 గ్రాముల మేలిమి పసిడి ధర గత ఏడాది డిసెంబరు 31న రూ.78,950, కిలో వెండి ధర రూ.89,700 పలికింది. శుక్రవారం నాటి ధరలతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు పసిడి ధర రూ.63,350 (అంటే 80.24%), కిలో వెండి ధర రూ.1,46,650 (అంటే 163.5%) పెరిగి మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. ఈ నెల 19 నుంచి చూసినా కిలో వెండి ధర రూ.32,250 (15.8%) పెరిగింది.

వచ్చే ఏడాదీ ఇదే జోరు

వచ్చే ఏడాది కూడా ఈ రెండు లోహాల పరుగుకు బ్రేక్ పడకపోవచ్చని మార్కెట్ పండితులు భావిస్తున్నారు. ఔన్స్ వెండి ధర వచ్చే ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో 100 డాలర్లకు చేరడం పెద్ద కష్టంగాకపోవచ్చని అంచనా. భారత మార్కెట్‌లోనూ వచ్చే ఏడాది ఈ రెండు లోహాల ధర ఎంతలేదన్నా కనీసం మరో 20% పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ర్యాలీకి కారణాలు

- అమెరికాలో వడ్డీరేట్లు ఇంకా తగ్గుతాయనే అంచనాలు.
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం రేటు.
- ఆరు ప్రధాన కరెన్సీలతో కొనసాగుతున్న డాలర్ మారకం రేటు పతనం.
- కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు.
- సురక్షిత పెట్టుబడిగా ఈ రెండో లోహాలకు ఉన్న పేరు.
- కేంద్ర బ్యాంకులు బంగారాన్ని పెద్ద ఎత్తున కొనుగోలు చేయడం.
- డిమాండ్‌కు తగ్గట్టుగా లేని ఉత్పత్తి.
- ఈవీలు, ఎలక్ట్రానిక్స్, క్లీన్ ఎనర్జీ రంగాల్లో పెరుగుతున్న వెండి వినియోగం.

మార్కెట్లో నిస్తేజం

367 పాయింట్లు దిగజారిన సెన్సెక్స్

ముంబై: ముందుకు నడిపించే ట్రిగ్గర్లేవీ లేకపోవడం, విదేశీ నిధుల తరలింపు ఈక్విటీ మార్కెట్లో నిస్తేజాన్ని నింపాయి. ఈ కారణంగా వరుసగా మూడో రోజు కూడా మార్కెట్ నష్టాలతోనే ముగిసింది. సెన్సెక్స్ 367.25 పాయింట్ల నష్టంతో 85,041.45 వద్ద ముగియగా నిఫ్టీ 99.80 పాయింట్ల నష్టంతో 26,042.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 470.88 పాయింట్ల వరకు కూడా దిగజారి 84,937.82 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది.

వేదాంతా షేరు దూకుడు: వ్యాపార దిగ్గజాల్లో ఒకటైన వేదాంతా లిమిటెడ్ షేరు శుక్రవారం ఏడాది గరిష్ఠానికి చేరింది. ఈ ఏడాదిలో ఈ షేరు ఇప్పటివరకు 35% పెరిగింది. బీఎస్ఈలో 35.29% లాభపడి ఇంట్రాడేలో 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.607.65ని తాకింది. వరుసగా 13 సెషన్లలో ఈ షేరు 17.44% దూసుకుపోయింది.

క్యాస్ట్రాల్ ఓపెన్ ఆఫర్: ఇంధన దిగ్గజం బీపీ అనుబంధ క్యాస్ట్రాల్ ఇండియా యూనిట్ కొనుగోలు డీల్‌లో భాగంగా కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, అమెరికాకు చెందిన పీఈ సంస్థ స్టోన్‌పీక్ 26% షేర్ల కొనుగోలుకు ఓపెన్ ఆఫ్ అందించనున్నాయి. బుధవారం నాటి క్యాస్ట్రాల్ షేరు ముగింపు ధర కన్నా 2.5% ప్రీమియం ధరకు అంటే ఒక్కో షేరు రూ.194.04కి కొనుగోలు చేయనున్నట్టు ప్రకటించాయి. శుక్రవారం ఈ షేరు రూ.191.40 వద్ద ట్రేడవుతోంది.

కోఫోర్జ్ చేతికి ఎన్‌కోరా

న్యూఢిల్లీ: సిలికాన్ వేలీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఏఐ కంపెనీ ఎన్‌కోరాలో నూరు శాతం వాటాలు కొనుగోలు చేస్తున్నట్టు ఐటీ సర్వీసుల రంగంలోని కోఫోర్జ్ ప్రకటించింది. 235 కోట్ల డాలర్ల (రూ.21,133 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువకు డీల్ కుదిరినట్టు వెల్లడించింది. ఈ డీల్‌లో భాగంగా ఎన్‌కోరా ప్రస్తుత షేర్‌హోల్డర్లు, పెట్టుబడులు పెట్టిన పీఈ దిగ్గజాలు అడ్వెంట్ ఇంటర్నేషనల్, వార్‌బర్గ్ పింకస్‌లకు కోఫోర్జ్ 189 కోట్ల డాలర్ల విలువ గల ప్రిఫరెన్షియల్ షేర్లు జారీ చేస్తుంది. ఈ మేరకు తాము ఒక ఒప్పందంపై సంతకం చేసినట్టు కోఫోర్జ్ సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధీర్ సింగ్ తెలిపారు.

సౌదీ ఎయిర్‌పోర్ట్ రేసులో జీఎంఆర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సౌదీ అరేబియాలో కొత్తగా నిర్మించనున్న టైఫ్ విమానాశ్రయం కోసం జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ పోటీపడుతోంది. ఇందుకోసం పిలిచిన బిడ్స్‌లో మరో నాలుగు కన్సార్షియంలతో కలిసి అర్హత కూడా సంపాదించింది. సౌదీ అరేబియా 80 కోట్ల డాలర్ల అంచనాతో ఈ కొత్త విమానాశ్రయం తలపెట్టింది. అర్హత సాధించడంతో త్వరలో జరిగే ఆర్థిక, టెక్నికల్ బిడ్స్‌లో కంపెనీ పాల్గొంటుంది. ఈ ప్రాజెక్టు ద్వారా పశ్చిమాసియా దేశాల్లో విమానాశ్రయాల నిర్మాణ వ్యాపారాన్ని మరింతగా విస్తరించవచ్చని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భావిస్తోంది.

అపోలో మైక్రోసిస్టమ్స్‌కు రూ.100 కోట్ల ఆర్డర్

హైదరాబాద్: అపోలో మైక్రోసిస్టమ్స్ లిమిటెడ్ రక్షణ రంగం నుంచి రూ.100 కోట్లకు పైబడిన ఆర్డర్ సాధించింది. ఈ ఆర్డర్ కింద మానవ రహిత ఏరియెల్ సిస్టమ్స్ సరఫరా చేయాల్సి ఉంటుంది. నాలుగు నెలల వ్యవధిలో ఈ ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉంటుందని రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో తెలిపింది. మౌలిక వసతులు, రవాణా, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు ఏఎంఎస్ఎల్ టెక్నాలజీ ఆధారిత సొల్యూషన్లు అందచేస్తుంది.

'బొండాడ'కు ఎన్‌జీఈఎల్ ఆర్డర్

హైదరాబాద్: ఉత్తర్ ప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌లో నిర్మాణంలో ఉన్న 300 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టుకు బ్యాలెన్స్ ఆఫ్ సిస్టమ్స్ (బీఓఎస్) సరఫరాకు ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్) నుంచి రూ.392 కోట్ల విలువ గల ఆర్డర్ సాధించినట్టు బొండాడ ఇంజనీరింగ్ తెలిపింది. ఎన్‌జీఈఎల్ నుంచి కంపెనీకి లభించిన తొలి ఆర్డర్ ఇదేనని కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొండాడ రాఘవేంద్ర రావు తెలిపారు. ఈ ఆర్డర్‌ను 15 నెలల కాలవ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

బ్యాంకింగ్, బీమాలో పెను మార్పులు

పీఎస్‌బీల్లో మరో విడత విలీనాలు!



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది దేశీయ బీమా, బ్యాంకింగ్ రంగాల్లో మరిన్ని మార్పులు చోటు చేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సంఖ్య మరింత తగ్గవచ్చు. ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉన్న కొన్ని పీఎస్‌బీలను, ఆర్థికంగా మంచి స్థితిలో ఉన్న పీఎస్‌బీల్లో విలీనం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో ప్రస్తుతం 12గా ఉన్న పీఎస్‌బీల సంఖ్య నాలుగైదుకు కుంచించుకుపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్‌బీఐతోను, బ్యాంకులతో చర్చలు ప్రారంభించినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గత నెలలో ప్రకటించారు. మన దేశం నుండి కూడా అంతర్జాతీయ స్థాయి బ్యాంకుల సృష్టే లక్ష్యంగా ఈ కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు.

అటకెక్కిన ప్రైవేటీకరణ: నిజానికి ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలను ప్రైవేటీకరించాలని ప్రభుత్వం రెండేళ్ల క్రితమే భావించింది. నీతి ఆయోగ్ కూడా ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఉద్యోగ సంఘాల వ్యతిరేకత, ప్రైవేటు రంగం నుంచి సరైన ఆసక్తి రాకపోవడంతో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు. ఇప్పుడు ఈ రెండు బ్యాంకులను కూడా వేరే పీఎస్‌బీల్లో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. దీనికి ఉద్యోగ సంఘాల నుంచి కూడా పెద్దగా వ్యతిరేకత ఉండదని ప్రభుత్వం భావిస్తోంది.

'ప్రైవేట్'పై విదేశీ పట్టు: మరోవైపు భారత బ్యాంకింగ్ రంగంపై విదేశీ బ్యాంకులు పట్టుబిగిస్తున్నాయి. ఆర్థికంగా చిక్కుల్లో ఉన్న ప్రైవేటు బ్యాంకులను ఇందుకు లక్ష్యంగా ఎంచుకుంటున్నాయి. జపాన్ ఆర్థిక దిగ్గజం సుమిటోమో మిత్సుఇ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) రూ.13,483 కోట్ల పెట్టుబడితో ఎస్ బ్యాంక్ ఈక్విటీలో 20% వాటా ఇప్పటికే కొనుగోలు చేసింది. యూఏఈకి చెందిన ఎన్‌బీడీ బ్యాంక్ కూడా రూ.26,853 కోట్ల పెట్టుబడితో ఆర్‌బీఎల్ బ్యాంకు ఈక్విటీలో 60% వాటా కొనుగోలు చేస్తోంది. ఐడీబీఐ బ్యాంకు కూడా ఇదే దారిలో నడవనున్నదంటున్నారు.

బీమాలో 100 శాతం ఎఫ్‌డీఐ: బీమా రంగంలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు ఇటీవలే పార్లమెంట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వచ్చే ఏడాది ఈ రంగంలోనూ కొన్ని భారీ డీల్స్ చోటు చేసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. మొత్తం మీద వచ్చే ఏడాది బ్యాంకింగ్, బీమా రంగాల్లో చోటు చేసుకునే మార్పులకు 2025లో పునాది పడింది.

ఎంఎస్ఎంఈ రుణాలు రూ.46 లక్షల కోట్లు

న్యూఢిల్లీ : దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీలకు (ఎంఎస్ఎంఈ) రుణ వితరణ పెరుగుతోంది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి ఈ సంస్థల రుణాలు రూ.46 లక్షల కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 16% ఎక్కువ. ఇదే కాలంలో క్రియాశీలంగా ఉన్న రుణ ఖాతాల సంఖ్య 11.8% పెరిగి 7.3 కోట్లకు చేరింది. ఎంఎస్ఎంఈల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు రుణ పథకాలతో పాటు, విధానపరమైన మద్దతు ఇందుకు కారణమని సీఆర్ఐఎఫ్ హైమార్క్-సిడ్బీ నివేదిక తెలిపింది. గత రెండేళ్లలో ఎంఎస్ఎంఈల రుణ చెల్లింపుల నాణ్యత కూడా మెరుగుపడింది. 2023 సెప్టెంబరు నాటికి గడువు ముగిసి 91 నుంచి 180 రోజులైనా చెల్లించని రుణ బకాయిలు 1.7% ఉండగా ఈ ఏడాది సెప్టెంబర నాటికి 1.4 శాతానికి దిగి వచ్చినట్టు నివేదిక తెలిపింది. మొత్తం ఎంఎస్ఎంఈల రుణాల్లో 80% ఒకే వ్యక్తి యాజమాన్యంలోని కంపెనీలకు దక్కాయని పేర్కొన్నారు. సంఖ్యాపరంగా చూసినా వీరి వాటా 90% ఉంది. మొత్తం రుణాల్లో కొత్త ఎంఎస్ఎంఈల వాటా 23.3 శాతం ఉండగా 57% మూలధన రుణాలున్నాయి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



స్టైలిష్‌గా ఢిల్లీ షెడ్యూల్

రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'పెద్ది' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ సినిమాకు సంబంధించిన అత్యంత కీలకమైన ఢిల్లీ షెడ్యూల్‌ను చిత్ర యూనిట్ పూర్తి చేసింది.

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట, పార్లమెంట్ వంటి ఐకానిక్ ప్రదేశాల్లో గత కొన్ని రోజులుగా షూటింగ్ నిర్వహించారు. ఈ షెడ్యూల్ ముగింపును ప్రకటిస్తూ సినిమాటోగ్రాఫర్ ఆర్. రత్నవేలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీ షెడ్యూల్‌ను స్టైలిష్‌గా పూర్తి చేశాం. అత్యంత భావోద్వేగ భరితమైన, కవితాత్మకమైన దృశ్యాలను ఇక్కడ చిత్రీకరించాం. ఈ సన్నివేశాల్లో రామ్‌చరణ్ తన అద్భుతమైన నటనతో ఆకట్టుకున్నారు' అని ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాలో చరణ్ మునుపెన్నడూ చూడని మాస్ లుక్‌లో కనిపించనున్నారు. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం లో జాన్వీకపూర్ కథానాయిక. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు రానుంది.

మెగా - విక్టరీ మాస్ సాంగ్



● కొత్త ఏడాది కానుకగా

తెలుగు చిత్ర పరిశ్రమలోని ఇద్దరు దిగ్గజ హీరోలు చిరంజీవి, వెంకటేశ్ కలసి నటిస్తున్న క్రేజీ మల్టీస్టారర్ 'మన శంకర వరప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిరంజీవి, వెంకటేశ్ అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ చిత్ర యూనిట్ శుక్రవారం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలోని మూడో పాటను ఈ నెల 30న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. 'మెగా విక్టరీ మాస్ సాంగ్' పేరుతో వస్తున్న ఈ పాట న్యూ ఇయర్ వేడుకల్లో అభిమానుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తుందని యూనిట్ పేర్కొంది. ఈ పాటకు సంబంధించిన ప్రోమోను నేడు విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో చిరు, వెంకీ తమదైన స్టైల్‌తో అదరగొట్టారు. డెనిమ్ కాంబినేషన్, కూలింగ్ గ్లాసెస్‌తో చిరంజీవి తన వింటేజ్ లుక్‌ను గుర్తు చేశారు. రెడ్ జాకెట్‌లో వెంకటేశ్ ఎనర్జిటిక్‌గా, స్టన్నింగ్ లుక్‌లో కనిపించారు. భారీ సెట్ వందలాది మంది డాన్సర్ల మధ్య ఈ ఇద్దరు హీరోలు వేసిన స్టైలిష్ స్టెప్పులు ఈ సాంగ్ ఏ రేంజ్‌లో ఉండబోతోందో స్పష్టం చేస్తున్నాయి. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ప్రేక్షకులు గొప్ప విజయాన్ని ఇచ్చారు



రోషన్, అనస్వర రాజన్ జంటగా ప్రదీప్ అద్వైతం తెరకెక్కించిన చిత్రం 'ఛాంపియన్'. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్ర బృందం శుక్రవారం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చిత్ర కథానాయకుడు రోషన్ మాట్లాడుతూ 'ఈ చిత్రం నాకు చాలా ప్రత్యేకమైంది. కళ్యాణ్ చక్రవర్తిగారితో కలసి నటించడం గౌరవంగా భావిస్తున్నా. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా. ఇది ఫ్యామిలీ మూవీ. కుటుంబ సభ్యులందరూ కలసి చూడాలని కోరుతున్నా. గొప్ప విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ 'తెలుగులో నాకిది మొదటి చిత్రం. థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది' అని చెప్పారు. దర్శకుడు ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ 'ఇది మన నేల చరిత్ర. అందరూ ఈ సినిమాకు కుటుంబంతో కలసి వెళ్లండి. కచ్చితంగా పిల్లలతో కలసి చూడాల్సిన చిత్రమిది' అని అన్నారు. నిర్మాత స్వప్న దత్ మాట్లాడుతూ 'వైజయంతి మూవీస్‌కి 50 ఏళ్లు, స్వప్న సినిమాస్ మొదలై కూడా 25 ఏళ్లు అవుతోంది. ప్రతిసారి ఒక ఛాలెంజింగ్ కథను ఎంచుకొని సినిమా తీస్తున్నాం. డబ్బు కన్నా సంతృప్తి ముఖ్యం. అందుకే సంతృప్తినిచ్చే సినిమాలనే చేస్తున్నాం. 'ఛాంపియన్'. సినిమాను ఎంతగానో ఆదరిస్తున్న ప్రేక్షకులకు రుణపడి ఉంటాం' అని అన్నారు.



మంచి సందేశంతో..

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ఆర్‌కే ఫిల్మ్స్, సిద్ధ క్రియేషన్స్ బ్యానర్లపై తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌కే దీక్ష'. కిరణ్, అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి నూతన పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం అన్ని వర్గాల వారినీ మెప్పిస్తుంది. మంచి సందేశం ఇస్తుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు చిత్ర నిర్మాత మండలి సెక్రటరీ తుమ్మల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజుగారి పెళ్లిరో...



నవీన్ పొలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అనగనగా ఒక రాజు'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకార స్టూడియోస్ సమర్పిస్తోంది. ఇటీవలె చిత్రం నుంచి విడుదలైన తొలి పాట 'భీమవరం బాల్మా' అందర్నీ ఆకట్టుకుంది. శుక్రవారం ఈ చిత్రం నుంచి 'రాజుగారి పెళ్లిరో' అంటూ సాగే సాంగ్‌ను విడుదల చేశారు మేకర్స్. కలర్‌ఫుల్ విజువల్స్, అదిరిపోయే స్టెప్పులు, వినసొంపైన సంగీతంతో అలరిస్తోందీ గీతం. చంద్రబోస్ సాహిత్యం అందించగా, అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ ఆలపించారు. మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

'దండోరా' గురించే మాట్లాడుకుంటారు



శివాజీ

"'హనుమాన్' నిర్మాత 'దండోరా' చిత్రం చూసి ప్రొడ్యూస్ చేయడానికి ముందుకొచ్చారు. ఈ సినిమా గురించి 2026 సంవత్సరం మొత్తం మాట్లాడుకుంటారు. మలయాళ చిత్ర దర్శకుడు మారి సెల్వరాజ్ వంటి వారితో మురళీకాంత్‌ను పోల్చుతూ అందరూ మాట్లాడుతుంటే మాకు చాలా గర్వంగా ఉంది' అని అన్నారు నటుడు శివాజీ. ఆయనతోపాటు నవదీప్, నందు, బిందు మాధవి ప్రధాన పాత్రధారులుగా మురళీకాంత్ తెరకెక్కించిన చిత్రమిది. సినిమా ఇటీవలె విడుదలైన సందర్భంగా చిత్రబృందం శుక్రవారం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. నిర్మాత రవీంద్ర బెనర్జీ ముప్పానేని మాట్లాడుతూ 'సినిమాకు ప్రేక్షకుల నుంచే కాదు..విమర్శకుల నుంచి సైతం ప్రశంసలు వస్తున్నాయి' అని అన్నారు. దర్శకుడు మురళీకాంత్ మాట్లాడుతూ 'మూడున్నరేళ్ల మా కష్టం ఫలించింది' అని ఆనందం వ్యక్తం చేశారు.

చిన్న చిత్రాలకు ఎఫ్‌ఎన్‌సీసీ అవార్డులు

- అధ్యక్షుడు కె.ఎస్.రామారావు వెల్లడి



ఈ ఏడాది విజయం సాధించిన చిన్న చిత్రాలకు ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్‌ఎన్‌సీసీ) తరపున అవార్డులు బహూకరిస్తున్నట్లు ఎఫ్‌ఎన్‌సీసీ అధ్యక్షుడు, ప్రముఖ నిర్మాత కె.ఎస్.రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.10కోట్ల లోపు బడ్జెట్‌తో తీసిన చిన్న సినిమాలను ప్రోత్సాహించాలన్నదే తమ విధానమని చెప్పారు. ఇందులో భాగంగా 2025లో విడుదలైన 'కోర్ట్'ను ఉత్తమ చిత్రంగా ఎంపిక చేశామన్నారు. అదేవిధంగా 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం నుంచి ఉత్తమ హీరోగా అఖిల్ రాజ్‌కు, ఉత్తమ హీరోయిన్‌గా తేజస్వీరావు, ఉత్తమ దర్శకుడిగా సాయిలు కంపాటికి అవార్డులు అందజేస్తామన్నారు. బొప్పన విష్ణు ఆధ్వర్యంలో టీవీ అవార్డుల ప్రదానోత్సవం కూడా ఉంటుందన్నారు. వీటితోపాటు ఇండస్ట్రీలో 50 ఏళ్లు పూర్తిచేసుకున్న నిర్మాతలు అశ్వనీదత్, అల్లు అరవింద్‌లను సన్మానించనున్నట్లు కె.ఎస్.రామారావు వెల్లడించారు. అలాగే చిరకాలంగా చిత్ర పరిశ్రమలో ఉంటూ, ఫిల్మ్‌నగర్ క్లబ్ అభివృద్ధి కోసం కృషి చేసిన కాజా సూర్యనారాయణను ఈ సందర్భంగా సన్మానిస్తామన్నారు. ఎఫ్‌ఎన్‌సీసీలో డిసెంబరు 31న నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డులను బహూకరిస్తామని రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎన్‌సీసీ కోశాధికారి శైలజ, కాజా సూర్యనారాయణ పాల్గొన్నారు.

అన్ని చోట్లా అద్భుతమైన స్పందన



యుంగధర్ ముని

దర్శకుడు యుగంధర్ ముని. ఆది సాయికుమార్ కథానాయకుడిగా ఆయన తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. ఈ సందర్భంగా యుగంధర్ ముని మీడియాతో ముచ్చటించారు. 'దర్శకుడిగా ఈ కథను ఎంతో బాధ్యతతో రాసుకున్నాను. సైన్స్, శాస్త్రానికి మధ్య బ్యాలెన్స్ చేయాలని, ఎవరి మనోభావాలనూ దెబ్బతీయకూడదని ముందే అనుకున్నాను. అలా తెరకెక్కించిన ఈ చిత్రం మంచి విజయాన్ని ఇచ్చింది' అని తెలిపారు.

"శంబాల' సినిమాకు ప్రేక్షకుల స్పందన చూస్తుంటే ఆనందం కలుగుతోంది. హౌజ్‌ఫుల్ బోర్డులు పడినా కూడా ప్రేక్షకులు గేట్‌లు తోసుకొని మరీ థియేటర్లలోకి వెళ్తున్నారు. ఇవన్నీ నేను చిన్నప్పుడు చిరంజీవి సినిమాలకు చూశాను. ఇప్పుడు ఇలా నా చిత్రానికి అన్ని చోట్లా అద్భుతమైన స్పందన రావడం అనందంగా ఉంది' అని అన్నారు

శిక్షణ నుంచి నిర్మాణం వైపు..



టాలీవుడ్‌లో నూతన నటీనటులను ప్రోత్సహించి, వారికి సరైన మార్గదర్శకత్వం వహిస్తున్న 'వినోద్ ఫిల్మ్ అకాడమీ' నిర్మాణ రంగంలోకి అడుగుపెడుతోంది. ప్రొడక్షన్ నెం1 గా 'వినోద్ ఫిల్మ్ అకాడమీ అండ్ స్టూడియోస్' సంస్థపై ఈ వినోద్‌కుమార్ నువ్వుల చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన సంస్థ ఆరో వార్షికోత్సవంలో ఈ విషయాన్ని ప్రకటించారు. వినోద్‌కుమార్ నువ్వుల ప్రధాన పాత్రలో ప్రణయ్‌రాజ్ వంగరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ముహూర్తపు షాట్‌కు ఎల్బీ శ్రీరామ్ క్లాప్ కొట్టగా, దర్శకులు సునీల్‌కుమార్ రెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిక్కీ, సంగీతం: లలిత్.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు



రేణూ దేశాయ్, అంచల్ గౌడ, పాయల్ చెంగప్ప ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'బ్యాడ్ గాళ్స్'. గురువారం విడుదలైన ఈ చిత్రం చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు ఫణి ప్రదీప్ మాట్లాడుతూ "బాడ్ గాళ్స్' చిత్రం నిడివి పరంగా చిన్నది కానీ కంటెంట్ విషయంలో మాత్రం చాలా పెద్ద చిత్రం. ప్రేక్షకులు మా చిత్రాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం ఆకట్టుకుంటున్నాయి' అని చెప్పారు. నిర్మాత శశిధర్ నల్ల మాట్లాడుతూ 'మా 'బ్యాడ్‌గాళ్స్ మూవీని ప్రేక్షకులు హిట్ చేశారు. మా నమ్మకం నిజమైంది. గట్టి పోటీలోనూ హిట్ కొట్టాం' అని అన్నారు.

హారర్‌తో ఆహ్వానం



ప్రస్తుతం హారర్ చిత్రాలకు ఆదరణ లభిస్తుండంతో ఉత్కంఠభరితమైన కథను రూపొందించిన చిత్రం 'అమరావతికి ఆహ్వానం'. శివ కంఠంనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తర్, సుప్రిత తదితరులు నటించిన ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతరం కార్యక్రమాలు జరుగుతున్నాయి. జీవీకే దర్శకత్వం కేఎస్ శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

ఇల్లు వదిలి వెళ్లి.. ఇన్‌స్టా రీల్ చూసి తిరిగొచ్చి..

- హైదరాబాద్ వెళ్లిన బాలికలు క్షేమంగా ఇంటికి

రాజమహేంద్రవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు అమ్మాయిలదీ ఒకే ఊరు. చిన్ననాటి నుంచి కలిసిమెలసి పెరిగారు. కలిసే చదువుకున్నారు. అయితే పదో తరగతి తర్వాత వారి స్నేహానికి పెద్దలు అడ్డుచెప్పారు. కలవడానికి వీల్లేదంటూ షరతు విధించారు. దీంతో వారు తల్లిదండ్రులకూ దూరంగా ఎక్కడికైనా వెళ్లి కొన్నిరోజులు హాయిగా గడపాలనుకున్నారు. కొంత నగదు పోగేసి.. క్రిస్మస్ సందర్భంగా ముగ్గురూ కలిసి హైదరాబాద్ రైలెక్కారు. అయితే ట్రెయిన్‌లో బిడియంగా తిరుగుతున్న వారిని వీడియో తీసి ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. ఆ వీడియో అటు తిరిగి ఇటు తిరిగి ఆ బాలికల కంటపడంతో తెల్లారేసరికి ఇంటికి తిరిగొచ్చేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్న ముగ్గురు బాలికలు (16 ఏళ్లు) ఇళ్లు ఒకే ప్రాంతంలో ఉన్నాయి. పదో తరగతి తర్వాత వారిలో ఇద్దరు ఇంటర్‌లో చేరగా.. ఒక బాలిక చదువు ఆపేసింది. ఈ క్రమంలో ముగ్గురూ స్నేహంగా ఉండొద్దని ఇంట్లో అడ్డుచెప్పారు. అయితే క్రిస్మస్ సందర్భంగా కలుసుకున్న ఈ ముగ్గురూ బుధవారం రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు వెళ్లి హైదరాబాద్ వెళ్లే రైలు ఎక్కేశారు. పిల్లలు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు కంగారుపడి అదేరోజు రాత్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాలతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి గాలింపు మొదలుపెట్టాయి. అయితే వాళ్లు రైలులో ఉన్న సమయంలో ఓ యువకుడు వీడియో తీసి బాలికలు తప్పిపోయారంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. అది చక్కర్లు కొట్టి చివరికి బాలికలకు చేరింది. ఆ వీడియో చూసి తమను పోలీసులు పట్టుకుంటారని భావించారు. హైదరాబాద్‌లో షాపింగ్ చేసుకొని బట్టలు కొనుక్కున్నారు. గురువారం రాత్రి గౌతమి ఎక్స్‌ప్రెస్ ఎక్కి శుక్రవారం ఉదయం రాజమండ్రి చేరుకున్నారు. పోలీసులు వాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చి ఇళ్లకు పంపించారు.

కారులోనే శవమై..!

- 3-4 రోజులుగా దాని లోపలే కుళ్లుతూ..
- ఎస్వీయూ ప్రొఫెసర్ గుగ్లోత్ నాయక్ అనుమానాస్పద మృతి
- దుర్వాసన రావడంతో పోలీసులకు యాత్రికుల సమాచారం
- భార్యతో మనస్పర్థలు.. ఇటీవల ఎక్కువైన మద్యంపానం



తిరుపతి విశ్వవిద్యాలయాలు/నేరవిభాగం/మరిపెడ, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ఎంబీఏ విభాగ ప్రొఫెసర్ సర్దార్ గుగ్లోత్ నాయక్ (40) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అలిపిరి సమీపంలో డోర్లు లాక్ చేసిన కారులో ఆయన చనిపోయి ఉన్నారు. కారు నుంచి దుర్వాసన వస్తుండటంతో యాత్రికుల సమాచారంతో పోలీసులు కారు తలుపులు తీయగా.. ఆయన మృతి వెలుగు చూసింది. వర్సిటీ వర్గాలు, వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. గుగ్లోత్ నాయక్‌ది మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తాండా ధర్మారం. 2007లో ఎస్వీయూ ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. ఆయన భార్య మీనాభాయ్ చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలో టీచరుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలున్నాయి. ఇద్దరూ విడిగా ఉంటున్నారు. కొన్నాళ్లుగా గుగ్లోత్ నాయక్ బాగా మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. మూడు నెలల కిందట ఉద్యోగం నుంచి సస్పెండయ్యారు. ఇటీవల మద్యం తాగుడు ఎక్కువైనట్లు తెలిసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం అలిపిరి సమీపంలోని ఎస్వీ జూపార్కు రోడ్డులో కారు నుంచి దుర్వాసన వస్తున్నట్లు కొందరు యాత్రికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు వచ్చి కారు డోర్లు తీయగా.. అందులో గుగ్లోత్ నాయక్ మృతదేహం కనిపించింది. కారు డోర్లన్నీ లాక్ చేసి ఉన్నాయి. గుగ్లోత్ నాయక్ కారు వెనక సీట్లో పడుకుని ఉన్నట్లు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించారు. నివేదిక వస్తే.. మృతికి గల కారణం తెలిసే అవకాశం ఉంది. కారులో ఉన్న 10 జతల దుస్తులు, తినే ప్లేట్, మాత్రలు, సిరప్, రెండు మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేశారు. చొక్కా మాత్రమే వేసుకొని ఉన్న ఆయన.. బెడ్ షీట్ కప్పుకొని ఉన్నారు. చనిపోయి మూడు నాలుగు రోజులై ఉంటుందని పోలీసులు చెప్పారు. మృతుడి భార్య మీనాభాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. గుగ్లోత్ నాయక్ ఎలా చనిపోయారనే దానిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీ మోహన్ తెలిపారు. ప్రొఫెసర్ మృతి పట్ల ఎస్వీయూ వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో శుక్రవారం తరగతులు రద్దు చేశారు. నాయక్ తల్లి చనిపోగా తండ్రి ఉన్నారు. కొడుకు మృతితో ఆయన కన్నీటి పర్యంతమయ్యారు.

కిడ్నీ మార్పిడి పేరిట లక్ష వసూలు!

- విశాఖలో బెజవాడ వాసి అరెస్టు.. అతడిపై ఇప్పటివరకూ 33 కేసులు

మహారాణిపేట(విశాఖపట్నం) డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైద్యుడినంటూ కిడ్నీ బాధితుడి కుటుంబాన్ని మోసగించిన వ్యక్తిని విశాఖ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ మణికంఠ చందోలు కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మోక్షిత్ రామ్(5)కు కిడ్నీ సమస్య తలెత్తింది. కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు సూచించడంతో తల్లిదండ్రులు ఆర్థిక సహాయం కోరుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో పత్రికా ప్రకటన ఇచ్చారు. విజయవాడ కరకట్ట ప్రాంతానికి ఇమంది జ్యోతి శివశ్రీ(37) ఆ ప్రకటన చదివి, అందులో ఉన్న నంబర్‌కు ఫోన్‌చేసి బాలుడి తండ్రి రామ్‌జీతో మాటలు కలిపాడు. వైద్యశాఖ నుంచి మాట్లాడుతున్నామని, అబ్బాయికి ఉచితంగా కిడ్నీ మార్పిడి చికిత్స చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని నమ్మబలికాడు. అనంతరం మరో నంబరు నుంచి ఫోన్‌చేసి కేజీహెచ్ నుంచి డాక్టర్ నరసింహాన్ని మాట్లాడుతున్నానని, ప్రభుత్వం నుంచి తమకు సమాచారం వచ్చిందని, బాలుడిని తీసుకురావాలని చెప్పాడు. కేజీహెచ్‌కు వెళ్లిన బాలుడి తల్లిదండ్రులను కలిసి, డాక్టర్ ప్రవీణ్‌గా పరిచయం చేసుకున్నాడు. రిపోర్టులు పరిశీలించి సాయంత్రంలోగా రూ.లక్ష సిద్ధం చేసుకోవాలని, వెంటనే శస్త్రచికిత్స చేద్దామని చెప్పాడు. వారివద్ద నుంచి రూ.లక్ష తీసుకుని ఉడాయించాడు. బాధితులు ఆస్పత్రిలో ఆరా తీశారు. ఆ పేరుతో డాక్టర్ ఎవరూ లేరని తేలడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం జ్యోతి శివశ్రీని అరెస్టు చేశారు. చీటింగ్, దొంగతనాలకు సంబంధించి అతనిపై 33 కేసులు ఉన్నాయని డీసీపీ వెల్లడించారు. అతడు బీటెక్ చదివినట్టు పోలీసులు చెబుతున్నారు.

'శ్రీవాణి' బిల్లులు ఏం చేద్దాం?



పెండింగ్‌లో ఉన్నవాటిని చెల్లించాలా? వద్దా?

- స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్న టీటీడీ
- జగన్ హయాంలో పనులపై అవినీతి ఆరోపణలు
- 104 పనులు రద్దు.. విజిలెన్స్ విచారణకు ఆదేశం
- గతేడాది సెప్టెంబరులో ప్రభుత్వానికి అందిన నివేదిక
- 15 నెలలు అవుతున్నా విడుదల కాని మార్గదర్శకాలు
- బిల్లుల కోసం ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో సతమతం
- రేపల్లె ఆలయ పనులపై హైకోర్టుకెళ్లిన కాంట్రాక్టర్

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

శ్రీవాణి నిధులతో చేపట్టిన ఆలయ నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలో, లేదో అర్థం కాక టీటీడీ మల్లగుల్లాలు పడుతోంది. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. అయితే ఈ అంశంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమర్పించిన విచారణ నివేదికపై నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. దీంతో బిల్లుల విషయమై టీటీడీ సతమతమవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో శ్రీవాణి ట్రస్టు నిధులు భారీ ఎత్తున దుర్వినియోగమయ్యాయని ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే గతేడాది ఆగస్టు 27న సీఎం చంద్రబాబు దీనిపై సమీక్షించి, శ్రీవాణి ట్రస్టు నిధులతో మంజూరు చేసిన పనుల్లో ఇంకా మొదలుపెట్టని 104 పనులను రద్దు చేయాలని ఆదేశించారు. అప్పటికే పూర్తయిన, పురోగతిలో ఉన్న 89 పనులను మాత్రమే ఆమోదించాలని ఆదేశించారు. శ్రీవాణి ట్రస్టు కార్యకలాపాలు, ఆ నిధులతో చేపట్టిన పనులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. గతేడాది ఆగస్టులో విచారణ చేపట్టిన విజిలెన్స్ సెప్టెంబరులోనే ప్రభుత్వానికి నివేదికను అందజేసింది.

రూ.10.58 కోట్ల బిల్లులు పెండింగ్

గత ప్రభుత్వంలో శ్రీవాణి ట్రస్టు నిధులతో టీటీడీ చేపట్టిన పనులకు రూ.4.05 కోట్లు, దేవదాయ శాఖ చేపట్టిన పనులకు రూ.5.15 కోట్లు, ఆలయాల కమిటీల ద్వారా చేపట్టిన పనులకు రూ.1.38కోట్లు మొత్తం కలిపి రూ.10.58 కోట్ల మేరకు బిల్లులు చెల్లించాల్సి వుంది. విజిలెన్స్ నివేదిక అందిన తర్వాత నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతో గతేడాది సెప్టెంబరు నుంచి టీటీడీ ఈ బిల్లులు విడుదల చేయలేదు. శ్రీవాణి ట్రస్టుపై విచారణ నివేదిక ప్రతి ఇంతవరకూ టీటీడీకి అందలేదు. ఈ విషయంపై ప్రభుత్వం కూడా ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. కాంట్రాక్టర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో గతేడాది డిసెంబరు 24న జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో దీనిపై చర్చించారు. నివేదిక త్వరగా తెప్పించుకుని అందులో తేలిన వాస్తవాలు, సిఫారసులకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని పాలకవర్గం నిర్ణయించింది. విచారణ నివేదికను అందజేయాలంటూ రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సీవీఎస్‌వో ఈ ఏడాది ఫిబ్రవరి 27న లేఖ రాశారు. ఈలోపు కాంట్రాక్టర్ల ఒత్తిడి మరింత పెరగడంతో బిల్లుల చెల్లింపునకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జూన్ 10న దేవదాయ శాఖ కార్యదర్శికి టీటీడీ లేఖ రాసింది. అయితే విచారణ నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేశామని, నేరుగా ఆయనతోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని ఆగస్టు 6న విజిలెన్స్ డీజీ టీటీడీకి సమాధానం ఇచ్చారు.

ప్రజాప్రతినిధుల అభ్యర్థనలు

పూర్తయిన పనులకు బిల్లులు చెల్లించాలని ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు టీటీడీని కోరుతున్నారు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీకి రూ.60లక్షలు విడుదల చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. పుంగనూరు నియోజకవర్గం సదుం మండలం ఎగువ జాంద్రపేటలో చౌడేశ్వరీ అమ్మవారి ఆలయ పనులకు సంబంధించి రూ.14.50 లక్షల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని అక్కడి టీడీపీ ఇన్‌చార్జి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చల్లా రామచంద్రారెడ్డి కోరారు. జీడీనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో వినాయకస్వామి ఆలయ పనులకు రూ.10 లక్షల కోసం అక్కడి ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎ.థామస్, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మన్నవ గ్రామంలో సోమేశ్వరాలయ పనులకు రూ.25 లక్షల కోసం ఎమ్మెల్యే ధూళిపాళ నరేంద్ర, అనంతపురం జిల్లా రాయదుర్గంలో ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ పనులకు సంబంధించి రూ.11లక్షల బిల్లుల కోసం అక్కడి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కె.శ్రీనివాసులు టీటీడీని అభ్యర్థిస్తున్నారు. అలాగే నంద్యాలలోని సర్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ పనులకు రూ.30లక్షలు పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆ జిల్లా ఎండోమెంట్ అధికారి కోరుతున్నారు. ఇక గుంటూరు జిల్లా రేపల్లెలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పునరుద్ధరణ పనులు చేసిన శ్రీ వెంకట దుర్గా ఇండస్ట్రీస్ యజమాని మట్టా శ్రీనివాసరావు తమ సంస్థకు టీటీడీ నుంచి రూ.18.75 లక్షల బిల్లులు విడుదలయ్యేలా ఆదేశించాలని కోరుతూ ఈ ఏడాది సెప్టెంబరు 16న హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఒత్తిళ్లు పెరుగుతుండటంతో ఈ నెల 16న జరిగిన బోర్డు సమావేశంలో బిల్లుల చెల్లింపు అంశం చర్చకు వచ్చింది. విజిలెన్స్ నివేదిక ప్రతిని టీటీడీకి అందజేయాలని, పెండింగ్ బిల్లుల విషయంలో తదుపరి చర్యలపై మార్గదర్శకాలు జారీ చేయాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయాలని బోర్డు నిర్ణయించింది.

రాష్ట్రమంతా రెవెన్యూ క్లినిక్‌లు

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వద్ద సమావేశాలు జరిగాయి. రెవెన్యూ డెస్క్‌లపై ఇప్పటికే స్పష్టత రాగా.. ఇప్పుడు రెవెన్యూ క్లినిక్‌ల అమలుపై కలెక్టర్లకు సీసీఎల్ఏ మార్గదర్శకాలు ఇచ్చారు.



సీసీఎల్ఏ జయలక్ష్మి

ఏమిటీ రెవెన్యూ క్లినిక్..?

పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రజల నుంచి వస్తున్న భూసంబంధిత సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి కలెక్టరేట్ పరిధిలో రెవెన్యూ క్లినిక్ పేరిట గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నారు. ఈ అంశాన్ని 'ఆంధ్రజ్యోతి' ప్రముఖంగా వెలుగులోకి తీసుకొచ్చింది. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలోనూ చర్చకు రాగా.. ఈ విధానం బాగుందని సీఎం కితాబిచ్చారు. మిగతా జిల్లాలు అనుసరించవచ్చేమో చూడాలని సూచించారు. ఈ నేపథ్యంలో మన్యం మోడల్‌ను రాష్ట్రమంతా అమలు చేయాలని ఇప్పుడు రెవెన్యూశాఖ నిర్ణయించింది. దీని ప్రకారం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ నిర్వహిస్తారు. భూసమస్యలున్న రైతులు, పౌరులు నేరుగా ఇక్కడకు వెళ్లి రెవెన్యూ డెస్క్‌లోని అధికారిని కలిసి పిటిషన్ సమర్పించాలి ఆ తర్వాత దాని పరిష్కారంపై కార్యాచరణ ఎలా ఉండాలో సీసీఎల్ఏ మార్గదర్శకాల్లో విశదీకరించారు. వీటికి విరుద్ధంగా వ్యవహరిస్తే ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరించారు. రెవెన్యూ క్లినిక్‌ల నిర్వహణను ప్రభుత్వం క్రమం తప్పకుండా పరిశీలిస్తుందని, మార్గదర్శకాలను పాటించనివారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రెవెన్యూ క్లినిక్ మార్గదర్శకాలివీ..

- ప్రతి సోమవారం ప్రజల నుంచి పిటిషన్లు తీసుకుంటారు కాబట్టి ఆ రోజున రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలి. గ్రామ అడంగల్, 10(1) రికార్డు, ఎఫ్ఎంఏ, వెబ్‌ల్యాండ్, ఓఆర్‌సీఎంఎస్ ఇతర రికార్డులు (ఫిజికల్, ఆన్‌లైన్) సిద్ధంగా పెట్టుకోవాలి.
- అంశాల వారీగా.. అంటే ఆర్ఓఆర్ సంబంధిత, పాస్‌పుస్తకం, ఆర్‌వోఎఫ్ఆర్. ఏజెన్సీ భూములు, రీసర్వే పేరిట రెవెన్యూ టేబుళ్లను ఏర్పాటు చేయాలి.
- రెవెన్యూ క్లినిక్‌లో ప్రత్యేకంగా రిసెప్షన్ కేంద్రం ఏర్పాటు చేయాలి. పిటిషనర్ ఎందుకొచ్చారు? ఆ పనేమిటో కనుక్కోవాలి. సమస్య పరిష్కారానికి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకొచ్చారా? తీసుకురావలసిన పేపర్లు ఉన్నాయేమో పరిశీలించాలి. అవసరమైన డాక్యుమెంట్లపై స్పష్టత ఇవ్వాలి. అన్నీ ఉంటే అక్కడ ఏ రెవెన్యూ టేబుల్ వద్దకు వెళ్లాలో సూచించాలి.
- ఫిర్యాదు రాగానే అందులోని సర్వే నంబర్ ఆధారంగా భూమి వివరాలు తీసుకోవాలి. ఆ వివరాలను నిర్దేశించే ఎస్ఎఫ్ఏ, ఎస్ఎల్ఆర్, ఇంకా ఎఫ్ఎంబీ, ఎల్‌పీఎమ్, వెబ్‌ల్యాండ్, ఈసీ, ఇతర రికార్డులను ఆన్‌లైన్‌లో సిద్ధంగా ఉంచి పరిశీలించాలి.
- అన్నీ పరిశీలించాక ఆ పిటిషన్‌లో పేర్కొన్న భూమి స్వభావం, సమస్య, దాని పరిష్కారంపై చేపట్టే కార్యాచరణ(ఏటీటీ)తో కూడిన రిపోర్టును ఫిర్యాదుదారుకు అందజేయాలి.
- ఒకవేళ పిటిషన్‌లోని అంశం సివిల్ వివాదం కిందకు వస్తే.. కోర్టుకు వెళ్లి పరిష్కారం పొందాలని సూచించాలి. అదే విషయాన్ని రిపోర్టులో పొందుపరచాలి.
- ఫిర్యాదులోని అంశాలపై తహశీల్దార్ స్పందన తీసుకుంటారు. అవసరాన్ని బట్టి క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బందిని ఫోన్ ద్వారా సంప్రదిస్తారు.
- పిటిషన్ ఆర్‌వోఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్)కు సంబంధించినదైతే వెంటనే తహశీల్దార్ లేదంటే ఆర్డీవోకు రిఫర్ చేస్తారు. ఓఆర్‌సీఎంఎస్ (సాఫ్ట్‌వేర్)లో వెంటనే నోటీసులు తయారుచేసి బాధ్యులకు పంపించాలి.
- మ్యుటేషన్, ఎఫ్ఎంబీ, 1బీ రికార్డులకు సంబంధించిన సేవలను కోరితే వెంటనే మీ-సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించాలి.
- ఏజెన్సీలోని భూముల వివాదం, ఇంకా అటవీ భూములపై పట్టా, రీ సర్వే, ఎఫ్‌లైన్, సబ్ డివిజన్ వంటి అంశాలపై చట్టప్రకారం పరిష్కారం ఉండేలా కార్యాచరణ నివేదికలో పొందుపరచాలి. అవసరాన్ని బట్టి క్షేత్ర స్థాయి సిబ్బందితో పునఃపరిశీలన, నిర్ధారణలు చేయించాలి.
- క్లినిక్‌కు వచ్చే పిటిషన్లలో తీవ్ర అంశాలు, న్యాయపరమైన వ్యవహారాలపై జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్ స్థాయిలో చర్చలు జరిపి పరిష్కారం చూపాలి.
- ప్రజా పిటిషన్లపై ప్రతి రోజూ మధ్యాహ్నం సబ్‌కలెక్టర్ లేదా ఆర్డీవోలు ఏటీటీ (కార్యాచరణ నివేదిక) నోట్‌లపై సమీక్ష చేయాలి.
- ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్ రెవెన్యూ క్లినిక్ రిపోర్టులపై సమీక్ష చేయాలి.
- ప్రతి పిటిషన్‌పై సరైన చర్య ఉన్నట్లు నిర్ధారించుకున్నాకే దానిని ముగించాలి. అంటే అది పరిష్కారమైందని రికార్డుచేయాలి. అదే విషయాన్ని పిటిషనర్‌కు తెలియజేయాలి. ఆ తర్వాత ప్రజా స్పందన తీసుకోవాలి.
- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తహశీల్దార్లదే ప్రాథమిక బాధ్యత. కలెక్టర్, జేసీ, సబ్‌కలెక్టర్, ఆర్డీవోలు ఏటీటీ, ఏటీఆర్‌లపై నిరంతరం సమీక్ష నిర్వహించాలి. ప్రతి పిటిషన్‌ను సరిగ్గా పరిష్కరించారో లేదో పరిశీలించాలి.
- ఇందులో పాల్గొనే ప్రతి అధికారీ ఈ మార్గదర్శకాలను త్రికరణ శుద్ధిగా పాటించాలి.

భార్యకు వేధింపులు..
తుపాకుల ముఠా గుట్టురట్టు

- 5 నాటు తుపాకులు, ఒక తల్వార్ 7 మ్యాగజైన్లు, 30 బుల్లెట్లు స్వాధీనం
- అనంత పోలీసుల అదుపులో జిమ్ నిర్వాహకుడు
- ఇద్దరు మధ్యప్రదేశ్ వాసులు కూడా



స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న అనంతపురం ఎస్పీ జగదీశ్

అనంతపురం క్రైం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకులను విక్రయించే ముగ్గురు సభ్యుల ముఠాను అనంతపురం జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితులలో అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి(32)తో పాటు మధ్యప్రదేశ్‌కు చెందిన రోహిత్ పర్మారీ(24), శివం సింగ్ పరిహార్(25) ఉన్నారు. వీరి నుంచి ఐదు నాటు తుపాకులు, 7 మ్యాగజైన్లు, 30 బుల్లెట్లు, 3 బుల్లెట్ షెల్స్, ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీశ్ ఈ ముఠా వివరాలను వెల్లడించారు. అనంతపురంలో నల్లి రాజశేఖర్ రెడ్డి ఓ జిమ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. అతడి వేధింపులు భరించలేక భార్య ఈ నెల 12న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను ఇంట్లోకి రానివ్వడం లేదని, దుస్తులు, తన వస్తువులు తెచ్చుకునేందుకు తోడుగా రావాలని పోలీసులను కోరారు. దీంతో ఆమెతో కలిసి ఇంటికి వెళ్లిన పోలీసులకు ఓ తుపాకీ లభించింది. దీంతో రాజశేఖర్ రెడ్డిపై టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. తుపాకీని మధ్యప్రదేశ్‌లో కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో ముఠాను పట్టుకునేందుకు సీఐలు శ్రీకాంత్ యాదవ్, రాజేంద్రప్రసాద్ యాదవ్, సీసీఎస్ సీఐ శేషగిరి, ఇద్దరు ఎస్ఐలతో ఎస్పీ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం మధ్యప్రదేశ్‌లోని మొరేనా జిల్లాకు వెళ్లి రోహిత్ పర్మారీ, శివం సింగ్ పరిహార్‌ను అరెస్టు చేసింది.

జలంధర్‌లో పరిచయం

ముఠాలో రోహిత్ పర్మారీ అక్రమ ఆయుధాలు కొనుగోలు చేసి వాటి పనితీరును పరీక్షిస్తే.. శివం సింగ్ పరిహార్ వాటిని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించి అమ్ముతుంటాడు. వీరిద్దరూ కలిసి గ్వాలియర్‌లో తక్కువ ధరకు తుపాకులు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తుంటారు. జిమ్ నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి పంజాబ్‌లోని జలంధర్‌కు జిమ్ పరికరాలు కొనేందుకు వెళ్లిన సమయంలో మూడేళ్ల క్రితం వారితో పరిచయం ఏర్పడింది. జిమ్‌కు వచ్చేవారు తనను ఇబ్బంది పెడితే బెదిరించేందుకోసమని వారి వద్ద తుపాకీ కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో తుపాకుల వ్యాపారంపై రాజశేఖర్ రెడ్డి మొగ్గు చూపాడు. ముగ్గురూ కలిసి తుపాకులు కొని అమ్మాలని నిర్ణయించారు. మధ్యప్రదేశ్‌లో రూ.40 వేలు నుంచి రూ.50 వేలకు తుపాకులు కొని, ఏపీలో రూ.20 వేల నుంచి రూ.30 వేల లాభానికి అమ్మాలని భావించారు. రాజశేఖర్ రెడ్డి భార్య ఫిర్యాదుతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది.



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో డీఎస్పీ శ్రీనివాసరావు బృందం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి.. గంజాయి డాన్‌గా!

- అనకాపల్లి జిల్లాలో మాజీ మహిళా టెకీ సహా 8 మంది అరెస్టు

నర్సీపట్నం అర్బన్/నాతవరం డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో వచ్చే జీతం చాల్లేదో ఏమో.. గంజాయి డాన్‌గా అవతరించింది ఓ మహిళా మాజీ టెకీ! శుక్రవారం అనకాపల్లి జిల్లా నాతవరం పోలీసులు అరెస్టు ఎనిమిది మందిలో ఆమె కూడా ఉంది. నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం ఈ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. నర్సీపట్నం రూరల్, నాతవరం పోలీసులు శృంగవరం సమీపంలో శుక్రవారం వాహనాల తనిఖీల్లో భాగంగా ఒక కారును సోదా చేయగా, 74 కిలోల గంజాయి లభించింది. అందులో ఉన్న నలుగురితో పాటు కారు ముందు, వెనుక ద్విచక్ర వాహనాలపై వస్తున్న నలుగురిని పట్టుకుని విచారించి, వారిని కూడా అరెస్టు చేశారు. నిందితుల్లో ముగ్గురు మహిళలు ఉండగా, ఇందులో గాదె రేణుక (28)ది విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మోదుగులపేట గ్రామం. బీటెక్ చదువుకున్న ఆమె గతంలో ఏడాదిపాటు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసింది. ఆ తర్వాత సులువుగా డబ్బు సంపాదించాలంటే గంజాయి వ్యాపారమే మేలని భావించి కొంతమందితో ముఠా ఏర్పాటు చేసుకుని గంజాయి వ్యాపారం చేస్తోంది. ఈ క్రమంలో ఒకడందం లలితకుమారి (అల్లూరి జిల్లా చింతపల్లి), పొన్నగంటి మణికుమారి (పెదవలస)తో కలిసి ఆమె ఏడాది కాలంగా నర్సీపట్నం శారదానగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని గంజాయి వ్యాపారం చేస్తోంది. గాదె రేణుక పాత నేరస్థురాలని, ఆమెపై నాలుగు గంజాయి కేసులు ఉన్నాయని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. మిగిలిన నిందితుల్లో సూర్య కాళిదాసు, మదన్‌కుమార్, నాదిముత్తు (తమిళనాడు), ఎ.ప్రసాద్ (అనకాపల్లి జిల్లా రావికమతం మండలం కొత్తకోట), అండెంగల రవికుమార్ (అల్లూరి జిల్లా పాడేరు) ఉన్నారన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.18 లక్షలు ఉంటుందని చెప్పారు.

యాత్ర నుంచి తిరిగొస్తూ.. మృత్యు ఒడికి..

- రెండు [illegible] ప్రమాదాల్లో 8 [illegible]ంది దుర్మరణం
- మృతులంతా తెలంగాణవాసులు
- నంద్యాల జిల్లాలో డివైడర్‌ను దాటి.. బస్సును ఢీకొట్టిన కారు
- ఐదుగురు దుర్మరణం.. మృతుల్లో తండ్రీకొడుకు
- గుంటూరులో రోడ్డు పక్క ఆగిఉన్న కారును ఢీకొట్టిన ట్రావెల్ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి
- బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే దుర్ఘటనకు కారణం



గుంటూరులో ప్రమాదానికి కారణమైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ వద్ద రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు, బస్సు

ఆళ్లగడ్డ, గుంటూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణకు చెందిన ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన ప్రమాదంలో తండ్రీకొడుకులు మృతి చెందగా, గుంటూరు జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కన్నుమూశారు. ఆళ్లగడ్డ పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన గుండేరావు కులకర్ణి (46) టూరిస్టులకు క్యాటరింగ్ చేస్తూ వారి బస్సుల వెంట కారులో వెళ్లి వారికి వంట చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు బస్సు యాత్రికులతో క్యాటరింగ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. వారి వెంట ఈనెల 11న హైదరాబాద్ నుంచి బయలు దేరి శబరిమలై, మైసూర్, కాణిపాకం, తిరుపతి, ఒంటిమిట్ట ప్రాంతాలను సందర్శించారు. గురువారం తిరుపతి నుంచి హైదరాబాద్‌కు తిరిగొస్తుండగా వారు ప్రయాణిస్తున్న టొయోటా క్వాలిస్ వాహనం.. ఆళ్లగడ్డ .. నల్లగట్ల సమీపంలో అతి వేగంగా ప్రయాణిస్తూ.. డివైడర్‌ను ఢీకొని అవతలి రోడ్డుపై ఎదురుగా వస్తున్న సీజేఆర్ ప్రైవేటు బస్సును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శివసాయి తండ్రి గుండేరావు కులకర్ణి, శివసాయి స్నేహితుడు శ్రావణ్(21), గుండేరావు సహాయకులు ఇటికాడి నరసింహులు(30), సిద్ధప్ప(50)అక్కడికక్కడే మృతి చెందారు. శివసాయితో పాటు, తీవ్రంగా గాయపడిన గుండేరావు మరో కుమారుడు సిద్ధార్థ కులకర్ణి(27)ని పోలీసులు హుటాహుటిన నంద్యాల ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సిద్ధార్థ మృతి చెందాడు. కారులో ఇరుక్కున్న మృతదేహాలను క్రేన్ సాయంతో బయటికి తీసి ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనాస్థలాన్ని డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ రమణ, ఎస్ఐ వరప్రసాద్ పరిశీలించి కేసు నమోదు చేశారు. శివసాయితోపాటు వెళ్లిన అతడి స్నేహితుడు శ్రావణ్ కూడా ఈ ఘటనలో దుర్మరణం చెందడంతో.. అతడి తల్లిదండ్రుల శోకానికి అంతులేకుండా పోయింది. కారు అతివేగంతోపాటు, కారు నడుపుతున్న శివసాయి నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

మనవడి పుట్టెంటుక్రలు తీసి వస్తూ..

గుంటూరు శివారు 16వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు ఎస్ మండలం, మిడతనపల్లికి చెందిన కుంచనపల్లి వెంకటయ్య (62), ఆయన భార్య కుంచనపల్లి సుశీల(55), వారి అల్లుడు వరసైన నవీలా మహేష్ (27) అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటయ్య కుమారుడు కుంచనపల్లి మధు వంట మాస్టర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య మనీషా, జ్ఞానేశ్వర్(4), వర్షిత్ (11నెలలు) సంతానం ఉన్నారు. వర్షిత్ పుట్టెంట్రుకల మొక్కు తీర్చేందుకు ఈనెల 23న తిరుమల వెళ్లారు. 25న తిరుగు ప్రయాణమయ్యారు. వాస్తవానికి వారు ఒంగోలు మీదుగా అద్దంకి వచ్చి అక్కడి నుంచి నార్కెట్‌పల్లి హైవే మీదుగా తెలంగాణ వెళ్లాల్సి ఉన్నా, కారుకు గ్యాస్ ఫిల్లింగ్ కోసం మార్టూరు వరకు రావాల్సి వచ్చింది. దీంతో విజయవాడ మీదుగా వెళదామనుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 4.30 గంటల సమయానికి గుంటూరు సమీపంలోని అంకిరెడ్డిపాలెం వద్దకు రాగానే.. కారు నడుపుతున్న మహేష్‌కు నిద్ర వస్తుండడంతో ముఖం కడుక్కుందామని, 16వ నంబర్ జాతీయ రహదారిపై రోడ్డు మార్జిన్‌లో కారు ఆపారు. ఇంతలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన వీఆర్‌సీఆర్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్ బస్సు కారును బలంగా ఢీ కొట్టింది. కారు డ్రైవింగ్ సీట్లో ఉన్న మహేష్, వెంకటయ్య, సుశీల అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ఉన్న మధు, ఆయన మామ మల్సూర్, భార్య మనీషా, ఇరువురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. తిరుమలలో తన ఒడిలో కూర్చోబెట్టుకుని చిన్నారి వర్షిత్‌కు పుట్టు వెంట్రుకలు తీయించిన మేనమామ మహేష్ గంటల వ్యవధిలోనే మృతి చెందడంతో బంధువులు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద తీవ్రతను పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



తిరుపతి జిల్లా కావాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించిన టీడీపీ నాయకులు

మా మూడు మండలాలను నెల్లూరుతోనే ఉంచాలి

- మంత్రి ఆనంకు జేఏసీ విజ్ఞప్తి
- తిరుపతి జిల్లానే ముద్దంటూ రోడ్డెక్కిన ఓ టీడీపీ వర్గం

నెల్లూరు(వైద్యం), రాపూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తమను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలంటూ 3 మండలాల ప్రజలు చేస్తున్న ఆందోళన తీవ్రమవుతోంది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు టీడీపీ ప్రజాప్రతినిధులు పలువురు ప్రజాందోళనకు మద్దతుగా నిలిచారు. రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లలోనే ఉంచాలని తిరుపతి జిల్లాలో కలపవద్దంటూ జేఏసీ నేతలు మంత్రి ఆనంకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన ఆ పత్రాలను టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రకు అందించి ప్రజల విజ్ఞప్తిని వివరించారు. విషయాన్ని ఇప్పటికే సీఎం చంద్రబాబు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. కాగా శుక్రవారం జరిగిన పరిణామాలు ప్రజలను ఉలికిపాటుకు గురిచేశాయి. టీడీపీలోని ఒక వర్గం కార్యకర్తలు, స్థానికులతో కలసి తమను తిరుపతి జిల్లలోనే ఉంచాలంటూ గళమెత్తారు. రాపూరు ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి, 'నెల్లూరు జిల్లా వద్దు- తిరుపతి జిల్లా ముద్దు' అంటూ నినాదాలు చేశారు.

జగనే నా టార్గెట్



- నేను బరిలో పందెం కోడిలాంటివాడిని
- చావుకు తెగించి ఒంటరి పోరాటం చేశా
- ఎవరి మద్దతు అవసరం లేదు: రఘురామ

కాళ్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ జగన్మోహన్ రెడ్డే నా టార్గెట్, నాకు ఎవరి మద్దతు అవసరం లేదు. ఒంటరి పోరాటమే నాకు ఇష్టం' అని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రామకృష్ణ రాజు అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను నిర్మించిన 180 మెగావాట్ ప్రాజెక్టు విలువ రూ.2వేల కోట్లు ఉంటుందని చెప్పారు. దేశంలోనే ఇంత తక్కువ ఖరీదైన ప్రాజెక్టును ఇప్పటి వరకు ఎవరూ నిర్మించలేదని తెలిపారు. జగన్ మీడియా తనపై అబద్ధపు రాతలు రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నువ్వు నాపై కావాలని పెట్టించిన 3 కేసుల ద్వారా నన్ను 420గా చిత్రీకరించి నీ పత్రికలో రాయిస్తున్నావు. డిప్యూటీ స్పీకర్ పదవిని బర్తరఫ్ చేయాలని నీ వాళ్లతో మాట్లాడిస్తున్నావు' అంటూ జగన్‌పై మండిపడ్డారు. 11 కేసుల్లో 420గా ఉన్న నువ్వు సీఎంగా పని చేయలేదా అని నిలదీశారు. పోరాటం తనకు కొత్తేమీ కాదన్నారు. తాను బరిలో పందెంకోడి లాంటివాడినని, చావుకు తెగించి జగన్‌తో పోరాడానని పేర్కొన్నారు. త్వరలోనే నిర్దోషిగా తిరిగి వస్తానని చెప్పారు. జగన్‌కు ఒక మతం సపోర్టుగా ఉండొచ్చని, తనకు సమాజంలో ఎంతోమంది మద్దతుగా ఉన్నారని తెలిపారు. తింగరి రాతలతో తన అభిమానుల మనోభావాలు దెబ్బతీయలేరని, జగన్ తనను చంపాలని చూసినా భయపడలేదని, ఉడత ఊపులకు భయపడే ప్రసక్తే లేదని రఘురామ స్పష్టం చేశారు. జగన్‌పై ఒంటరిగా పోరాటం ప్రారంభించినప్పుడు తనవెనుక ఎవరూ లేరన్నారు. రెండేళ్లు ఒంటరి పోరాటం చేశానని, ఇప్పుడు తనకు ఎవ్వరి సహకారం అక్కర్లేదని చెప్పారు. తాను పెట్టిన కేసు విచారణ త్వరగా పూర్తిచేస్తే సంతోషిస్తానని, ప్రభుత్వం ఈ విషయంలో సహకరిస్తుందని భావిస్తున్నానని అన్నారు. ఆ సమయం కోసమే ఎదురు చూస్తున్నానని చెప్పారు. ఉండి నియోజకవర్గంలో అందరికీ తాగు, సాగునీరు అందిస్తానని ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి కాలువ గట్లపై ఉన్న కట్టడాలను తొలగించామని తెలిపారు. దీనికి చర్చిలను మాత్రమే తొలగిస్తున్నారని కొంత మంది సామాజిక మాధ్యమాల ద్వారా అల్లరి చేయడంలో వైసీపీ అధినేత పాత్ర ఉందని ఆరోపించారు. కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా వార్తలు రాయించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. తన పోరాటంలో నిజాయితీ ఉందని, తాను ఏ తప్పు చేయలేదని రఘురామ స్పష్టం చేశారు.

నాలుగేళ్లలో సంపూర్ణ అక్షరాస్యత

- ఈ జాబితాలో అట్టడుగున ఆంధ్రప్రదేశ్
- రాష్ట్రంలో 81 లక్షల మంది నిరక్షరాస్యులు
- 'అక్షరాంధ్ర'తో ఈ ఏడాది 25 లక్షల మందికి శిక్షణ
- వయోజనులకు పుస్తకాలు, ఈ-కంటెంట్ పంపిణీ
- సెప్టెంబరు, మార్చిలో పరీక్షలు.. సర్టిఫికెట్ల జారీ

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్షరాస్యతలో అట్టడుగున ఉన్న ఏపీని సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం 'అక్షరాంధ్ర'కు శ్రీకారం చుట్టింది. వయోజన విద్య కోసం ఇటీవల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ విధంగా వచ్చే నాలుగేళ్లలో మొత్తం 81లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి సంపూర్ణ అక్షరాస్యత సాధించే దిశగా అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం తాజా అంచనాల ప్రకారం అక్షరాస్యతలో ఏపీ చిట్టచివరన నిలిచింది. రాష్ట్రంలో 72.6 శాతం మంది మాత్రమే అక్షరాస్యులు ఉన్నారు. 81 లక్షల మందికి చదవడం, రాయడం తెలియదు. అంకెలపై అవగాహన లేదు. బిహార్ (74.3%), మధ్యప్రదేశ్ (75.2%), రాజస్థాన్ (75.8%), జార్ఖండ్ (76.7%) అక్షరాస్యత రేటులో మనకంటే ముందున్నాయి. ఈ జాబితాలో 98.2 శాతంతో మిజోరం అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో లక్షద్వీప్, త్రిపుర, కేరళ, నాగాలాండ్ రాష్ట్రాలున్నాయి. పొరుగున ఉన్న తెలంగాణలో అక్షరాస్యత రేటు 76.9 శాతంగా ఉంది. ఏపీ అంటే చదువులో టాప్‌లో ఉంటారని దేశవ్యాప్తంగా ఒక భావన ఉంది. కొన్నేళ్లుగా జేఈఈ, సివిల్స్ ఫలితాల్లో తెలుగు విద్యార్థులే ఎక్కువగా ఉంటున్నారు. అలాంటిది ఏపీలోనే అతి తక్కువ అక్షరాస్యత ఉండటం గమనార్హం.

ఏటా రెండుసార్లు పరీక్షలు

అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా 15 నుంచి 59 ఏళ్ల వయసున్న వారికి చదవడం, రాయడం, చిన్నపాటి లెక్కలను నేర్పుతారు. స్థానికంగా ఉన్న టెన్త్, ఆపై తరగతుల విద్యార్థులు, స్వయం సహాయక బృందాల్లో చదువుకున్న వారిని ఇన్‌స్ట్రక్టర్లుగా నియమిస్తారు. వర్ణమాల, సరళమైన పదాలు, వాక్యాలు నేర్పిస్తారు. వెయ్యి వరకు అంకెలు, కూడికలు, తీసివేతలు, భాగాహారాలు, కిలోలు, లీటర్లు, మీటర్ల వంటి కొలతలతో పాటు గడియారం, క్యాలెండర్లను చూసి అర్థం చేసుకోవడం, బస్టాండ్ల లాంటి ప్రాంతాల్లో డిజిటల్ అంకెలను గుర్తించడంపై అవగాహన కల్పిస్తారు. బ్యాంకుల్లో డిపాజిట్, విత్‌డ్రా ఫాంలు నింపడం వరకు శిక్షణ ఇస్తారు. వంద గంటల పాటు పాఠాలు చెప్పిన అనంతరం ప్రతి సంవత్సరం సెప్టెంబరు, మార్చిలో పరీక్షలు నిర్వహించి అక్షరాస్యులను ప్రకటిస్తారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు కూడా అందజేస్తారు.

2029 నాటికి వంద శాతం

ఈ ఏడాది 25లక్షలు, 2026-27లో 25లక్షలు, 2027-28లో 25లక్షలు, 2028-29లో 6లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వీరిని తొలుత రిజిస్టర్ చేసి గ్రూపులుగా ఏర్పాటుచేస్తారు. వారికి ట్రైనర్లను నియమిస్తారు. వయోజనులకు పుస్తకాలు, ఈ-కంటెంట్ పంపిణీ చేస్తారు. శిక్షకుల ద్వారా రోజూ సాయంత్రం వేళల్లో తరగతులు నిర్వహించి పాఠాలు చెప్తారు. ప్రతి సంవత్సరం ఎక్కువ మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దిన శిక్షకులకు ప్రశంసా పత్రాలు ఇస్తారు.



తిరుపతిలో ప్రారంభమైన భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు

దేశానికి జనాభాయే ఆస్తి

(మొదటి పేజీ తరువాయి)

సమ్మేళనాన్ని ఆయన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేందర్ సింగ్‌తో కలసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు ప్రసంగిస్తూ, మన కుటుంబ వ్యవస్థ అందరికీ భద్రత కల్పించేలా ఉంటుందని కొనియాడారు. మన కుటుంబ విలువల పట్ల గర్విస్తున్నానన్నారు. "దేశంలో ఇప్పుడు జనాభాయే ఆస్తిగా మారింది. వృద్ధుల జనాభా పెరిగిపోయి పలు దేశాలు ఇబ్బందులు పడుతుండగా, భారత్‌లో మాత్రం యువజనం అధికంగా ఉంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో సుమారు ఐదు కోట్ల మంది భారతీయులు ఉన్నారు. ఏ దేశంలోనైనా తలసరి ఆదాయం మనవారికే అధికంగా ఉంటోంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గుముఖం పడుతోంది. కానీ, భారత్‌లో మాత్రం 14.8 శాతం పెరిగింది." అని చంద్రబాబు తెలిపారు. మానవ వనరుల లోటును పూడ్చుకోవడానికి దేశంలో ప్రతి జంటా ముగ్గురు పిల్లల్ని కనాలన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

"మన యువతకు, పిల్లలకు స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్‌లకు బదులుగా మన పురాణ పురుషుల గురించి చెప్పాలి. స్పైడర్‌మ్యాన్ కంటే హనుమంతుడు బలవంతుడు. బ్యాట్‌మ్యాన్ కంటే అర్జునుడు గొప్ప యోధుడు. హాలీవుడ్ హీరోల కంటే మన పురాణ పురుషులు గొప్పవారు. ఈ విషయాలు పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే కృష్ణుడి మహిమల గురించి, శివుడి మహత్తుల గురించి, రాముడికి మించిన రాజు లేడనే దాని గురించి చెప్పాల్సి ఉంది. హాలీవుడ్ సినిమా అవతార్ కంటే కూడా మహాభారతం, రామాయణం చాలా గొప్పవని చెప్పాలి. అదే సమయంలో బకాసురుడు, కంసరాజు వంటి వారి గురించి కూడా చెప్పాలి. సమాజంలో మంచి చెడుల వ్యత్యాసం తెలియాలంటే ఇవన్నీ చెప్పాలి."



ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, సీఎం చంద్రబాబు కరచాలనం

ప్రపంచానికి జ్ఞానం పంచాం

"జ్ఞానం, విజ్ఞానం మన దేశానికి కొత్త కావు. ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించి పరిఢవిల్లింది. 4500 ఏళ్లకు ముందే విలసిల్లిన హరప్పా, మొహంజదారో నాగరికతలు, అప్పట్లోనే మన అర్బన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ పాటవాలను చాటి చెప్పాయి. 2900 ఏళ్ల క్రితమే ఇక్కడ యోగను ఆచరించాం. ఇప్పుడు 150 దేశాలు యోగాను ఆచరిస్తున్నాయి. 2600ఏళ్ల మునుపే ఆయుర్వేదం ద్వారా వైద్యసేవలు అందించాం. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసుకుని ఆధునిక విద్యను అందించాం. సున్నాను కనుగొన్నదీ, చదరంగం క్రీడను ప్రపంచానికి అందించిందీ భారతీయులే. ఖగోళ శాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరకుడు, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్పవారంతా ఇక్కడివారే. 2వేల ఏళ్ల వెనక్కి వెళితే ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలుగా పరిగణిస్తున్న అమెరికా, జపాన్, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటివి ఎంతో వెనుకబడి ఉన్నాయి. అప్పట్లోనే మన దేశ జీడీపీ ప్రపంచ జీడీపీలో 40శాతం ఉండేది. నాలెడ్జి ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్‌గానే ఉండేది. కానీ వలస పాలన, మన ఆర్థిక విధానాల కారణంగా వెనుకబడ్డాం. 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలవ్వగానే మనం అందిపుచ్చుకున్నాం."

2047 నాటికి మనమే టాప్

"మాజీ ప్రధాని వాజపేయి తెచ్చిన సంస్కరణలతో దేశాభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయి. ఇప్పుడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మనం బలంగా ఉన్నాం. ప్రపంచంలో పేరున్న ఐటీ కంపెనీలకు భారతీయులే సారథ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంది. రాబోయే అనేక శతాబ్దాల పాటు భవిష్యత్తు భారత్‌దే. ఆ దిశగా మోదీ స్థిరమైన ప్రభుత్వంతో పాటు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వంటి వ్యక్తులు తగిన వేదిక రూపొందిస్తున్నారు. ఈ సమయంలోనే సమాజంలో పేద, ధనిక మధ్య అంతరాలు తగ్గే విధంగా వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన సమ్మేళనం మంచి వేదిక. సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ దేశాభివృద్ధి కోసం ఆర్ఎస్ఎస్ చీఫ్ కృషి చేస్తున్నారు." అని చంద్రబాబు అన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఏఐ వంటి వాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటమ్ కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

భారత్ విశ్వగురు కావాలి



భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

(మొదటి పేజీ తరువాయి)

అన్ని ప్రాణులూ సుఖంగా జీవించాలి. అదే నిజమైన అభివృద్ధి. విశ్వానికి ఏదో చేయాలన్న తపన భారత్‌కు ఉంది. త్వరలోనే విశ్వ గురు స్థానాన్ని అధిరోహించి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని తీరుతుంది. జ్ఞాన పిపాసకు వివేకం తోడు కావాలి. విజ్ఞానమంటే ప్రపంచ శ్రేయస్సు అనే భావన అందరిలో కలగాలి. ప్రతి వ్యక్తి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం పొంది జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలి. ఈ దిశగా విజ్ఞాన భారతి బాధ్యత తీసుకుని అధ్యాపకులతో, శాస్త్ర పరిశోధకులతో సదస్సులు, చర్చాగోష్ఠులు నిర్వహించడం అభినందనీయం." అని మోహన్ భాగవత్ అన్నారు. మనిషికి సమాజంపై దృష్టి, చింతన ఉండాలని, అలాగే సమాజానికి ప్రకృతిపై దృష్టి ఉండాలన్నారు. సైన్స్ మంచిదే కానీ దానికి వివేకం, నైతిక విలువలు కూడా తోడు కావాలని అభిప్రాయపడ్డారు. విజ్ఞానాన్ని మంచికి ఎలా వాడాలన్న బుద్ధి భారతీయులకు ఉందని, కానీ ఇతరుల్లో చాలా మందికి ఆ ఆలోచన లేదన్నారు. మాతృభాషలో చదువు మంచిదని, ఎవరికి ఏ భాష తెలుసో, ఆ భాషలోనే వారికి జ్ఞానం, విజ్ఞానం అందించాలని కోరారు. పది వేల ఏళ్లుగా మనం పొలాలు సాగు చేస్తున్నామని, అయితే ఎక్కడా భూమి పాడవకపోవడానికి మన ప్రాకృతిక సాగు విధానాలే కారణాలన్నారు. కాగా, సుమారు 3500 స్టార్టప్‌లతో దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు దూసుకెళుతోందని, గ్లోబల్ ఇండెక్స్‌లో 81వ ర్యాంకు నుంచి భారత్ 38వ ర్యాంకుకు చేరుకుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేందర్ సింగ్ అన్నారు. కాగా, సదస్సులో విజ్ఞాన భారతి చైర్మన్ శేఖర్ పాండే, డీఆర్‌డీవో మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి, జాతీయ సంస్కృత వర్శిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్‌కే మూర్తి తదితరుల తోపాటు దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీలు, ఐసర్‌లు, ఇతర ఉన్నత విద్యా సంస్థలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీల ప్రగతి

- కూటమి పెద్దలతో మాట్లాడి సమస్యలు పరిష్కారం
- ఓబీసీ మోర్చా సమావేశంలో బీజేపీ అధ్యక్షుడు మాధవ్

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాలుగా పేర్కొంటున్న వారిని వెన్నెముకగా గౌరవిస్తోన్న బీజేపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు



రొంగలి గోపీ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన పదాధికారుల సమావేశానికి మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని బీసీల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన తర్వాత మాధవ్ మాట్లాడుతూ... భారత దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన పార్టీ బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసిందని మండిపడ్డారు. బ్యాలెట్ బాక్స్ వద్దే బీసీలను ఇతర పార్టీలు ఆపేస్తే బీజేపీ నాయకుల్ని చేసి ఉన్నత స్థానాల్లో కూర్చోబెట్టిందన్నారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని కుల వృత్తుల బీసీలకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాటిచ్చారు. బీసీల్లో ఇప్పటికీ అనేక కులాలు వివక్షకు గురవుతున్నాయని, ఓబీసీ మోర్చా ద్వారా బీసీలను సంఘటితం చేస్తామని మాధవ్ అన్నారు.



తిరుపతిలో నూతన పోలీసు కార్యాలయాన్ని ప్రారంభించి డైరీలో సంతకం చేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో హోం శాఖ మంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని, ఎమ్మెల్యేలు ఆరణి, పులవర్తి నాని, డీజీపీ గుప్తా



తిరుపతిలో నూతన పోలీసు కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో హోం శాఖ మంత్రి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

రౌడీయిజం చేస్తే రాష్ట్ర బహిష్కరణే

- రాజకీయాల ముసుగులో నేరాలు చేస్తే ఊరుకోం
- తిరుపతిలో నూతన పోలీస్ కార్యాలయం ప్రారంభించిన చంద్రబాబు

తిరుపతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రౌడీయిజం చేసేవారిని రాష్ట్రం నుంచి బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం తిరుపతిలో నూతన జిల్లా పోలీసు కార్యాలయ భవన సముదాయాన్ని చంద్రబాబు ప్రారంభించి మాట్లాడారు. కొందరు రాజకీయ ముసుగులో ఉండి రౌడీయిజం చేస్తామంటే ఊరుకునేది లేదని, సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారినైనా సరే జైలుకు పంపించిన చరిత్ర తమదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, తిరుమల పవిత్రతను కూడా దెబ్బతీశారని మండిపడ్డారు. రోడ్లు బ్లాక్ చేయడం, రప్పార ప్పాలాడించడం ఏమిటో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో మామిడి కాయలు తొక్కించారని, గుంటూరులో ఓ వ్యక్తిని కాన్వాయ్ కింద తొక్కించి పొదల్లో పడేసి పోయారని ధ్వజమెత్తారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ అసభ్య పోస్టులు పెట్టే వారిపై ప్రభుత్వం నిఘా ఉంచిందన్నారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇలాగైతే డ్యాం నిర్వహణ ఎలా?



- శ్రీశైలం ప్రాజెక్టులో ఇంజనీర్ల కొరత
- వివిధ హోదాల్లో 59 ఇంజనీరింగ్ పోస్టులు
- వీటిలో 43 ఖాళీ.. పని చేస్తున్నది 16 మందే
- కీలకమైన ఎస్ఈ, ఈఈ స్థానాల్లో ఇన్‌చార్జులు
- చివరకు ఆపరేటర్ల నియామకమూ లేదు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిపుణుల ఆవేదన

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

నిత్యం అందుబాటులో ఉంటూ శ్రీశైలం డ్యాం భద్రత పరిరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన ఇంజనీర్ల నియామకంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది. ప్రాజెక్టు మెయింటినెన్స్ సర్కిల్ పరిధిలో డ్యాం, క్యాంప్స్ అండ్ బిల్డింగ్స్ నిర్వహణ కోసం 3 డివిజన్లు, 10 సబ్ డివిజన్లుగా విభజించారు. ఎస్ఈ, ముగ్గురు ఈఈలు, 11మంది డీఈఈలు, 44మంది ఏఈఈ/ఏఈలతో కలిపి 59 పోస్టులు ఇంజనీరింగ్ అధికారుల పోస్టులు మంజూరు చేశారు. మెయింటినెన్స్ డివిజన్ పరిధిలో 5 సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటిలో ఐదుగురు డీఈఈలకు గాను ముగ్గురు, 20 మంది ఏఈఈలకు 8మందే పనిచేస్తున్నారు. క్యాంప్ అండ్ బిల్డింగ్స్ డివిజన్ పరిధిలోని ఐదు సబ్ డివిజన్లలో ఐదుగురు డీఈఈలకు ఇద్దరు, 18మంది ఏఈఈలకు ఇద్దరు ఉన్నారు. ప్రాజెక్టు సర్కిల్ పరిధిలో ఉన్న ఒక డీఈఈ పోస్టును భర్తీ చేశారు. కానీ ఆరుగురు ఏఈఈలకు గాను ఒక్కరినీ నియమించలేదు. మొత్తంగా 43 ఇంజనీరింగ్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డ్యాం భద్రత, ప్రతిపాదనల తయారు, మరమ్మతులపై కీలక నిర్ణయం తీసుకోవాల్సిన ఎస్ఈ స్థానంలో కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కర్నూలు నుంచి శ్రీశైలానికి మధ్య 180 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఘాట్ మార్గం కావడంతో కర్నూలు నుంచి వెళ్లి రావడానికి 10-11 గంటలకు పైగా సమయం పడుతుంది. దీంతో ఇన్‌చార్జి ఎస్ఈ వారంలో 2-3 రోజులకు మించి వెళ్లడం లేదని తెలుస్తోంది. డ్యాంలో పనిచేసే ఇంజనీర్లకు ఎస్ఈతో అవసరం పడితే వారే కర్నూలు రావలసి వస్తోంది. ఎస్ఈ తర్వాత కీలకమైన డ్యాం మెయింటినెన్స్ డివిజన్ ఈఈ పోస్టును భర్తీ చేయకపోగా.. నంద్యాల ఎస్ఆర్‌బీసీ డివిజన్ ఈఈ వేణుగోపాల్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. నంద్యాల నుంచి కూడా శ్రీశైలానికి 160 కిలోమీటర్లకు పైగా ఉంటుంది. వెళ్లి రావాలంటే పది గంటలకు పైగా సమయం పడుతుంది. కీలకమైన క్యాంప్ అండ్ బిల్డింగ్స్ డివిజన్ ఈఈగా ప్రాజెక్టు సర్కిల్ ఆఫీసులో డీఎస్ఈగా పనిచేసే సురేశ్‌కు అదనపు బాధ్యతలు ఇచ్చారు. అంటే ఎస్ఈ సహా ఏఈఈల వరకు వివిధ హోదాల్లో 59 మంది ఇంజనీరింగ్ అధికారులు పని చేయాల్సి ఉంటే వారిలో 16 మంది డీఈఈ, ఏఈఈలను మాత్రమే నియమించారు. ఎస్ఈ, ఈఈలను ఇన్‌చార్జిలతో నెట్టుకొస్తున్నారు. వారంలో 2-3 రోజులు విజిటింగ్ అధికారుల్లా వచ్చి వెళ్తుండడంతో.. 2009 తరహాలో భారీ వరదలొస్తే డ్యాం పరిస్థితేమిటని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. గేట్లు, గ్యాలరీలు, వాటిలోని డ్రైనేజీ సిస్టమ్స్, క్రేన్లు, రీడింగ్, లిఫ్టులు, ఎలక్ట్రికల్ సప్లయ్, జనరేటర్ల నిర్వహణకు 45 నుంచి 50 మంది వరకు ఆపరేటర్లు అవసరం. ఇప్పుడు 12-15 మందే ఉన్నారు.

ఎన్నో పనులు సిద్ధం..

శ్రీశైలం డ్యాం శాశ్వత మరమ్మతులు, ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటు కోసం కూటమి ప్రభుత్వం రూ.203.95 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే రూ.5.9 కోట్లతో డ్యాం ఇరువైపులా కొండ రాళ్లు జారిపడకుండా షాట్‌క్రీటింగ్ పనులు చేస్తున్నారు. 2009లో వరదలకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు (డ్యాం నిర్వహణ, మరమ్మతుల్లో అత్యంత కీలకమైన రోడ్డు) నిర్మాణం కోసం రూ.25.50 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన బీ అండ్ బీ సంస్థ పనులు దక్కించుకుంది. సీవోటీ అప్రూవల్ వచ్చింది. వారం పది రోజుల్లో పనులు మొదలు పెట్టి జూన్ ఆఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో పాటు డ్యాం పునాదులకు ప్లంజ్‌పూల్ గొయ్యి నుంచి ప్రమాదం పొంచి ఉండడంతో.. డ్యాం రక్షణ దృష్ట్యా పూర్తిగా శిథిలమైన 62 ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్లను పూర్తిగా తొలగించి వాటి స్థానంలో దాదాపు రూ.180 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. ఇన్ని పనులను పెట్టుకుని.. 43 ఇంజనీరింగ్ పోస్టులను ఖాళీగా ఉంచి.. కీలకమైన పోస్టుల్లో ఇన్‌చార్జులను పెట్టడంతో రూ.వందల కోట్లతో చేపట్టే పనుల పర్యవేక్షణ ఎలా సాధ్యమనేది ప్రశ్న. రిటైరైన ఇంజనీర్ల స్థానంలో కొత్తవారిని నియమించకుండా ఎన్నాళ్లు ఇన్‌చార్జులతో బండి లాగిస్తారని నిపుణులు అడుగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తెలుగు రాష్ట్రాల జీవనాడిగా ఉన్న శ్రీశైలం భద్రత, పర్యవేక్షణ దృష్ట్యా ఖాళీగా ఉన్న ఎస్ఈ, ఈఈ, డీఈఈ పోస్టులు పూర్తి స్థాయిలో, ఏఈఈ/ఏఈ పోస్టులు కనీసం సగమైనా భర్తీ చేయాలని సూచిస్తున్నారు.

ఖాళీ స్థానాల్లో ఇన్‌చార్జులను పెట్టాం

ఈ అంశంపై ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఐదు డీఈఈ, 34 ఏఈఈ పోస్టులు ఖాళీగా ఉన్న మాట నిజమేనన్నారు. అయితే ఆ స్థానాల్లో ఇన్‌చార్జులను నియమించినట్లు తెలిపారు.



షార్‌కు ప్రత్యేక వాహనంలో తీసుకెళ్తున్న ఈవోఎస్-ఎన్1 ఉపగ్రహం

జనవరి 10న పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగం

- షార్‌కు చేరిన ఈవోఎస్-ఎన్1 ఉపగ్రహం

సూళ్లూరుపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన భారీ ఉపగ్రహం బ్లూబర్డ్ ప్రయోగంతో ఈ ఏడాదిని ఘనంగా ముగించిన ఇస్రో.. కొత్త ఏడాది ఆరంభంలోనే మరో ప్రయోగానికి సిద్ధమవుతోంది..! తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి జనవరి 10న పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ప్రయోగం నిర్వహించనుంది. ఈ రాకెట్ ద్వారా రోదసిలోకి పంపే ఈవోఎస్-ఎన్1 ఉపగ్రహాన్ని శుక్రవారం బెంగళూరు నుంచి భారీ భద్రత నడుమ షార్‌కు తీసుకొచ్చారు. పర్యావరణ పరిశోధన నిమిత్తం ఇస్రో ఈ ఉపగ్రహాన్ని ప్రయోగిస్తోంది. వ్యవసాయం, భూ పరిశీలన, నీటి వనరుల పర్యవేక్షణ, వాతావరణంపై అధ్యయనాలకు ఈ ఉపగ్రహం ఉపయోగపడుతుంది. దీంతో పాటు మన దేశంలోని ఓ యూనివర్సిటీ విద్యార్థులు రూపొందించిన చిన్న ఉపగ్రహం, అమెరికాకు చెందిన మరో బుల్లి ఉపగ్రహాన్ని కూడా కక్ష్యలోకి పంపనున్నారు. ఇప్పటికే షార్‌లోని వ్యాబ్‌లో పీఎస్ఎల్వీ రాకెట్ మూడు దశల అనుసంధాన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. షార్‌కు చేరిన ఉపగ్రహాన్ని శాటిలైట్ ప్రిపరేషన్ బిల్డింగ్‌లో పెట్టి పరీక్షించనున్నారు. అనంతరం పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఉపగ్రహాన్ని అనుసంధానం చేసి రాకెట్‌ను ప్రయోగానికి సిద్ధం చేస్తారు.

సెలవుల మూడ్‌లో సచివాలయం

▸ 25వ తేదీ నుంచి 5 వరకు ఎఫెక్ట్

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఉద్యోగులు, సందర్శకులతో నిత్యం కళకళలాడే సచివాలయం వరుస సెలవులతో బోసిపోయింది. ఏడాది చివరిలో అమరావతి సచివాలయం సెలవుల మూడ్‌లోకి వెళ్లిపోయింది. క్రిస్మస్ సందర్భంగా 25వ తేదీ గురువారం సెలవు. ఆ మరుసటి రోజు 26వ తేదీ శుక్రవారం ఆప్షనల్ హాలిడే కావడంతో సచివాలయంలో ఉద్యోగుల హాజరు, సందర్శకుల సంఖ్య తక్కువగానే కనిపించింది. తర్వాత వరుసగా 27, 28వ తేదీలు శని, ఆదివారాలు వారంతపు సెలవులు. ఏడాది చివరి కావడంతో సాధారణ, ఐచ్ఛిక సెలవులకు మధ్యలో వచ్చిన పని దినాల్లో ఉద్యోగులు తమకు ఉన్న సెలవులను వినియోగించుకుంటున్నారు. 29వ తేదీ సోమవారం పనిదినం కావడంతో పాటు క్యాబినెట్ సమావేశం ఉంది. క్యాబినెట్‌కు సంబంధించిన ఉద్యోగులు మాత్రమే విధులకు వచ్చే అవకాశం ఉంది. 30వ తేదీ వైకుంఠ ఏకాదశి పండగ కావడంతో ఉద్యోగులు సెలవులను ఉపయోగించుకునే అవకాశం ఉంది. అలాగే 31 తేదీ ఈ ఏడాది చివరి రోజు కావడంతో ఉద్యోగులు సెలవులను వాడుకునే అవకాశం ఉంది. జనవరి 1వ తేదీ ఆప్షనల్ హాలిడే. పలువురు ఉద్యోగులు సెలవును వినియోగించుకున్నా, మరికొంత మంది విధులకు హాజరైనా న్యూ ఇయర్ శుభాకాంక్షలకు మాత్రమే పరిమితమయ్యే అవకాశం ఉంది. జనవరి 2వ తేదీ శుక్రవారం వర్కింగ్ డే. ఆ తర్వాత వరుసగా శని, ఆదివారాలు సెలవులు. దీంతో జనవరి 5వ తేదీ నుంచి సచివాలయంలో పూర్తి స్థాయిలో ఉద్యోగుల హాజరు, కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

10 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేకాధికారుల పాలన గడువు పెంపు

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 10 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యేకాధికారుల పాలన గడువును పెంచుతూ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కందుకూరు, ఆమదాలవలస, నరసారావుపేట, పొన్నూరు, కావలి, చింతలపూడి నగర పంచాయతీ, వైఎస్ఆర్ తాడిగడప, పొదిలి నగర పంచాయతీ, అల్లూరు నగర పంచాయతీ, బి.కొత్తకోట నగర పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పదవీ కాలం జనవరిలో ముగియనుండటంతో వారి పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు లేక ఎన్నికలు జరిగేవరకు పొడిగిస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పలువురు మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌ను పార్వతీపురం మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమించి... అక్కడ పనిచేస్తున్న కిశోర్ కుమార్‌ను సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని సూచించారు. నరసాపూర్ మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్యను అనంతపురం డిప్యూటీ కమిషనర్‌గాను, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఆర్.వెంకట్రామిరెడ్డిని నరసాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. టిడ్కో జనరల్ మేనేజర్‌గా ఉన్న ఆర్‌డీఎంఏ యు.శారదాదేవిని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గాను, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ డి.కొండయ్యను పెడన కమిషనర్‌గాను, పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్న ఎం.మంజునాథ్ గౌడ్‌ను ప్రొద్దుటూరు మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గాను, వెయిటింగ్‌లో ఉన్న డేనియల్ జోసెఫ్ చీరాల మున్సిపల్ కమిషనర్‌గాను, అక్కడ ఉన్న కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ సూపర్‌వైజర్‌గా ఉన్న లక్ష్మినారాయణను రాజంపేట మున్సిపల్ కమిషనర్‌గా నియమించి అక్కడ పనిచేస్తున్న జి.శ్రీనివాసులను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. జీవీఎంసీ జోన్-1(భీమిలి)లో మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న నాయుడును జోన్-2కు(మధురవాడ) మారుస్తూ ఆదేశాలిచ్చారు. వెంకటగిరి మున్సిపాలిటీ కమిషనర్‌గా ఉన్న జి.వెంకట్రామిరెడ్డిని నందికొట్కూరు మున్సిపాలిటీకి బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న ఎస్.బేబీని సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని, వెయిటింగ్‌లో ఉన్న రెవెన్యూ అధికారి పి.శ్రీధర్‌ను కనిగిరి మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమించారు.

నిమ్మకూరు ఓ తీపి జ్ఞాపకం

▸ గ్రామాభివృద్ధికి పూర్తిగా సహకరిస్తాం

▸ పేదరికం లేని సమాజమే చంద్రబాబు ధ్యేయం

▸ సీహెచ్‌సీ శంకుస్థాపన కార్యక్రమంలో భువనేశ్వరి

పామర్రు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముందుకు సాగుతూ నిరంతరం ప్రజల గురించి ఆలోచించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని ఆయన సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. ఆమె శుక్రవారం కృష్ణా జిల్లా పామర్రు మండలం నిమ్మకూరులో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో కమ్యూనిటి హెల్త్ సెంటర్ పనులకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాతో కలసి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామస్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

నిమ్మకూరు ఓ తీపి జ్ఞాపకం: నారా భువనేశ్వరి

'నిమ్మకూరు రావడం ఓ తీపి జ్ఞాపకం. చిన్ననాటి రోజులు గుర్తుకొస్తున్నాయి. బాల్యంలో పాఠశాల సెలవుల్లో అమ్మ బసవతారకమ్మ మమ్మల్ని నిమ్మకూరుకు పంపించేది. ఇక్కడ ఎక్కువగా నా సోదరి శారద ఉండేవారు. ఇక్కడకు వచ్చినప్పుడు ఆర్టీసీ బస్సులో పామర్రుకు సినిమాలు చూసేందుకు వెళ్లేవాళ్లం. నేడు ఫోన్లు, కార్లు కావాలని అడుగుతున్నారు. అది అంతశ్రేయస్కరం కాదు. నా చిన్నతనంలో నాన్న ఎన్టీఆర్ ఎంతో కష్టపడి గ్రామంలో ఇంటింటికి తిరిగి సైకిల్‌పై పాలు అమ్మి కుటుంబ సభ్యుల్ని ఎంతో ఉన్నత స్థాయికి తీసుకువెళ్లిన కారణజన్ములు. అన్ని రంగాల్లో మగవారికి దీటుగా రాణిస్తున్న మహిళలను ఆదర్శంగా బాలికలు తీసుకుని ముందుకు సాగాలి. ఐటీ రంగంలో అద్భుతమైన ప్రతిభను మహిళలే కనబరుస్తున్నారు. నిమ్మకూరు గ్రామాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంతో ముందుకు వెళుతున్న సీఎం ఆలోచనకు సంపన్నులు ముందుకు రావడం సంతోషకరం' అని భువనేశ్వరి పేర్కొన్నారు. తొలుత గ్రామంలోని ఏపీఆర్జేసీ పాఠశాల, కళాశాలను సందర్శించారు. విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి తదితరులు కూడా పాల్గొన్నారు.



ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నివాళులర్పిస్తున్న భువనేశ్వరి

'మెడికల్ అన్‌ఫిట్'లకు ప్రత్యామ్నాయ ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులైన వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం లేదా పరిహారాన్ని ఆర్టీసీ చెల్లించేది. మరోవైపు అనారోగ్యం (21 రోగాలు) బారిన పడిన ఉద్యోగులకు ప్రత్యామ్నాయం కల్పించేంది. ఇదిలా ఉండగా... గత వైసీపీ సర్కారు ఉద్యోగులను మాత్రమే ప్రభుత్వంలో విలీనం చేయడంతో కారుణ్య నియామకాలతో పాటు మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ఉద్యోగ సంఘాలు నిరసనకు దిగుతామని హెచ్చరించడంతో కారుణ్య నియామకాల వరకూ సమ్మతించింది. అది కూడా ఆర్టీసీలో ఖాళీల్లేవంటూ జిల్లాల్లోనే ఏదో ఒక ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. అయినా వందల మంది ఇప్పటికీ కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కూటమి ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశాయి. వీటిని పరిశీలించిన చంద్రబాబు ప్రభుత్వం శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గతంలో కన్నా మెరుగ్గా డ్రైవర్లతో పాటు కండక్టర్లు, ఇతర ఉద్యోగులకు సైతం ప్రత్యామ్నాయం లభించనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో ఐదు రకాల రోగాల బారినపడిన వారికి మాత్రమే ప్రత్యామ్నాయ ఉద్యోగాలిచ్చేలా నిబంధనలున్నాయి. అయితే ఆర్టీసీ సిబ్బందికి మినహాయింపునిచ్చి పాత పద్ధతిలోనే 21 రకాల అనారోగ్యాలతో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి కూడా ఉద్యోగాలిచ్చేలా సడలింపు ఇచ్చినట్లు ప్రభుత్వం తాజా ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఆర్టీసీలో క్లరికల్ ఉద్యోగాలకు అర్హత లేకపోతే ఇతర ప్రభుత్వ విభాగాల్లో అర్హతను బట్టి ఉద్యోగాలివ్వాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది. ఏ ఉద్యోగానికీ అర్హతలేని వారు.. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటే అదనపు మానిటరీ ప్రయోజనాలు ఇవ్వాలని ఆర్టీసీ ఎండీని ఆదేశించింది. ఈ నిర్ణయంతో 500కు పైగా కుటుంబాల్లో సంతోషం వెల్లివిరియనుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ పాలకమండలి తీర్మానానికి ఆమోదం తెలిపి, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన సీఎంకు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మచిలీపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్టీసీ బోర్డులో ప్రతిపాదించిన విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన వెంటనే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క ఉద్యోగీ నష్టపోకుండా ఉండాలని ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నామని అన్నారు. కాగా, ఈ నిర్ణయం పట్ల ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు, ఎన్ఎంయూ రాష్ట్ర నాయకుడు పీవీ రమణా రెడ్డి, కార్మిక పరిషత్ రాష్ట్ర నేత శేషగిరి, వైఎస్ఆర్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా చంద్రయ్య.. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ జీవో విడుదలకు రవాణా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఉన్నతాధికారులు ఎంతో సహకరించారని ఈయూ నేతలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎండీ ద్వారకా తిరుమలరావుకు దుశ్శాలువా కప్పి కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుని సత్కరిస్తున్న ఉద్యోగులు

ఆర్టీఐ కమిషనర్లపై కసరత్తు కొలిక్కి!

▸ చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు పేరు పరిశీలన

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు (ఆర్‌టీఐ) కమిషనర్ల నియామకంపై కసరత్తు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈ నియామకాలపై సీఎం చంద్రబాబు టీడీపీ నాయకులతో ఇప్పటికే ఒక దఫా చర్చలు జరిపినట్లు సమాచారం. ప్రధాన కమిషనర్(చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్)గా ప్రముఖ న్యాయవాది వజ్జా శ్రీనివాసరావు పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆర్టీఐలో ముగ్గురు కమిషనర్లు ఉండగా మరో ఐదుగురిని నియమించాలని నిర్ణయించారు. ఆ ఐదుగురిలో ముగ్గురి పేర్లు దాదాపు ఖరారైనట్లు సమాచారం. వీరంతా న్యాయవాదులే. కడపకు చెందిన రవి యాదవ్, అనంతపురానికి చెందిన ఆదెన్న, విశాఖకు చెందిన పీఎస్ నాయుడి పేర్లను పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరితోపాటు మరో ఇద్దరిని కమిషనర్లుగా నియమించనున్నారు. ఆర్టీఐ కమిషనర్లను ఖరారు చేసేందుకు సెలెక్షన్ కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కమిటీలో సీఎం, సీనియర్ మంత్రి, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేత ఎవ్వరూ లేకపోవడంతో మరో సీనియర్ మంత్రిని కమిటీలోకి తీసుకుని పేర్లను ఖరారు చేసి గవర్నర్ ఆమోదానికి పంపనున్నారు. గవర్నర్ ఆమోదం పొందిన తర్వాత త్వరలో ఆర్టీఐ ప్రధాన కమిషనర్‌తోపాటు కమిషనర్ల పేర్లను ప్రకటించే అవకాశం ఉంది.

ఏఐ ప్రాజెక్టులకు ఏపీని సిద్ధం చేస్తున్నాం: లోకేశ్

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): 'కృత్రిమ మేధ(ఏఐ)ని అందిపుచ్చుకోవడంలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉండటం యాదృచ్ఛికం కాదు. పాలన, ఫిన్‌టెక్, ఆరోగ్య రంగం వంటి వాటిలో ఏఐ వినియోగాన్ని గణనీయంగా పెంచడం ద్వారా ఈ ఘనత సాధించాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. 'కృత్రిమ మేధ విస్తృత వినియోగం ద్వారా ఏఐ హబ్‌లు, డేటా సెంటర్లకు డిమాండ్ పెంచుతున్నాం. అదే సమయంలో మౌలిక వసతులతో కూడిన ఏఐ డేటా సెంటర్లు, విద్యుత్తు, భూమి, త్వరితగతిన అనుమతులు ఇవ్వడం ద్వారా ఏపీని కృత్రిమ మేధ ప్రాజెక్టుల ఏర్పాటుకు అనువుగా సిద్ధం చేస్తున్నాం' అంటూ లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తన పోస్టుకు ఏఐ అడాప్షన్ ర్యాంకింగ్‌లో 53 శాతంతో ఇండియా అగ్రస్థానంలో నిలిచిందన్న వార్తను ట్యాగ్ చేశారు.

కృష్ణా జిల్లాలో చమురు, గ్యాస్ అన్వేషణ

▸ 20 బావుల తవ్వకానికి వేదాంత సంస్థకు షరతులతో అనుమతి

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో చమురు, గ్యాస్ నిక్షేపాల అన్వేషణ జరుగనుంది. 20 చమురు, గ్యాస్ బావులు తవ్వేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముంబైకి చెందిన వేదాంత లిమిటెడ్(కెయిర్న్స్ ఆయిల్ అండ్ గ్యాస్ డివిజన్)కు షరతులతో కూడిన అనుమతులు ఇచ్చింది. నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) ఇస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ (డీఎస్ఎఫ్-2018) విధానం కింద ఆన్‌షోర్ ఆయిల్/గ్యాస్ క్షేత్రం అభివృద్ధి పనులు తమకు దక్కాయని.. కృష్ణా బ్లాక్‌లో 35 చోట్ల తవ్వకాలకు ఎన్‌వోసీ ఇవ్వాలని, ఈ బ్లాక్ గుండానే బందరు కాలువ ప్రవహిస్తోందని వేదాంత కోరింది. దీనిని పరిశీలించిన ప్రభుత్వం.. 20 చోట్ల తవ్వకాలకు ఎన్‌వోసీ ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇరిగేషన్ ఈఎన్‌సీ, కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్, కృష్ణా జిల్లా కలెక్టర్ ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఇది ఇరిగేషన్‌కు సంబంధించిన ఎన్‌వోసీ మాత్రమేనని.. పైగా తాత్కాలికమని.. తవ్వకాలు ప్రారంభించే ముందు సంబంధిత ఇతర శాఖల నుంచి సదరు సంస్థే అనుమతులు తీసుకోవాలని స్పష్టంచేసింది. అలాగే వేదాంత సంస్థ బందర్ కెనాల్ నుంచి గానీ, కృష్ణా డెల్టా సిస్టమ్ కెనాల్ నెట్‌వర్క్, డ్రైనేజీ నెట్‌వర్క్, చెరువులు, జలాశయాలు, ఇతర నీటి వనరుల నుంచి గానీ నీరు తీసుకోవడానికి వీల్లేదని షరతు విధించింది. వేదాంత లిమిటెడ్‌కు చెందిన కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ డివిజన్.. దేశంలోనే అతిపెద్ద ప్రైవేటు ఆయిల్-గ్యాస్ అన్వేషణ-ఉత్పత్తి కంపెనీ. భారత ముడిచమురు ఉత్పత్తిలో దానికి 25 శాతం వాటా ఉంది. ఈ భాగస్వామ్యాన్ని 50 శాతానికి పెంచుకోవాలని భావిస్తోంది.



మదనపల్లె సబ్‌జైలు నుంచి జనార్దన్‌రావును విచారణకు తీసుకెళ్తున్న ఎక్సైజ్ పోలీసులు

జోగి చెప్పాడు.. మేం చేశాం!

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించినట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారుల విచారణలో ఆయన కీలక విషయాలు చెప్పినట్టు సమాచారం. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నవంబరు 28వ తేదీన అరెస్టై మదనపల్లె సబ్‌జైలులో ఉన్న జనార్దన్‌రావు (ఏ1)తో పాటు ఆయన తమ్ముడు జగన్మోహన్‌రావు(ఏ26), తాండ్ర రమేశ్ (ఏ28), తిరుమలశెట్టి శ్రీనివాసరావు (ఏ27), షేక్ అల్లాబక్ష(ఏ29)లను మూడు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఉమర్ ఫరూక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐదుగురు నిందితులను శుక్రవారం ఎక్సైజ్ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. తొలుత జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం విచారణ నిమిత్తం మదనపల్లె ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర నిందితులను సుదీర్ఘంగా విచారించారు. "జోగి రమేశ్ చెప్పడంతో 2023లో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ ప్రారంభించాం. ఆ తరువాత 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక కొద్ది రోజులు ఆపి తిరిగి ప్రారంభించాం. ఆయన చెప్పడంతోనే ములకలచెరువులోనూ ఈ ఏడాది జూన్-జూలైలో నకిలీ మద్యం తయారీ మొదలు పెట్టాం" అని జనార్దన్‌రావు వెల్లడించినట్లు తెలిసింది. అలాగే మిగిలిన నిందితులను కూడా విచారించారు. అందరినీ కలిపి, వేర్వేరుగా విచారించి కీలక విషయాలను రాబట్టారు. మరో రెండు రోజులు వీరిని విచారించనున్నారు. కాగా అద్దేపల్లి జనార్దన్‌రావును విచారించేందుకు శనివారం విజయవాడ నుంచి సిట్ ఉన్నతాధికారులు మదనపల్లెకు రానున్నట్లు తెలిసింది.

కోస్తా సీమలను కమ్మేసిన మంచు, చలి

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లో పొగమంచు, చలి కొనసాగుతున్నాయి. ఉత్తరాది నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో అన్నిచోట్లా చలి వాతావరణం నెలకొంది. మైదాన ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువగా నమోదవుతున్నాయి. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టులో 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు, మూడు రోజుల్లో చలి, పొగమంచు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

20 కోట్లు కొల్లగొట్టి.. సీఐడీకి చిక్కి..

▸ గాజువాకలో అంతర్జాతీయ సైబర్ ముఠా అరెస్ట్

▸ దేశంలో పలుచోట్ల డెన్లు ఏర్పాటు చేసుకుని మోసాలు

▸ ఏపీలో రూ.20 కోట్లకు పైగా దోచుకున్న నేరగాళ్లు

▸ వియాత్నాం, కాంబోడియా, లావోస్ నుంచి ప్లాన్ అమలు

▸ కింగ్ పిన్ హో హుడే సహా ఏడుగురు కేటుగాళ్లు అరెస్టు

▸ సీఐడీ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడి

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చైనా నుంచి ఎయిర్ కార్గోలో సిమ్ బాక్స్‌లు తీసుకొస్తారు.. భారత్‌లోని వివిధ ప్రాంతాల్లో డెన్‌లు ఏర్పాటు చేసుకొని.. ఇక్కడ వందల కొద్దీ సిమ్ కార్డులు అక్రమంగా సేకరిస్తారు...! కాంబోడియా, వియత్నాం వంటి దేశాల నుంచి మొత్తం వ్యవహారం నడిపిస్తారు.. ప్రజలకు ఫోన్లు చేసి డిజిటల్ అరెస్ట్ మొదలు రకరకాల దర్యాప్తు సంస్థల పేరుతో బెదిరిస్తారు.. ఇలా ఏపీలోనూ చాలా మందికి ఫోన్లు చేసి రూ.20 కోట్లకు పైగా కొల్లగొట్టారు.. విశాఖపట్నంలోని గాజువాక (పెదగంట్యాడ) నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఏపీ సీఐడీ తీగ లాగింది. సీఐడీ సీఐ గోపీనాథ్ లాగిన క్లూ తో దేశవ్యాప్తంగా విస్తరించిన సైబర్ ముఠా గుట్టు రట్టయింది. వియత్నాంకు చెందిన కింగ్ పిన్ హో హుడే సహ ఏడుగురిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి 14 సిమ్ బాక్స్‌లు, 1,496 సిమ్ కార్డులు, 22 సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, రౌటర్లు, సీసీ కెమెరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలకు ఫోన్లు చేసి అందినకాడికి లాగేస్తూ... మరోవైపు అంతర్జాతీయ కాల్స్‌ను దేశీయ కాల్స్‌గా మార్చి టెలికం సర్వీస్ ప్రొవైడర్ల ఆదాయానికీ గండికొట్టిన సైబర్ నేరగాళ్లను జైలుకు పంపారు. ఏపీ సీఐడీలోని సైబర్ వింగ్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.. డీఎస్పీ రవికిరణ్ శుక్రవారం మంగళగిరిలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వివరాలు విలేకరులకు వివరించారు.



సైబర్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న సిమ్ బాక్స్‌లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, సీసీ కెమెరాలు

గాజువాకలో సైబర్ డెన్..!

రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాలు అత్యధికం. అందులోనూ డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి డబ్బులు గుంజడం బాగా ఎక్కువైంది. కొన్ని నెలలుగా ఏపీలోని పలు ప్రాంతాల నుంచి బాధితులు చేస్తోన్న ఫిర్యాదులపై కూపీ లాగే క్రమంలో విశాఖపట్నంలోని గాజువాక ప్రాంతంలో సైబర్ నేరగాళ్ల డెన్ ఉన్నట్లు సైబర్ వింగ్ కీలక సమాచారం రాబట్టింది. వైజాగ్‌లో మొదలెట్టి ఒడిశాలోని రూర్కేలా, బిహార్‌లోని నలంద, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా, తెలంగాణలోని హైదరాబాద్, గోవా లాంటి ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు తీసుకుని అక్కడ డెన్‌లు ఏర్పాటు చేసుకున్న అంతర్జాతీయ సైబర్ ముఠా ఏకకాలంలో 64 నుంచి 128 కాల్స్ మాట్లాడే కెపాసిటీ ఉన్న సిమ్ బాక్స్‌లు ఏర్పాటు చేసుకుంది. ఈ సిమ్ బాక్సులను చైనా నుంచి దిగుమతి చేసుకుంది. ఇక్కడ టెలిగ్రామ్ యాప్‌లో సంప్రదించి ఏడుగురి ద్వారా 1,496 సిమ్ కార్డులు సేకరించిన ఈ ముఠా రాష్ట్రంలోని అమాయకులకు ఫోన్లు వేసి బెదిరించేది. కాంబోడియాకు చెందిన సైబర్ కింగ్ పిన్‌లు ప్రతి డెన్‌కూ వచ్చి ఎలా మోసం చేయాలనే దానిపై శిక్షణ ఇచ్చి వెళ్లే వారు. ఇక్కడి తెలుగు, ఒరియా, బెంగాలీ, మరాఠీ, హిందీ తెలిసిన వారిని ఉద్యోగాల పేరిట మోసం చేసి ఈ రొంపిలోకి దింపేవారు. ఈ ముఠా మయన్మార్, లావోస్, కాంబోడియా, వియత్నాం దేశాల నుంచి మొత్తం వ్యవహారం నడిపిస్తోంది. సీఐడీ సైబర్ విభాగం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ నుంచి కీలక సభ్యులు బృందాలుగా ఏర్పడి ఈ ముఠా ఆట కట్టించారు. మరికొంత మంది పరారీలో ఉన్నారని సీఐడీ అధికారులు వెల్లడించారు. ఇటువంటి కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్లు వస్తే, 1930కు తెలియజేయాలని చెప్పారు.

కూల్‌గా మాట్లాడి.. కుప్పకూలి..

▸ మందడం రైతుల భేటీలో అపశ్రుతి

▸ మాట్లాడి కూర్చోబోగా రైతుకు గుండెపోటు

▸ మంత్రి కాన్వాయ్ కారులో ఆస్పత్రికి..

▸ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారణ

తుళ్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో ఎన్-8 రోడ్డు కింద ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న రైతులతో జరిగిన సమావేశంలో ఆ రైతు కూడా పాల్గొని మాట్లాడారు. చాలా కూల్‌గా మాట్లాడి.. ఆ వెంటనే కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తరలిస్తుండగానే మరణించారు. ఈ ఘటన మందడం రైతుల సమావేశంలో చోటు చేసుకుంది. ల్యాండ్ పూలింగ్ యూనిట్ కార్యాలయంలో ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మంత్రి నారాయణ శుక్రవారం నిర్వహించిన సమావేశంలో దొండపాటి రామారావు (రాములు)(75) పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా, దగ్గరకు వచ్చి సీడ్ రోడ్డు పక్కన తనకు స్థలం కేటాయించాలని రాములు కోరారు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత వెనుదిరిగి తన కుర్చీలో కూర్చునే క్రమంలో రాములు కింద పడిపోయారు. ఆయనకు గుండెపోటు వచ్చిందని తెలుసుకొని మంత్రి కాన్వాయ్ కారులో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రాములు మృతి చెందినట్టు డాక్టర్లు ధ్రువీకరించారు. భూసమీకరణలో భాగంగా రాములు ఐదు ఎకరాల భూమిని ఇచ్చారు. ఎన్-8 రోడ్డు కింద ఇళ్లు కోల్పోతున్న వారి జాబితాలో ఆయన ఇల్లు కూడా ఉంది. ఇదే విషయంపై వారం కిందట ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ నిర్వహించిన సమావేశంలో కూడా రాములు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో మాట్లాడుతున్న రాములు, (ఇన్‌సెట్‌లో) కుప్పకూలిన రాములు

జూన్‌కు వెలిగొండ పూర్తి చేయాలి

▸ కాంట్రాక్టు సంస్థకు ప్రభుత్వం ఆదేశం

అమరావతి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జూన్ నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థలను ప్రభుత్వం ఆదేశించింది. శుక్రవారం ఆ ప్రాజెక్టుపై మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు నుంచి టెలీకాన్ఫరెన్సును నిర్వహించారు. మంత్రితోపాటు ప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఒంగోలు డివిజన్ చీఫ్ ఇంజనీరు తదితరులు పాల్గొన్నారు. నల్లమల సాగర్ రిజర్వాయరు నింపేందుకు వీలుగా చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్ తదితర పనులు చేపట్టాలని కాంట్రాక్టు సంస్థను మంత్రి ఆదేశించారు. టన్నెల్ 1, 2 లలోని పనులను జూన్ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఫీడర్, తీగలేరు, తూర్పు ప్రధాన కాలువ పనులను కూడా నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఫీడర్ కాలువ పనులు 2026 డిసెంబరు నాటికి పూర్తి చేయాలన్నారు. అత్యంత సూక్ష్మ స్థాయి విషయాలపైనా నిర్మాణ సంస్థకు నిమ్మల సూచనలు చేశారు.

పోలీసు కస్టడీకి పిన్నెల్లి సోదరులు

▸ 29, 30 తేదీల్లో విచారించేందుకు మాచర్ల కోర్టు అనుమతి



మాచర్ల, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిలను రెండు రోజుల పోలీసుల కస్టడీకి మాచర్ల న్యాయస్థానం అనుమతించింది. మాచర్ల రూరల్ పోలీసులు పిన్నెల్లి సోదరులను తమ కస్టడీ ఇవ్వాలని కోరగా.. దీనిపై శుక్రవారం న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ విచారించారు. వారిద్దరిని ఈ నెల 29, 30 తేదీల్లో విచారించేందుకు అనుమతించారు. దీంతో మాచర్ల రూరల్ పోలీసులు నెల్లూరు జైలుకు వెళ్లి.. పిన్నెల్లి సోదరులను విచారించాల్సి ఉంది. నిందితుల తరఫున న్యాయవాది బార్రెడ్డి నాగిరెడ్డి, ప్రభుత్వం తరుఫున ఇన్‌చార్జి ఏపీపీ ప్రసాద్‌నాయక్ వాదనలు వినిపించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గుండ్లపాడులో గత మే నెల 24న జరిగిన టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, అతని సోదరుడు జెవిశెట్టి కోటేశ్వరరావు హత్య కేసులో రామకృష్ణారెడ్డి (ఏ6), వెంకట్రామిరెడ్డి (ఏ7)గా ఉన్నారు. వీరు ఈ నెల 11న మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయారు. న్యాయమూర్తి ప్రశాంత్ వీరికి 14 రోజుల రిమాండ్ విధించగా.. పిన్నెల్లి సోదరులు ప్రస్తుతం నెల్లూరు జిల్లా జైలులో ఉన్నారు. బుధవారం వీరి రిమాండ్ గడువు ముగియడంతో న్యాయమూర్తి ప్రశాంత్ ఆన్‌లైన్ ద్వారా పిన్నెల్లి సోదరులను విచారించారు. అనంతరం జనవరి 7వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగించారు.

రవికుమార్, కుటుంబ సభ్యుల ఆస్తులపై ఏసీబీ మధ్యంతర నివేదిక

▸ పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామన్న హైకోర్టు

అమరావతి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణి చోరీ కేసులో నిందితుడు రవికుమార్, అతడి కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆస్తులను వేరొకరి పేరు మీదకు బదలాయించారా అనే అంశాలపై దర్యాప్తు చేసి మధ్యంతర నివేదికను ఏసీబీ డీజీ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించారు. నివేదిక పరిశీలించిన అనంతరం తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయస్థానం పేర్కొంది. తదుపరి విచారణను జనవరి 5కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం న్యాయమూర్తి స్పందిస్తూ.. పరకామణి చోరీ ఘటన పై ఇప్పటికే చాలా వరకు దర్యాప్తు పూర్తయిందని, కొన్ని అంశాలపైనే దర్యాప్తు మిగిలి ఉందని గుర్తు చేశారు. ఇందులో వేర్వేరు అంశాలు ఇమిడి ఉన్నందున సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బహుశా మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి ఉంటుందని, ఈ అంశాన్ని పరిశీలించాలని సీఐడీకి సూచించారు.

ఇదీ కేసు..

పరకామణి చోరీ కేసును టీటీడీ బోర్డు తీర్మానం, ఈవో అనుమతి లేకుండానే 2023 సెప్టెంబరు 9న లోక్ అదాలత్ వద్ద ఏవీఎస్‌వో వై.సతీశ్‌కుమార్, నిందితుడు రవికుమార్‌తో రాజీ చేసుకున్న వ్యవహారంపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీఐడీని హైకోర్టు ఆదేశించింది. అలాగే పరకామణిలో చోరీకి పాల్పడిన సీవీ రవికుమార్, అతడి కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తులు, బ్యాంకు ఖాతాలను పరిశీలించడంతో పాటు వారు ఆ ఆస్తులను ఆదాయానికి తగ్గట్లే ఆర్జించారా? ఆస్తులను వేరొకరి పేరు మీద బదలాయించారా? అనే కోణంలో లోతైన దర్యాప్తు చేయాలని ఏసీబీ డీజీకి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం శుక్రవారం మరోసారి విచారణకు వచ్చింది. ఏసీబీ తరఫున న్యాయవాది శ్యాంసుందర్‌రావు స్పందిస్తూ.. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా సీల్డ్‌కవర్‌లో నివేదిక సమర్పించామన్నారు. సీఐడీ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాణిని సోమయాజి వాదనలు వినిపించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.